ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

ప్రకాశం

జిల్లా వార్తలు

బుధవారం 13, ఆగస్టు 2025



కనిగిరిలో ట్రాక్టర్లతో రైతులు చేపట్టిన ర్యాలీ

అన్నదాతల సంబరాలు

- సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ జిల్లాలో ర్యాలీలు
- ప్రత్యేక ఆకర్షణగా ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు
- భారీగా పాల్గొంటున్న రైతులు, టీడీపీ శ్రేణులు
- ఇప్పటికే మూడు నియోజకవర్గాల్లో పూర్తి

పంటల సాగుకు ఆర్థిక తోడ్పాటు కోసం అన్నదాత సుఖీభవ నగదు జమ చేయడంతో రైతులు, తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేసుకుంటున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ జిల్లావ్యాప్తంగా భారీ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కొండపి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా చేశారు. మంగళవారం కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లో చేపట్టిన ర్యాలీలు కోలాహలంగా సాగాయి. పెద్దఎత్తున రైతులు ట్రాక్టర్లతో తరలివచ్చి పాల్గొన్నారు. బుధవారం సంతనూతలపాడుకు సంబంధించిన కార్యక్రమం పల్లామల్లిలో ఏర్పాటు చేశారు. మిగిలిన చోట్ల కూడా ర్యాలీల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు.

ఒంగోలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతుల కోసం కూటమి పార్టీల తరఫున టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.6వేలను మూడు విడతలుగా పీఎం కిసాన్ పథకం కింద ఇస్తుండగా.. గత వైసీపీ ప్రభుత్వం దానికి రూ.7,500 కలిపి రూ.13,500 రైతు భరోసా పేరుతో ఇచ్చింది. కాగా అన్నదాత సుఖీభవ పథకం పేరుతో కేంద్ర ప్రభుత్వంతో అనుసంధానం చేసి వారిచ్చే రూ.6వేలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.14వేలు కలిపి ఏకంగా రూ.20వేల నగదును అందజేయాలని ప్రజాప్రభుత్వం నిర్ణయించి అమల్లోకి తెచ్చింది. తొలివిడత రాష్ట్రంలో సుమారు 47 లక్షల మంది రైతులకు ఒక్కొక్కరికి కేంద్రం వాటా రూ.2వేలు, రాష్ట్రం వాటా రూ.5వేలు కలిపి రూ.7వేల నగదు అందజేశారు. జిల్లాలోని దర్శి నియోజకవర్గం తూర్పువీరాయపాలెం గ్రామం నుంచే ఈ పథకానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం

మిగతా 6వ పేజీలో



కనిగిరిలో నిర్వహించిన ర్యాలీలో ఎడ్లబండిని తోలుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర



గిద్దలూరులో నిర్వహించిన ర్యాలీలో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే ముత్తుముల



మెగా డీఎస్సీ నియామకాలకు రంగం సిద్ధం

సర్టిఫికెట్ల పరిశీలనకు 13 బృందాలు

- స్కోర్ కార్డుల రూపంలో అభ్యర్థుల మార్కుల వివరాలు
- అభ్యంతరాలు తెలిపేందుకు నేడు తుది గడువు

ఒంగోలు విద్య, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మెగా డీఎస్సీ-2025 నియామకాలకు రంగం సిద్ధమైంది. మెగా డీఎస్సీ ఫలితాలను, అభ్యర్థులు సాధించిన మార్కుల వివరాలను స్కోర్ కార్డుల రూపంలో పాఠశాల విద్యాశాఖ సోమవారం రాత్రి విడుదల చేసింది. వీటిని అభ్యర్థులు డీఎస్సీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జిల్లాలో డీఎస్సీకి 629 పోస్టులు ప్రకటించగా 21,559 మంది దరఖాస్తు చేశారు. వీరికి జూన్ 6నుంచి జూలై 2 వరకు 26 రోజులపాటు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు రెండు సెషన్లలో నిర్వహించారు. పరీక్షకు హాజరైన అందరి అభ్యర్థుల తుది మార్కులను ప్రస్తుతం విడుదల చేశారు. వీటిపై అభ్యంతరాలు తెలియజేసేందుకు బుధవారం వరకు గడువు ఇచ్చారు. అలా వచ్చిన వాటిని పరిశీలించి తుది మెరిట్ జాబితాను ప్రకటించనున్నారు. అనంతరం మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో టీచర్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. జిల్లాలో డీఎస్సీ పోస్టుల భర్తీకి సంబంధించి అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు ప్రతి 50 మందికి ఒక బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఆ ప్రకారం జిల్లాలో 629 మందికి 13 బృందాలను నియమిస్తారు. ప్రతి టీంలో ఒక ఎంఈవో, ఒక హెచ్‌ఎం, ఒక డిప్యూటీ తహసీల్దార్ (రెవెన్యూ) ఉంటారు. ఒక పోస్టుకు ఒక ఖాళీని మాత్రమే చూపించనున్నారు.



చెరువును తలపిస్తున్న ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం (ఇన్‌సెట్‌లో) నీటిలో అవస్థ పడుతున్న ద్విచక్రవాహనదారుడు

కురిసింది వాన..

- తూర్పున భారీ వర్షం
- ఒంగోలు జలమయం
- చెరువులను తలపించిన రోడ్లు
- జిల్లా అంతటా చల్లబడిన వాతావరణం



ఒంగోలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని తూర్పుప్రాంతంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఒంగోలు, కొత్తపట్నం, మద్దిపాడు, ఎన్‌జీపాడు, సంతనూతలపాడు తదితర మండలాల్లో దాదాపు రెండు గంటలపాటు తెరపి లేకుండా పడింది. ఒంగోలు నగరం జలమయమైంది. రోడ్లు చెరువులను తలపించాయి. దాదాపు నెలన్నర రోజులుగా జిల్లాలో సరైన వర్షం లేక పూర్తి బెట్టవాతావరణం, వేసవిని తలపించేలా ఎండలు కాచాయి. రెండు రోజుల నుంచి వాతావరణంలో మార్పు వచ్చింది. ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం చల్లబడటంతోపాటు అక్కడక్కడా జల్లులు కూడా పడ్డాయి. గత రాత్రి పశ్చిమ

మిగతా 6వ పేజీలో

ఒడా చైర్మన్‌గా రియాజ్

- జనసేనకు దక్కిన కీలక పదవి
- తొలుత లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకం
- కోర్టు సమస్య ఎదురవడంతో మార్పు
- ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్ కీలకపాత్ర



ఒంగోలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయిలో కీలకమైన ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ (ఒడా) చైర్మన్ పదవి జనసేనకు దక్కింది. ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్‌ను ఒడా చైర్మన్‌గా నియమించారు. ఈ విషయంలో తొలుత టీడీపీ అధిష్ఠానం విముఖత వ్యక్తంచేసినా తనకు ఎన్నికల్లో సంపూర్ణ సహకారం అందించినందుకు రియాజ్‌కే ఆ పదవి ఇవ్వాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పట్టుపట్టడం కూడా కలిసి వచ్చింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీ ప్రారంభించినప్పటి నుంచి జిల్లాలో రియాజ్ ఆయన వెన్నంటి ఉన్నారు. ఆ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయన 2019 ఎన్నికల్లో జనసేన తరఫున ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఒంగోలు నగరానికి చెందిన రియాజ్ గత వైసీపీ ప్రభుత్వంలో అరాచకాలకు వ్యతిరేకంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడిన అనంతరం జిల్లాలో టీడీపీ నాయకులతో రియాజ్ సమన్వయంతో ముందుకు సాగారు. ప్రత్యేకంగా కీలక నేత అయిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో అత్యంత సన్నిహితంగా మెలిగారు. ఎన్నికల్లో ఆయన గెలుపునకు కృషి చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నామినేటెడ్ పదవుల జాబితాలో జనసేన నుంచి రియాజ్ పేరు రాష్ట్రస్థాయి పదవికి ముందు వరుసలో ఉంది. అలాగే ఎన్నికల్లో తనకు సంపూర్ణ సహకారం అందించిన ఆయనకు ఒడా చైర్మన్ పదవి ఇప్పించాలని ఎమ్మెల్యే జనార్దన్ ప్రయత్నాలు ప్రారంభించారు. టీడీపీ జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో ఆ ప్రతిపాదనను

మిగతా 6వ పేజీలో



విచారణ అనంతరం తాలూకా పోలీసు స్టేషన్ నుంచి బయటకు వస్తున్న వర్మ

12 గంటలు.. 50 ప్రశ్నలు!

- రామ్‌గోపాల్‌వర్మను సుదీర్ఘంగా విచారించిన ఒంగోలు పోలీసులు
- కొన్నింటికి మాత్రమే సమాధానం
- మిగిలిన వాటిపై మౌనం
- ఆయన సెల్‌ఫోన్ స్వాధీనం
- అవసరమైతే మళ్లీ రావాలని స్పష్టం చేసిన విచారణాధికారి

వివరాలు మెయిన్‌లో..

రెండు స్కూళ్లకు ఉత్తమ అవార్డులు

- 15న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రదానం

ఒంగోలు విద్య, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రెండు స్కూళ్లు రాష్ట్రస్థాయి ఉత్తమ పాఠశాలల అవార్డుకు ఎంపికయ్యాయి. ఈనెల 15న స్వాతంత్ర్య వేడుకల్లో చంద్రబాబునాయుడు అవార్డులను ప్రదానం చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అలాంటి స్కూళ్లు పది ఉండగా అందులో రెండు మన జిల్లా నుంచే కావడం గర్వకారణం. 2024-25 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభను కనబర్చినందుకు నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కొండపి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు ఈ అవార్డులు దక్కాయి. వీటిలో విద్యార్థినులు పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు సగటు మార్కులు కూడా అధికంగానే ఉన్నాయి. అమ్మనబ్రోలు పాఠశాల హెచ్‌ఎం కె.మాధవి, కొండపి పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.అరుణ సీఎం చేతుల మీదుగా ఈ అవార్డులు అందుకోనున్నారు.

ఎట్ హోంకు జిల్లా నుంచి ముగ్గురికి అవకాశం

- 15న రాజ్‌భవన్‌లో కార్యక్రమానికి ఆహ్వానం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆధ్వర్యంలో ఇచ్చే ఎట్‌హోంకు జిల్లాకు చెందిన ముగ్గురికి అవకాశం దక్కింది. ఆ మేరకు వారికి ఆహ్వానం అందింది. వీరిలో ఔషధాల తయారీలో విశిష్ట సేవలు అందించిన క్విస్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిషోర్‌బాబు, అదేకళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బి.రేవతి, కొత్తపట్నంకు చెందిన విద్యార్థి ఎన్.రవిశ్రీశంకర్ ఉన్నారు. ఈనెల 15వతేదీ సాయంత్రం ఐదు గంటలకు రాజ్‌భవన్‌లో జరిగే కార్యక్రమంలో వీరు పాల్గొననున్నారు.



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

పాఠశాలలో బాలిక కిడ్నాప్

- ఎస్పీ దామోదర్ ఆదేశాలతో అప్రమత్తమైన పోలీసులు
- గంటల వ్యవధిలో ఛేదన

7

కాళ్లపారాణి ఆరకముందే..

- మురుగుమ్మిలో నవవధువు బలవన్మరణం
- పెళ్లయిన మూడు రోజులకే విషాదం

- వివరాలు మెయిన్‌లో..



7

ట్రంప్ సుంకాల నుంచి కాపాడండి

- ప్రభుత్వానికి దక్షిణ కోస్తా జిల్లాల ఆక్వా రైతుల విన్నపం

జిల్లామంత్రితోనే జెండా ఆవిష్కరణ

- ప్రభుత్వం ఉత్తర్వులు



ఒంగోలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15వ తేదీన ఒంగోలులోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకల్లో జాతీయ జెండాను జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆవిష్కరించనున్నారు. ఆ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. మంత్రులు సొంత జిల్లాల్లో ఆగస్టు 15న జెండా ఆవిష్కరణలు చేయడం అరుదుగా జరుగుతుంది. గతంలో ఏప్రభుత్వం అధికారంలో ఉన్నా ఇన్‌చార్జి మంత్రి జెండాను ఆవిష్కరిస్తుంటారు. అయితే ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ఏడాది (గత సంవత్సరం) స్వాతంత్ర్య వేడుకల నాటికి ఇన్‌చార్జి మంత్రుల నియామక ప్రక్రియ పూర్తి కాలేదు. దీంతో జిల్లాకు చెందిన మంత్రులే జెండా ఆవిష్కరణలు చేశారు. ఈ ఏడాది కూడా అదేవిధానాన్ని అనుసరించనున్నారు. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ప్రకారం ఈనెల 15న ఒంగోలులోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమంలో డాక్టర్ స్వామి జాతీయ జెండాను ఎగురవేయనున్నారు.



పెద్దపులి దాడిలో మృతిచెందిన గేదె

వామ్మో.. పెద్దపులి

- వెల్లుపల్లె సమీపంలో సంచారం
- రెండు రోజులక్రితం గేదెపై దాడి
- భయాందోళనలో ప్రజలు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : వెల్లుపల్లె అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తుండటంతో ఆ చుట్టు పక్క గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం జయరాంపురం గ్రామానికి చెందిన మోడి రంగస్వామికి చెందిన గేదె మేతకు వెళ్లగా పెద్దపులి దాడి చేయడంతో మృతి చెందింది. గేదె కనిపించక పోవడంతో రంగస్వామి గాలిస్తుండగా వెల్లుపల్లె అటవీ ప్రాంత సమీపంలో కళేబరం కనిపించింది. పులి ఆనవాళ్లను గుర్తించిన రైతు గ్రామస్థుల సహకారంతో అటవీ శాఖ అధికారులకు తెలియచేయడంతో వారు ఆప్రాంతాన్ని పరిశీలించి పెద్దపులి సంచరిస్తున్నట్లు తెలిపారు. మృతిచెందిన గేదె విలువ రూ.80వేలు అని రంగస్వామి తెలిపాడు. పెద్దపులి సంచారంతో వెల్లుపల్లె, జయరాంపురం, జయరాంపురం తాండాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.



'రిజిస్టర్ పోస్ట్' కనుమరుగు

- వచ్చేనెల 1 నుంచి స్పీడ్ పోస్ట్‌లో విలీనం
- ఆ దిశగా తపాలా శాఖ అధికారుల చర్యలు
- పోస్టల్ సేవల్లో రిజిస్టర్ పోస్ట్‌కు సుదీర్ఘ చరిత్ర
- పనిలో వేగం.. సులభతరం కోసమే మార్పు

7


వృద్ధురాలి మృతదేహాన్ని బయటకు తీస్తున్న 108 సిబ్బంది

ప్రమాదవశాత్తూ రైలుకిందపడి వృద్ధురాలు మృతి

సింగరాయకొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదశాత్తు రైలుకిందపడి ఒక వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన స్థానిక రైల్వేస్టేషన్‌లో 1వ నెంబర్ ప్లాట్‌ఫాం రైలుపట్టాలపై మంగళవారం చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కృష్ణ ఎక్స్‌ప్రెస్ సింగరాయకొండ రైల్వేస్టేషన్ ఆగుసమయంలో కందుకూరు మండలం విక్కిరాలపేటకు చెందిన యేక్కటెల్లి లక్ష్మమ్మ (94) రైలుపట్టాలు దాటుతూ ప్రమావశాత్తు రైలుకింద పడింది. పట్టాలకు రైలుబోగికి మధ్య ఇరుక్కుపోయి కాసేపు కొనఊపిరితో కొట్టుమిట్టాడింది. అనంతరం మృతిచెందింది. వృద్ధురాలి మృతదేహాన్ని బయటకు తీయడానికి దాదాపు 40 నిమిషాలుపాటు రైలు స్టేషన్‌లో నిలిచిపోయింది. అక్కడకు చేరుకున్న 108 సిబ్బంది మృతదేహాన్ని బయటకుతీశారు. తదనంతరం కేసు నమోదుచేసి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించినట్లు ఒంగోలు జీఆర్పీ ఎస్సై మధుసూదన్‌రావు తెలిపారు.

హెచ్ఐవీ, డ్రగ్స్‌పై రెండు నెలలు

జిల్లాలో అవగాహన కార్యక్రమాలు


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ శ్రీవాణి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లాలో హెచ్ఐవీ/ఎయిడ్స్, డ్రగ్స్‌పై రెండు నెలల పాటు ఇంటెన్సిఫైడ్ ఐఈసీలపై రెండు నెలల పాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు తెలిపారు. డిస్ట్రిక్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీఫర్ హెచ్ఐవీ/ఎయిడ్స్ (దిశ) ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన ర్యాలీని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబి అధికారి డాక్టర్ బి. శ్రీవాణితో కలిసి డాక్టర్‌వెంకటేశ్వర్లు అవగాహన ర్యాలీనిజెండాను ఊపి ప్రారం భించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 200 గ్రామాలు, 400 పాఠశాలలు, 86 కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ కిరణ్ పండిటి, డ్యాప్‌క్యూ డిఎస్ చంద్రమోహన్, పీర్‌బాషా, ఎస్‌కే అమీన్, సాయి, వివిధ సంస్థల ప్రతినిధులు గాలిస్వరూప్‌కుమార్, కోటేశ్వరరావు, వెంకటేష్, రమేష్ తదితరులు ఉన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

అద్దంకి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బంది కచ్చితంగా సమాచారహక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి సూర్య ప్రకాష్‌రెడ్డి చెప్పారు. సమాచార హక్కు చట్టం-2005పై మంగళవారం స్థానిక మార్కెట్ యార్డులో సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో మార్కెట్ కమిటీ, అగ్నిమాపక శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయంలో అన్నదానం

దేవాంగపురి/చీరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని దేవాంగపురి శివాలయంలో బట్టా మోహన్‌రావు, పుష్పవల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సుమారు 100 మందికి అన్నదానం జరిగింది.

మానవవనరుల అభివృద్ధితోనే వికసిత్ భారత్

ఒంగోలు విద్య, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మానవవనరుల అభివృద్ధితోనే వికసిత్ భారత్ సాధ్యపడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్‌కుమార్ అన్నారు. వికసిత్ భారత్‌కు మానవ వనరులు అంశంలో ఉప అంశమైన స్కాలింగ్ బిల్డింగ్ బ్లాక్స్ అనే అంశంపై మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. మావన వనరులు పెంపొందాలంటే ముఖ్యంగా పాఠశాలలు మరింత బలోపేతం కావాలన్నారు. పాఠశాలలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సమకూర్చుకుని విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. సాంకేతికంగా కూడా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలన్నారు. ప్రధానంగా ఐదు అంశాలపై వర్క్‌షాపులో చర్చించారు. అధికారులు, ఐదు బృందాలుగా ఏర్పడి చర్చించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు విలీన విద్య, సమానత్వం, బాలికలు, గిరిజనులు, గ్రామీణ పిల్లలు, బడిబయట పిల్లలు, సంపూర్ణ అక్షరాస్యత సాధనలో ఎదురవుతున్న సవాళ్లు, సమాజ భాగస్వామ్యం, పాఠశాలలకు మౌలికవసతుల కల్పన తదితర అంశాలపై చర్చించారు.

విధుల్లో మెలకువలు పాటించాలి

● ఎక్సైజ్ శాఖ కమిషనర్ రాహుల్ దేవ్ శర్మ
● అధికారులకు ముగిసిన శిక్షణ

ఒంగోలు క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శిక్షణ కాలంలో నేర్చుకున్న మెలకువలను విధినిర్వహణలో వినియోగించుకొని ఎక్సైజ్ శాఖకు మంచి పేరు తేవాలని ఆ శాఖ కమిషనర్ రాహుల్ దేవ్‌శర్మ కోరారు. స్థానిక పోలీసు శిక్షణ కళాశాలలో ఆ శాఖలో ఉద్యోగోన్నతి పొందిన ఎస్సైలు, సీఐలు, ఏఈఎస్‌లు 101 మంది మూడు నెలలపాటు శిక్షణ పూర్తిచేసుకున్న సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ జీఆర్.రాధిక అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కమిషనర్ రాహుల్ దేవ్ శర్మ మాట్లాడారు. శిక్షణ అనంతరం జరిగిన పరీక్షలలో ఇండోర్ బెస్ట్ పెర్ఫార్మర్‌గా జి.వంశీకృష్ణ, అవుట్‌డోర్ బెస్ట్ పెర్ఫార్మర్‌గా ఎస్.డి.మస్తాన్‌బాబు, ఆల్‌రౌండర్‌గా జి.వంశీకృష్ణ ఎంపికయ్యారు.

రైతు సమస్యల పరిష్కారంలో పారదర్శకత పాటించండి : ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రైతు సమస్యల పరిష్కారంలో సహకార సంఘాలు పారదర్శకంగా పని చేయాలని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. ఇటీవల వేటపాలెం మండలం సహకార సంఘం చైర్మన్‌గా మండల టీడీపీ సీనియర్ నాయకులు పల్లప్రోలు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొండయ్యను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్, యువనాయకులు గౌరీ అమర్నాథ్ పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై కఠిన చర్యలు

పట్టణంలో విస్తృతంగా అధికారులు తనిఖీలు

చీరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చౌర్యంపై కఠిన చర్యలు తప్పవని అధికారులు చెప్పారు. మంగళవారం చీరాల పట్టణంలోని డీ 1 సెక్షన్ పరిధిలో 34 బృందాలుగా ఏర్పడి విజిలెన్స్ ఆధ్వర్యంలో 2,661 సర్వీసులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా 65 కేసులు నమోదు చేసి రూ.4.24.600 అపరాధ రుసుం విధించారు. ప్రభుత్వం ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సూర్యఘర్ ద్వారా ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఈఈ భాస్కరరావు, డీఈ ఈఈ విజయ శ్రీనివాస్, ఆపరేషన్ విభాగం నుంచి చీరాల డీఈ ఈఈ హరి ప్రసాదరావు, పర్చూరు డీఈ ఈఈ శ్రీనివాసులు, వేటపాలెం డీఈ ఈఈ శ్రీనివాసరావు, ఏఈలు, జెఈలు, లైన్‌మేన్‌లు పాల్గొన్నారు.

ఉత్తమ చదువుతోనే సంస్కారం

చీరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో ఉత్తమంగా విద్యాభ్యాసం సాగిస్తేనే సంస్కారం సాధ్యమవుతుందని ఎస్సై గారపాటి రాజ్యలక్ష్మీ చెప్పారు. స్థానిక వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ యాంటీ ర్యాగింగ్ వారోత్సవాలు నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ మురళీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి ఎస్సై మాట్లాడారు. సహవిద్యార్థులతో ఏ విధంగా మెలగాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే మహిళ రక్షణ చట్టంపై పలు సూచనలు చేశారు. కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

ఆటో వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

బల్లికురవ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఆటో వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, ఉచిత బస్సులు వస్తే తమకు తీవ్ర ఇబ్బందులు వస్తాయని మండల ఆటోవర్కర్ల యూనియన్ సభ్యులు చెప్పారు. మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌కు ఆటో వర్కర్లు తమ డిమాండ్లపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమను ఆదుకోవాలన్నారు. వాహన మిత్ర పథకాన్ని అమలు చేయాలని, ఏడాదికి రూ.15 వేలు అందజేయాలని, అలానే డ్రైవర్లకు వ్యక్తిగత ప్రమాద బీమా అమలు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు అప్పారావు, ఆటో వర్కర్ల నేతలు కందుల మరియబాబు, రామారావు, యేసు, అజయ్ పాల్గొన్నారు.

బ్యాంక్ లావాదేవీలతో మహిళలు ఎదగాలి

బేస్తవారపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఖాతాదారులు మీ బ్యాంక్‌లను దేవాలయాలుగా భావించి, మీ సంపాదనలో 20 శాతం పొదుపు చేసి బ్యాంక్‌లు అందించే అన్ని రకాల సేవలను పొందాలన్నది భారతీ య రిజర్వు బ్యాంక్ ఉద్దేశమని వేశపోగు బాలు అన్నారు. బేస్తవారపేటలో మంగళవారం కేంద్రం మహిళా సమాఖ్య సమావేశం హాల్‌లో ఏర్పాటు చేసిన భారతీయ రిజర్వు బ్యాంక్ వారి సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో ఖాతాదారుల చైతన్య, అవగాహన సదస్సు వర్క్ షాపు నిర్వహించారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ మాట్లాడుతూ పాత పొదుపు పద్ధతులు మానుకొని జాతీయ బ్యాంక్‌ల సేవలను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కృష్ణారెడ్డి, భరత్ చంద్ర, గంగాధర్,ల్యాంప్ సంస్థ పర్సన్ కె.వెంకటేశ్వరరావు, బాజీ, మంగయ్య, యానిమేటర్లు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్‌కు నివాళి

గిద్దలూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో వీరమరణం పొందిన ఆర్మీ జవాన్ సంగిరెడ్డి సంజీవరెడ్డికి బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని కేఎస్‌పల్లిలో గల సంజీవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జేవీ నారాయణ, మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు బీవీ రామాంజనేయులు, పట్టణశాఖ అధ్యక్షుడు ఎ.ఉదయ్‌శంకర్, నాయకులు షేక్ ఖాదర్‌వలి, ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

‘అన్నదాత’ల సంబరాలు

(5వ పేజీ తరువాయి)

చుట్టారు. జిల్లాలో అన్నదాత సుఖీభవ కింద సుమారు 2.68 లక్షల మంది రైతు కుటుంబాలకు తొలివిడత రూ.186కోట్లు అందాయి. ఈ మొత్తం వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. దర్శి నియోజకవర్గంలో అత్యధికంగా 42,971 మందికి రూ.29.07 కోట్లు అందాయి. కొండపి, కనిగిరి, ఎర్రగొండపాలెం నియోజకవర్గాలకు రూ.25 కోట్ల నుంచి రూ.29 కోట్ల వరకు, ఇతర నియోజకవర్గాలకు తగుస్థాయిలో ఆర్థిక సహాయం అందింది. సాగువేళ అంత పెద్దమొత్తంలో అందిన నగదు రైతులకు ఉపకరించనుంది. ఈనేపథ్యంలో అన్నదాత సుఖీభవ పేరుతో తమకు ఆర్థిక సహకారం అందించిన సీఎం సుఖంగా ఉండాలని కోరుకుంటూ జిల్లాలో రైతులు, టీడీపీ శ్రేణులు కృతజ్ఞత ర్యాలీలు నిర్వహిస్తున్నారు.

కనిగిరి, గిద్దలూరులో కోలాహలంగా ర్యాలీలు

రెండు రోజుల క్రితం మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రాతినిథ్యం వహిస్తున్న కొండపి నియోజకవర్గంలోని జరుగుమల్లి మండలం కామేపల్లి నుంచి చిర్రికూరపాడు వరకు ర్యాలీ నిర్వహించారు. మంత్రి డాక్టర్ స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వందలాదిగా రైతులు, టీడీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో ట్రాక్టర్లతో పాల్గొన్నారు. మంగళవారం కనిగిరిలో అక్కడి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరులో స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి నేతృత్వంలో భారీ ర్యాలీలు జరిగాయి. పెద్దసంఖ్యలో రైతులు, టీడీపీ శ్రేణులు ట్రాక్టర్లతో తరలివచ్చారు. కోలాహలంగా కార్యక్రమం జరిగింది. అలాగే ఇతర నియోజకవర్గాల్లోనూ ర్యాలీల నిర్వహణకు స్థానిక టీడీపీ నేతలు సన్నాహాలు చేస్తున్నారు.

నేడు పల్లామల్లిలో నిర్వహణ

సంతనూతలపాడు నియోజకవర్గ ర్యాలీ బుధవారం సాయంత్రం చీమకుర్తి మండలం పల్లామల్లిలో నిర్వహించనున్నారు. చీమకుర్తితోపాటు మద్దిపాడు, ఎన్‌జీపాడు మండలాలకు కూడలిగా ఆ గ్రామం ఉండటంతో అక్కడ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పాల్గొననున్నారు. అలాగే మార్కాపురం, దర్శి, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల ర్యాలీలను ఈనెల 14న నిర్వహించేందుకు అక్కడి టీడీపీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు సన్నాహాలు చేస్తున్నారు.

కురిసింది వాన...

(5వ పేజీ తరువాయి)

ప్రాంతంలోని కొన్ని మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. మంళవారం సాయంత్రం తూర్పుప్రాంతంలో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం మూడు గంటల నుంచే ఈ ప్రాంతంలో వాతావరణంలో మార్పు వచ్చింది. సాయంత్రం నాలుగు గంటల నుంచి జల్లులు ప్రారంభమయ్యాయి. నాలుగున్నర నుంచి ఆరున్నర వరకు ఒంగోలు నగరంతోపాటు పరిసన ప్రాంత మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఈ సమయంలో మద్దిపాడులో ఏకంగా 90 మి.మీ వర్షపాతం నమోదైంది. అక్కడ ప్రధాన వీధులపై వర్షపు నీరు పారుతూ జనం అవస్థ పడ్డారు. అలాగే కొత్తపట్నంలో 69.75మి.మీ, ఒంగోలులో 48.25, ఎన్‌జీపాడు మండలం వినోదరాయునిపాలెంలో 42.50, సంతనూతలపాడులో 25.75 మి.మీ కురిసింది. దర్శి, కురిచేడు, చీమకుర్తి, సింగరాయకొండ, పొదిలి, టంగుటూరు, జరుగుమల్లి తదితర ప్రాంతాల్లో జల్లులు పడ్డాయి. సాయంత్రం వేళ అది కూడా దాదాపు రెండు, మూడు గంటలపాటు తెరపిలేకుండా వర్షం కురవడంతో ఒంగోలు నగర ప్రజానీకం తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. భారీ వర్షంతో నీరంతా రోడ్లపైకి వచ్చి చెరువులు, కాలువలను తలపించే రీతిలో పారడంతో ప్రధాన రోడ్లలో వాహనాలపై వెళ్ళేవారు అవస్థలు పడాల్సి వచ్చింది. చిరు వ్యాపారులు,వీధి వ్యాపారులతోపాటు సాయంత్రం పనులు ముగించుకొని ఇళ్ళకు వెళ్ళే ఉద్యోగులు, కాలేజీ విద్యార్థులు ఇతరత్రా కూడా వర్షంతో ఇక్కట్లు పడ్డారు. ఇదిలా ఉండగా ఒక వైపు రుతుపవనాల ప్రభావం మరో వైపు బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో ఈ మార్పు కనిపిస్తుండగా మరో మూడు నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సమాచారాన్ని బట్టి తెలుస్తున్నది.

ఒడా చైరన్‌గా రియాజ్

(5వ పేజీ తరువాయి)

కూడా ఇతర నాయకుల ముందు జనార్దన్ ఉంచారు. ఒడా చైర్మన్ వంటి కీలక పదవి టీడీపీకి చెందిన వారికే ఇవ్వాలన్న భావనలో అధిష్ఠానంలో ఉండటంతో రియాజ్ పేరు రేసు నుంచి పక్కకు తొలగి టీడీపీకి చెందిన దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పేరు ప్రముఖంగా ముందుకు వచ్చింది. దానికి అనుగుణంగానే రాష్ట్ర లైవ్ స్టాక్ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా రియాజ్‌ను గతంలోనే నియమించారు. అయితే ఆ సంస్థకు గత వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన కమిటీ సభ్యులు కోర్టును ఆశ్రయించడంతో రియాజ్ ఆబాధ్యతలు చేపట్టలేకపోయారు. ఈక్రమంలో ఒకవైపు తన పార్టీ (జనసేన) నేతల ద్వారా రియాజ్, మరోవైపు తాను తొలుత చేసిన ప్రతిపాదనకు అనుగుణంగా ఎమ్మెల్యే జనార్దన్ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. చివరకు ఓడా చైర్మన్ పదవి రియాజ్‌కే దక్కింది.

మొబైల్ ఫోన్‌లు, ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకిరాని రోజుల్లో సమాచార వ్యవస్థకు ఉన్న ఏకైక మార్గం తపాల శాఖ. అందులో ప్రధానమైనది సుదీర్ఘ కాలం నాటి నుంచి సేవలు అందిస్తున్న రిజిస్టర్ పోస్టు. ఇది ఇకపై కనుమరుగు కానుంది. సెప్టెంబరు 1వ తేదీ నుంచి దీన్ని రద్దు చేసి, ఆ సేవలను స్పీడ్ పోస్టులో విలీనం చేయనున్నారు. ఆ దిశగా పోస్టల్ అధికారులు చర్యలు చేపట్టనున్నారు. దేశ వ్యాప్తంగా నడుస్తున్న పోస్టల్ కార్యాలయాల్లో ఈ విధానం అమలు కానుంది. ఇప్పటికే పోస్టల్ వినియోగదారులకు నాణ్యమైన, సులభతరమైన సేవలు అందించడానికి నూతన సాఫ్ట్‌వేర్‌ను అమలు చేస్తుండగా, అందులో భాగంగానే రిజిస్టర్ పోస్ట్ సేవలకు సెలవు ప్రకటించనున్నారు. ఈ సేవలను రద్దు చేయడం ద్వారా స్పీడ్ పోస్టింగ్ ద్వారా స్థానికంగా అయితే అదేరోజు డెలివరీ అవుతుండగా, ఇతర ప్రాంతాలకు మరుసటి రోజే చేరేవిధంగా చర్యలు చేపట్టారు. దీంతో పౌర సేవలు వేగవంతం.. సులభతరం అవుతాయని తపాలాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.



- వచ్చే నెల నుంచి స్పీడ్ పోస్ట్‌లో విలీనం
- ఆ దిశగా తపాలాశాఖ అధికారుల చర్యలు
- పోస్టల్ సేవల్లో రిజిస్టర్ పోస్టుకు సుదీర్ఘ చరిత్ర
- స్పీడ్‌పోస్టుతో పనిలో వేగం.. సులభతరం కోసం మార్పు

'రిజిస్టర్ పోస్టు' కనుమరుగు..!

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజలతో పోస్టాఫీస్ శాఖది విడదీయరాని బంధం. ప్రైవేటు సంస్థలకు దీటుగా సమాచార సేవలను కొనసాగిస్తుంది. పౌర సేవలతోపాటు, ప్రజలకు బ్యాంకింగ్ సేవలు సైతం అందిస్తుంది. అందులో భాగంగానే బ్రిటీష్ కాలం నుంచి అమలు అవుతున్న రిజిస్టర్ పోస్టుకు సుదీర్ఘమైన చరిత్ర ఉంది. ఇకపై రిజిస్టర్ పోస్టును తొలగించి స్పీడ్ పోస్టులో విలీనం చేయనున్నారు. 1854లో రిజిస్టర్ పోస్టు సేవలను అప్పటి బ్రిటీష్ పాలకులు ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి భారత తపాలశాఖ చట్టంతో రిజిస్టర్ పోస్టు సేవలు మొదలయ్యాయి. దాదాపు 171 సంవత్సరాలుపాటు రిజిస్టర్ పోస్టు సేవలందించిన చరిత్ర ఉంది. ముఖ్యమైన పత్రాలు, వస్తువులు, సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో రిజిస్టర్ పోస్టు సేవలు అమోఘం. ముఖ్యంగా లీగల్ నోటీసులు, బ్యాంకింగ్ సేవల పత్రాలు, ఆధార్ కార్డులు, ఓటరు గుర్తింపు కార్డులు, ఇంటర్నెట్ లేని రోజుల్లో గ్రీటింగ్ కార్డుల ద్వారా శుభాకాంక్షలు చెప్పుకోవడం లాంటి పలు ముఖ్యమైన సేవలు కూడా రిజిస్టర్ పోస్టు ద్వారానే కొనసాగాయి. ఇలా పంపే పత్రాలు అవతల వ్యక్తికి చేరింది.. లేనిది కూడా డెలివరీ ప్రూఫ్ ఉండటం రిజిస్టర్ పోస్టు ప్రాముఖ్యత.

ఆధునీకీకరణలో భాగంగా

పోస్టల్ సేవలను మరింత ఆధునికీకరించేందుకు రిజిస్టర్ పోస్టును స్పీడ్‌పోస్టులో విలీనపై నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దేశీయ పోస్టల్ సేవలను క్రమబద్ధీకరించడం, పనితీరు, ట్రాకింగ్ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగానే రిజిస్టర్ పోస్టు సేవలను తొలగించనున్నట్లు సమాచారం. స్పీడ్ పోస్టు అనేది వేగవంతమైన డెలివరీకి ప్రాధాన్యత ఇస్తుంది. ఇప్పుడు రిజిస్టర్ పోస్టుల సేవలు స్పీడు పోస్టులో విలీనం అయితే పత్రాలు మరింత వేగంగా గమ్యస్థానాలకు చేరడంతోపాటు ముఖ్యంగా స్పీడ్ పోస్టులో పంపే పత్రాలు, ఇతరత్రాలు ఆన్‌లైన్ ద్వారా ఎక్కడ ఉంది.. ఎప్పుడు చేరింది అని ట్రాకింగ్ ద్వారా తెలుసుకోవచ్చు. లోకల్‌గా పంపే స్పీడ్ పోస్టు అదేరోజు డెలివరీ అయ్యే అవకాశం ఉంది.

ప్రభుత్వ శాఖల్లోనే అధిక రిజిస్టర్ పోస్టులు

రిజిస్టర్ పోస్టు సేవలను ప్రజలతోపాటు ప్రభుత్వంలోని వివిధ శాఖలు వినియోగించుకుంటున్నాయి. అన్ని రకాల ఉత్తర ప్రత్యుత్తరాలు రిజిస్టర్ పోస్టుద్వారానే జరిగేవి. అయితే ఇకపై సెప్టెంబరు 1 నుంచి రిజిస్టర్ పోస్టును స్పీడ్ పోస్టులో విలీనం చేసేలా చర్యలు వేగవంతం చేశారు. ఇదిలా ఉంచితే రిజిస్టర్ పోస్టు రద్దుతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు స్పీడ్ పోస్టులో విలీనం చేస్తే పోస్టల్ చార్జీలు పెరుగుతాయని, అదనపు భారం తప్పదని భావిస్తున్నారు. అయితే స్పీడ్ పోస్టులకు వసూలు చేసే రుసుములు అత్యధికంగా ఉంటాయని, అలా కాకుండా రిజిస్టర్ పోస్ట్‌కు వసూలు చేసే చార్జీలను అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

పాఠశాలలో బాలిక కిడ్నాప్

- ఎస్పీ ఆదేశంతో అప్రమత్తమైన పోలీసులు
- గంటల వ్యవధిలో ఛేదన



మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

రాచర్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : హైస్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిని మంగళ వారం ఉదయం పాఠశాలలో కిడ్నాప్‌కు గురైంది. సమాచారం తెలుసుకున్న జిల్లా పోలీసులు కేసును గంటల వ్యవధిలోనే ఛేదించి బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన మండలంలోని అనుముల వీడు హైస్కూల్‌లో మంగళవారం జరిగింది. మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. అనుములవీడు గ్రామానికి చెందిన మూడ మంచు అంజలి అనే బాలిక ఉదయం 8 గంటల ప్రాంతంలో పాఠశాలకు వెళ్లింది. 8 గంటల 15నిమిషాల ప్రాంతంలో గ్రే కలర్ కారులో గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలోకి ప్రవేశించి అంజలిని మీ నాన్న రమ్మంటున్నారని కారులో ఎక్కించుకొని వెళ్లిపోయారు. 8.30 గంటల సమయంలో టీచర్ పాప తల్లిదండులకు ఫోన్ చేసి పాప పాఠశాలకు ఇంకా ఎందుకు రాలేదని అడిగారు. తమ పాప పాఠశాలకు వచ్చిందని తల్లిద్రండులు టీచర్‌కు తెలిపారు. ఇంతలో సహా ఉపాధ్యాయులతో కలిసి పాప ఆచూకీ గురించి తెలుసుకుంటూ ఉండగా ఇద్దరు విద్యార్థినులు పాపను ఎవరో వచ్చి కారులో ఎక్కించుకుని వెళ్లారని చెప్పడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు సమాచారమిచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్సై పి.కోటేశ్వరరావు తమ సిబ్బందితో వెంటనే పాఠశాలకు చేరుకుని విచారించారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఇచ్చిన సమాచారంతో జిల్లా అధికారుల దృష్టికి వెళ్లగా ఎస్పీ దామోదర్ నంద్యాల - ఒంగోలు, కడప జిల్లాల పోలీసులకు సమాచారమిచ్చి వాహనాలను తనిఖీ చేయించారు. గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య, రాచర్ల ఎస్సై కోటేశ్వరరావును అలర్ట్ చేసి విడివిడి బృందాలుగా విచారణ ప్రారంభించారు. పోలీసుల గాలింపును తెలుసుకున్న కిడ్నాపర్లు బాలికను పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు సమీపంలో వదిలి రూట్ మార్చి మరో మార్గంలో వెళ్లిపోయారు. పాప ఆచూకీ కోసం గాలిస్తున్న పెద్దారవీడు పోలీసులకు పాప కనిపించడంతో గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. పెద్దారవీడు ఇన్‌చార్జి ఎస్‌ఐ రాజమోహన్‌రావు పాపను రాచర్లకు తీసుకురాగా తల్లిదండ్రులకు అప్పగించినట్లు డీఎస్పీ మీడియాకు తెలిపారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

- అదుపులో ఆరుగురు
- 8 కేజీల సరుకు స్వాధీనం



నిందితులను ప్రవేశపెట్టి సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

పొదిలి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను పొదిలి పోలీసులు స్థానిక ఎస్టీ కాలనీ, చిన్నచెరువు సమీపంలో మంగళవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 8 కేజీల 650 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను డీఎస్పీ వెల్లడించారు. బిహార్‌కు చెందిన సుజిత్‌కుమార్ మండలంలోని పోతవరం గ్రామంలో కోటి అనే వ్యక్తి దగ్గర ఆవులషెడ్‌లో పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో ప్రథమ నిందితుడైన కల్కి సాయికుమార్‌రెడ్డికి పరిచయమయ్యాడు. గంజాయి ఎక్కువ మొత్తంలో కావాలని సాయికుమార్‌రెడ్డి సుజిత్‌ను అడగ్గా తన స్నేహితుడైన బిక్రం కుమార్‌కు ఫోన్‌చేసి గంజాయి తెప్పించి ఇస్తున్నాడు. అయితే సాయికుమర్‌రెడ్డి కొమరోలు మండలంలోని తాటిచర్లమోటు గ్రామానికి చెందిన కోలా బాబురావుతోపాటు, పొదిలి మండలం చుట్టుపక్కల గ్రామాలలో ఏడాది కాలంగా గంజాయిని అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈవారంలో సెలవులు, శుభకార్యాలు ఎక్కువగా ఉన్నందున ఎక్కువ గంజాయి కావాలని సాయికుమార్‌రెడ్డి అడగడంతో ఒడిశాలో ఉన్న బిక్రంకుమార్‌కు వెంటనే ఫోన్‌చేసి గంజాయి ఎక్కువగా తీసుకురావాలని సుజిత్ అడగడంతో బిక్రంకుమార్ మంగళవారం తెస్తానని చెప్పాడు. తాటిచర్లమోటు గ్రామానికి చెందిన బాబూరావు గంజాయి కోసం సాయికుమార్‌రెడ్డి ఇంటివద్దకు వచ్చి సాయికుమార్ దగ్గర ఉన్న కేజీ గంజాయిని కొనుగోలు చేశాడు. ఇంకా కావాలని కోరగా బిక్రంకుమార్ తీసుకువస్తున్నాడని, ఎక్కువ సరుకు కావడంతో తనతోపాటు మరో ముగ్గురు సుజిత్‌కుమార్, దీపుకుమార్, పవన్‌కుమార్ మంగళవారం సాయికుమార్‌రెడ్డి ఇంటికి వచ్చినట్లు తెలిపారు. ఈక్రమంలో పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ వేమన సిబ్బందితో దాడి చేసి గంజాయితోపాటు ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఆరుగురిలో నలుగురు బిహార్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన వారు కాగా, మరో ఇద్దరు తాటిచర్లమోటు, పొదిలి మండలం పోతవరం గ్రామానికి చెందిన వారని డీఎస్పీ లక్ష్మీనారాయణ వివరించారు. ఈ కేసులో అత్యంత ప్రతిభ కనబరిచిన సీఐ, ఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్స్ గౌతంకుమార్, శివారెడ్డిని ఎస్పీ దామోదర్ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

- పోలీసులను ఆశ్రయించిన యువతి

ఒంగోలు క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి మోసం చేశాడని ఓ యువతి పోలీసులను ఆశ్రయించింది. మద్దిపాడు మండలం (తెల్లబాడు) దొడ్డవరానికి చెందిన పి.అశోక్ తన పిన్ని వాళ్ల ఇంటికి వెళ్లిన సమయంలో యువతికి పరిచయం అయ్యాడు. అప్పటి నుంచి ఒంగోలులో అమె నివాసం ఉండే ఇంటికి వస్తూ ఉండేవాడని ఫిర్యాదులో పేర్కొంది. సోమవారం అదే విధంగా ఇంటికి వచ్చిన అశోక్‌ను ఆ యువతి తల్లి, పిన తల్లి కలిసి తమ కుమార్తెను వివాహం చేసుకోమని అడిగేవారు. 'నేను మీ అమ్మాయిని వివాహం చేసుకోను. మీకు చేతనైంది చేసుకోండి' అని బెదిరించి వెళ్లారు. దీంతో బాధితురాలు ఒంగోలు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేసింది.

విద్యార్థి మృతదేహానికి పోస్టుమార్టం

ఒంగోలు క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో రెండో సంవత్సరం విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. సోమవారం రాత్రి ఒంగోలు శివారు ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలో నెల్లూరు జిల్లా కందుకూరు మండలం అనంతసాగరానికి చెందిన ఉన్నం భాస్కర్ (20) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కళాశాల హాస్టల్‌లో ఉంటున్న భాస్కర్ శనివారం సహచర విద్యార్థులకు కనిపించాడు. సోమవారం రాత్రి కళాశాల హాస్టల్ రెండో ఫ్లోర్‌లో ఓ గదిలో నుంచి దుర్వాసన రావడంతో విద్యార్థులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. భాస్కర్ శనివారం ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. విద్యార్థి ఆత్మహత్యకు బలమైన కారణం ప్రాథమికంగా తెలియలేదని పోలీసులు చెబుతున్నారు. అయితే గత ఏడాది భాస్కర్ గుజరాత్‌లో చదువుకున్నాడు. అక్కడి నుంచి ఇక్కడుకు ఎందుకు తీసుకొచ్చి చదివిస్తున్నారు అనేది తెలియాల్సి ఉంది. ఈమేరకు సోమవారం భాస్కర్ మృతదేహనికి పోస్టుమార్టం నిర్వహించి పోలీసులు వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఏబీవీపీ ఆందోళన

భాస్కర్ కుటుంబానికి న్యాయం చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో కళాశాల గేటు వద్ద కూర్చొని నినాదాలు చేశారు.

పట్టాదారుపుస్తకాల పంపిణీని పటిష్టంగా చేపట్టాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా రాజముద్రతో తయారుచేసిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలుచేసేలా చర్యలు తీసుకోవాలని సీసీఎల్‌ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మీ ఆదేశించారు. విజయవాడ నుంచి మంగళవారం కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. జిల్లాలో చేపట్టిన రీ సర్వే ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ శాఖలో డిసిప్లినరీ కేసులకు సంబంధించి విచారణ పెండింగ్‌ను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ సీజన్‌కు సంబంధించి ఎరువుల కొరత లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మంగళవారం సాయంత్రం రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రైతులు ఇబ్బందులు పడకుండా సకాలంలో ఎరువులు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలన్నారు. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు మంజూరు చేయాలని, నిర్దేశించిన గడువు లోపు ఈ-క్రాప్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. పీజీఆర్‌ఎస్‌లో రెవెన్యూ అంశాలపై వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌తో పాటు ఇంటి పట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ, రీసర్వేతో పాటు కౌలు రైతులకు పంట సాగుదారు హక్కుల కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రామ పంచాయతీ రికార్డుల పరిశీలన

- ఆదేశించిన రాష్ట్ర సమాచార కమిషన్



పెదకండ్లగుంట గ్రామ పంచాయతీ రికార్డులు పరిశీలిస్తున్న సమాచార దరఖాస్తుదారులు

కొండపి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పెదకండ్లగుంట గ్రామ పంచాయతీ ఆస్తులు, ఖర్చులు, జమలకు సంబంధించి 12 అంశాల సమచారం కావాలని సమాచార హక్కు చట్టం ద్వారా బాపట్ల వేటపాలెం గ్రామానికి చెందిన ఎస్.నాగార్జునరెడ్డి 2023వ సంత్సరంలో కోరారు. రెండవ అప్పీలు విచారణ అనంతరం కూడా అధికారులు సమాచారం ఇవ్వకపోవడంతో తాజాగా రాష్ట సమాచార కమిషన్ దరఖాస్తుదారుడు స్వయంగా రికార్డుల పరిశీలనకు అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ఆమేరకు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పీఆర్‌ఈవోఆర్డీ మువ్వ అంజలీదేవి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సాంబయ్యల సమక్షంలో దరఖాస్తుదారులు రికార్డులు పరిశీలించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ తాము కోరిన 12 అంశాలలో 4 అంశాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, గ్రామ పంచాయతీ నిర్వహించాల్సిన 20 రికార్డులకుగాను 8 రికార్డుల సమాచారం మాత్రమే అందుబాటులో ఉందని, మిగతా 12 అంశాల రికార్డులు నిర్వహించడం లేదని అన్నారు.

కొండపి ఏఎంసీ కమిటీ ఉత్తర్వులు విడుదల

- చైర్మన్‌గా కర్ణా తిరుపతమ్మ, వైస్ చైర్మన్‌గా ఎం. వెంకటేశ్వరరావు
- 17 మంది సభ్యులు



కొండపి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కొండపి ఏఎంసీ గౌరవాధ్యక్ష, అధ్యక్ష, ఉపాధ్యక్ష సభ్యులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖా మంత్రి, కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి గౌరవాధ్యక్షుడిగా, అధ్యక్షురాలిగా పొన్నలూరు మండలం రెడ్డిపాలెం గ్రామానికి చెందిన కర్ణా తిరుపతమ్మ, ఉపాధ్యక్షుడిగా కొండపి మండలం పెరిదేపి గ్రామానికి చెందిన మార్పూరి వెంకటేశ్వరరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన జగన్నాథం శ్రావణి, మల్లవరపు శ్రీదేవి, బూదాల ఏసుదాసు, గొల్లపోతు నాగరాజు, షేక్ హబీబా, ఉన్నం బసవయ్య, సారెడ్డి సాయమ్మ, తోకల భారతి, కనపర్తి ఆదిలక్ష్మి, కుంచాల శ్రీను, చాగంరెడ్డి వెంకటేశ్వర్లు, కొత్తూరి శ్రీరంగనాయకులు, మండవ మల్లికార్జునరావులను నియమించింది. వీరితోపాటు కనమళ్ల ప్రాథమిక సహకార పరపతి సంఘం అధ్యక్షుడు, వ్యవసాయశాఖ సింగరాయకొండ ఏడీఏ, సింగరాయకొండ గ్రామ సర్పంచ్, జిల్లా అగ్రిట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారిని సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

● 16న కొండపి ఏఎంసీ చైర్మన్ ప్రమాణస్వీకారం

సింగరాయకొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కొండపి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా పొన్నలూరు మండలానికి చెందిన సీనియర్ టీడీపీ నేత కర్ణా కోటిరెడ్డి సతీమణి కర్ణా తిరుపతమ్మ ఈనెల 16న ప్రమాణస్వీకారం చేయనున్నారు. సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. దీంతో మంగళవారం బహిరంగ సభ నిర్వహించనున్న ప్రాంగణాన్ని సత్య పరిశీలించారు. ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య కూటమి నాయకులకు సూచించారు. ఆయన మాట్లాడుతూ ఏఎంసీ ప్రమాణ స్వీకారమహోత్సవానికి నలుగురు రాష్ట్ర మంత్రులు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవి, ఆనం రామనారాయణరెడ్డి, బీసీ జనార్ధన్‌రెడ్డి, ఉమ్మడి ప్రకాశంలోని టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు హాజరవుతారని తెలిపారు.

వ్యక్తిగత, పరిసరాల శుభ్రత కీలకం



మాట్లాడుతున్న డీఆర్‌వో చిన ఓబులేసు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత అత్యంత కీలకమని జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేషు అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక వీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈసందర్భంగ జరిగిన కార్యక్రమంలో డిఆర్వో మాట్లాడుతూ నులిపురుగలబారిన పడితే రక్తహీనత, పోషకల లోపం, ఆకలి మందగించడం, నీరసం, కడుపునొప్పిన, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. దీని బారిన పడకుండా భోజనానికి ముందు, మురుగుదొడ్డికివెళ్ళి వచ్చిన తర్వత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని విద్యార్థులకు సూచించారు. చేతిగోళ్ళ ప్రతివారం కత్తించుకోవాలని సూచించారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖాదికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో ఏడాది నుంచి 19 ఏళ్ళ లోపు ఉన్న 5,96,751 మంది ఉన్నారన్నారు. వారందరికి అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

ట్రంప్ సుంకాల నుంచి కాపాడండి

- ప్రభుత్వానికి దక్షిణ కోస్తా జిల్లాల ఆక్వా రైతులు విన్నపం

ఒంగోలు నగరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంపు మన దేశంపైన విధించిన సుంకాల బారి నుంచి రొయ్యల రైతులను కాపాడాలని ఆక్వా రైతుల అసోసియేషన్ డిమాండ్ చేసింది. దక్షిణ కోస్తా జిల్లాల ఆక్వా రైతుల సమావేశం మంగళవారం ఒంగోలులో జరిగింది. ఈ సమావేశానికి ప్రకాశం, తిరుపతి, నెల్లూరు, గుంటూరు, క్రిష్ణా జిల్లాల రొయ్యల రైతుల అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి జిల్లా రొయ్యల రైతుల సంఘం అధ్యక్షుడు దుగ్గినేని గోపికృష్ణ అధ్యక్షత వహించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంపు భారత దేశం నుంచి దిగుమతి చేసుకునే రొయ్యలపై 50 శాతం సుంకం విధించిన నేపథ్యంలో రొయ్యల సాగుదారుపై ఆ ప్రభావం, సాగు ప్రశ్నార్థకంగా మారటం, ఈ నేపథ్యంలో ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు చేపట్టాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. రొయ్యల రైతులకు రూ.1.50లకే విద్యుత్‌ను సబ్సిడీపై అందించాలని, రొయ్యల మేతల ధరలను కేజికి రూ.15 తగ్గించాలని సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో దక్షిణ కోస్తా జిల్లాల రొయ్యల రైతుల అసోసియేషన్ పలు తీర్మానాలను ఆమోదించింది.

తక్షణం చేపట్టాల్సిన చర్యలు

- రొయ్యల మేత తయారీకి ఉపయోగించే సోయా, మినరల్స్, ఫిష్‌మీల్స్ ధరలు భారీగా తగ్గిన నేపథ్యంలో రొయ్యల మేతల ధరలను కేజీకి రూ.15 తగ్గించాలి
- రొయ్యల రైతులను ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా ఆక్వా సాగుకు విద్యుత్ యూనిట్‌ను రూ.1.50పైసలకే అందించాలి
- వనామీ రకం కౌంట్ 100, 30 కౌంట్ రొయ్యలను రూ.250 కి, రూ.400లకి వ్యాపారులతో కొనుగోలు చేయించాలి. వ్యాపారులు కొనుగోలు చేయని పక్షంలో తగ్గిన ధరలను బోనస్‌గా రైతులకు ప్రభుత్వం చెల్లించాలి



జాయింట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న గోపీనాథ్

దీర్ఘకాలంలో తీసుకోవాల్సిన చర్యలు

- రైతుల వద్ద నుంచి ఎగుమతిదారులు కొనుగోలు చేసే రొయ్యల్లో 40 శాతం రొయ్యలను స్థానిక మార్కెట్లో వినియోగం కోసం అమ్మాలి.

2. రైతులకు 50 శాతం సబ్సిడీతో బ్యాంకు రుణాలను అందించి, స్థానికంగా మినీ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి.

3. అమెరికా, చైనా మార్కెట్లపై ఎగుమతుల కోసం ఆధారపడకుండా ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా, యూరప్ దేశాలకు ఎగుమతి చేసేందుకు దృష్టి సారించాలి.



ఒంగోలు ఆర్టీసీ బస్టాండు సమీపంలో చెరువును తలపిస్తున్న రోడ్డు

నగరంలో కుండపోత!

● ఎండల నుంచి ఉపశమనం

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం ముగిసినా గత పదిహేను రోజులుగా సెకండ్ సమ్మర్‌ని తలపిస్తున్న మండుటెండలు..ఉక్కపోతలతో అల్లాడిన నగర ప్రజలకు ఉపశమనం లభించింది. మంగళవారం మధ్యాహ్నం నుంచి మొదలైన వానతో ఒంగోలు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఎడతెరపి లేకుండా కురిసిన వానకు నగర వీధులు జలమయంగా మారాయి. ఉదయం భానుడు భగ భగలాడగా, మధ్యాహ్నం నుంచి మబ్బులు కమ్మి కారుచీకట్లు కమ్ముకున్నాయి. దీంతో ఆగకుండా కురిసి వానతో మురుగు నీరుతోడై రోడ్లపై ప్రవహించి చెరువులను తలపించాయి. దీంతో నగరవాసులు కొంత ఇబ్బంది ఏర్పడినప్పటికీ చల్లనివాతావరణంతో ఊరటచెందారు. ఇదిలా ఉండగా చాలా రోజుల తర్వాత కురిసిన గాలివానకు పలు ప్రాంతాల్లో విద్యుత్ విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వర్షపునీటితో రహదారులు అస్తవ్యస్తంగా మారాయి.

మద్దిపాడులో భారీవర్షం

మద్దిపాడు: ఉరుములు, మెరుపులతో మద్దిపాడులో మంగళవారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో 90 మి.మీ వర్షం నమోదు కాగా జాతీయ రహదారి, ఎంపీడీవో కార్యాలయం, రోడ్లన్నీ జలమయం అయ్యాయి. పోలీస్ స్టేషన్ ఆవరణలోకి వర్షపునీరు చేరింది. కెనరా బ్యాంకు సమీపంలో రోడ్డు, కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం చెరువులను తలపించాయి. వర్షంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షంతో రైతులు పంటలను సాగు చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది. గుండ్లకమ్మ ప్రాజెక్టులోకి భారీగా నీరు చేరటంతో రెండు గేట్లను ఎత్తినట్లు ప్రాజెక్టు ఏఈ రామాంజనేయులు తెలిపారు.



కర్నూలురోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ప్రవహిస్తున్న వర్షపునీరు



గుండ్లకమ్మ ప్రాజెక్టు నుంచి దిగువకు వస్తున్న వరద



మద్దిపాడులో భారీవర్షానికి జలమయమైన రోడ్లు

భక్తప్రహ్లాద నాటక కరపత్రం ఆవిష్కరణ



ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు బొకేను అందజేస్తున్న నృత్య విద్యార్థులు, నిర్వాహకులు

ఒంగోలు కల్చరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము ప్రాంగణంలో నిర్వహించనున్న భక్తప్రహ్లాద నాటకం కరపత్రాన్ని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తన కార్యాలయంలో సోమవారం రాత్రి ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు, నాటక రచయిత, దర్శకుడు నూదనగుంట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నాటకంలో నటిస్తున్న పలువురు నృత్య విద్యార్థులు, ఇతర నిర్వాహకులు ఎమ్మెల్యేను కలిసి ముందుగా బొకే అందజేశారు. అనంతరం దామచర్ల మాట్లాడుతూ కేవలం బాలికలచే నాటకాన్ని రూపొందించి ప్రదర్శించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కామేపల్లి శ్రీనివాసరావు, ఐనంపూడి నరసింహారావు, మీనాక్షీ, మీనాక్షి, చంద్రహాస, సాన్వి, నిరుపమ, రాధ, చిన్మయి, మోక్షిత పాల్గొన్నారు.

ఏకేయూలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఒంగోలు విద్య, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం ఒంగోలులోని ఆంధ్ర కేసరి యూనివర్శిటీలో హరఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. మహనీయుల త్యాగాలఫలితంగా సిద్ధించిన స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందాలని వక్తలు పేర్కొన్నారు. ర్యాలీలో జాతీయ జెండాను పట్టుకొని భారతమాతకు జై అటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైస్‌చాన్సలర్ డీవీఆర్.మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు, ప్రిన్సిపాల్ నిర్మలామణి, భారతీదేవి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్ పాల్గొన్నారు.

సరెండర్ లీవ్ బకాయిలను చెల్లించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సరెండర్ లీవ్ బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా విద్యాశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల నుంచి ఆర్థిక బకాయిలతో పాటు వివిధ రకాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత మూడేళ్లనుంచి ఉద్యోగులకు ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఆర్థిక బకాయిల కోసం ఉద్యోగులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పాండురంగారెడ్డి, నగర అధ్యక్షుడు మోటా శ్రీనివాసరావు, సిబ్బంది శివశంకర్, వేణు, నాగార్జున పాల్గొన్నారు.

జీవోను రద్దు చేయాలి : పీడీఎస్‌యూ



జీవో ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యాసంస్థల్లోకి విద్యార్థి, ప్రజాసంఘాల నాయకుల ప్రవేశాన్ని నిషేధించిన జీవోను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక భాగ్యనగర్‌కూడలిలో మంగళవారం ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కోసం పోరాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వాన్ని పెంపొందిస్తూ, వారిలో రాజకీయ దృక్పథం పెరిగేలా కృషి చేస్తున్న విద్యార్థి సంఘాలకు అనుమతులు నిరాకరిస్తూ జీవో విడుదల చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. ఈ విధానాలను ప్రభుత్వం మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీహెచ్.సిసింద్రీబాబు, మోషే, విల్సన్‌రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణకు ఉద్యమిస్తాం

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం ఉద్యమిస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల వలరాజు పేర్కొన్నారు. స్థానిక మల్లయ్యలింగం భవన్ వద్ద మంగళవారం ఏఐఎస్ఎఫ్ జెండాను ఆయన ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వలరాజు మాట్లాడుతూ చదువు అందరికీ అందుబాటులోకి రావాలని, అందరికీ ఉపాధి కల్పించం కోసం ఏఐఎస్ఎఫ్ ఇప్పటికీ రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు, కార్పొరేట్ విద్యావ్యవస్థకు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. రాజేంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థి, యువజనుల హక్కుల సాధనలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు కార్యక్రమంలో ఎన్.నాగభూషణం, ప్రభాకర్, మున్నా, జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్, అరుణ్, తేజ, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చేరువగా పల్లామల్లి సొసైటీ సేవలు

ఎమ్మెల్యే బీఎన్ ● ధన్యవాదాలు తెలిపిన నూతన పాలకవర్గం ● నేడు పల్లామల్లిలో భారీ రైతు సంబర సభ



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్, నాయకులు

చీమకుర్తి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన పల్లామల్లి సొసైటీ సేవలను రైతులకు చేరువయ్యేలా చేయాలని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కోరారు. నూతనంగా నియమితులైన సొసైటీ చైర్మన్ పారా చంద్రశేఖర్, సభ్యులు పత్తి అంజయ్య, సారెకొక్కు జాన్సన్‌లు మంగళవారం ఒంగోలులో ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు సొసైటీ బాధ్యతలను అప్పజెప్పినందుకు బొకేలు అందజేసి సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. బాధ్యతలను సక్రమంగా నెరవేర్చి రైతులకు సొసైటీ నుంచి మెరుగైన సేవలను అందిస్తామని వారు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్నమనేని రాఘవయ్య, పారా శ్రీనివాసరావు, కరిచేటి శ్రీనివాసరావు, పారా కృష్ణ, వేల్పుల శ్రీనివాసరావు, కరిచేటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతు సంబరసభకు ఏర్పాట్లు..

సూపర్‌సిక్స్ పథకాల అమలులో భాగంగా అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద రైతులకు తొలివిడతగా రూ.7వేల నగదు రైతుల ఖాతాల్లో జమ అయిన సందర్భంగా రైతు సంబర సభను సంతనూతలపాడు నియోజకవర్గస్థాయిలో పల్లామల్లి గ్రామంలో బుధవారం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ గ్రామ నాయకులతో చర్చించారు. ట్రాక్టర్లతో భారీ ర్యాలీ, సభను నిర్వహించటానికి ఏర్పాట్లు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

నెలరోజుల్లో 'నక్ష' సర్వేను పూర్తి చేయాలి

● కమిషనర్ వెంకటేశ్వరరావు ఆదేశం



సచివాలయ సెక్రటరీలతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నక్ష సర్వే పూర్తి చేయడానికి నెలరోజులే గడువు ఉందని, ప్రతి సెక్రటరీ బాధ్యతతో నూరు శాతం లక్ష్యాలు సాధించేలా పనిచేయాలని నగర కమిషనర్ కు.వెంకటేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం స్థానిక కార్పొరేషన్ కౌన్సిల్ హాలులో వార్డు సచివాల సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 157 మునిసిపాలిటీలలో నక్ష సర్వే జరుగుతోందని, అందులో భాగంగానే ఆంధ్ర రాష్ట్రంలో 10 మునిసిపాలిటలలో సర్వే చేపట్టినట్లు తెలిపారు. అందులో స్థానం పొందిన ఒంగోలు కార్పొరేషన్‌లో నూరు శాతం సర్వే చేయాలన్నారు. సకాలంలో లక్ష్యాలను సాధించడం ద్వారా ఒంగోలు నగరపాలక సంస్థకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా రూ.50 కోట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ నిధులతో నగరాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని వివరించారు. ప్రతి సచివాలయంలోని ఐదుగురు సెక్రటరీలు ఒక బృందంగా ఏర్పడి త్వరితగతిన సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ జెడ్.సుధాకర్, అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ బాబూరావు, సర్వేయర్ ఆవుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతోనే ఆరోగ్యం

● ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ హేమంత్



మోటుమాల కేజీబీవీలో మాట్లాడుతున్న డాక్టర్ హేమంత్

కొత్తపట్నం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో నులిపురుగులను నివారించగలిగినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలుగుతామని జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవ కో ఆర్డినేటర్ డాక్టర్ హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. కడుపులోని నులిపురుగుల వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. మంగళవారం మోటుమాల కేజీబీవీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. కొత్తపట్నం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రావ్య మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని మొత్తం 5,998 మంది పిల్లలు ఉండగా 5,778 మందికి నులిపురుగుల నివారణ మాత్రలను మింగించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ మహేష్‌కుమార్‌రాజు, సీహెచ్‌వో ఓంకార్, పీహెచ్ఎన్ ఇందిరాదేవి, సూపర్‌వైజర్లు సులోచనరాణి, ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి

పొన్నలూరు: నులిపురుగుల నిర్మూలన కోసం 1 నుంచి 19 ఏళ్ల వయసు లోపు పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని వైద్యాధికారి కృష్ణచైతన్య సూచించారు. మండలంలోని 15 సచివాలయాల పరిధిలో ఉన్న 5,249 పిల్లలుండగా వీరిలో 5,107 మందికి ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలను మింగించినట్లు తెలిపారు. మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భాస్కరరావు, ఆరోగ్య విస్తరణ అధికారి సురేష్, గిరిజ, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులతో రక్తహీనత

మద్దిపాడు: మద్దిపాడులోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నులిపురుగుల మాత్రలను డాక్టర్ ఆనంద్‌మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. నులిపురుగుల నివారణతో రక్తహీనత సమస్యను అధికమించవచ్చని ఆయన చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బాలకోటయ్య, దరియా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

99 శాతం మాత్రల పంపిణీ

ఒంగోలు(రూరల్): ఒంగోలు మండలం కరవది పీహెచ్‌సీ పరిధిలో మంగళవారం నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమం 99 శాతం జరిగినట్లు వైద్యాధికారి సుందరప్రసాద్ తెలిపారు. ఏడాది నుంచి 19 సంవత్సరాల్లోపు వారికి ఈ మాత్రలు పంపిణీ చేసినట్లు చెప్పారు. మండలంలో 2,404మందికి గాను 2,378 అల్బెండజోల్ మాత్రలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

15న భారత రాజ్యాంగంపై అవగాహన సదస్సు

● జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు రంగారావు



మాట్లాడుతున్న రంగారావు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగంపై కనీస అవగాహన కోసం ఈనెల 15వతేదీన ఒంగోలులోని రంగాభవన్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు చుండూరి రంగారావు తెలిపారు. స్థానిక రంగాభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 75 ఏళ్ళుగా కేంద్ర ప్రభుత్వాలు కాని, రాజకీయ పార్టీలు గాని పౌరులకు రాజ్యాంగంపై కనీస అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. రాజ్యాంగం పట్ల పౌరులకు అవగాహన ఉంటే పాలకులు, ప్రభుత్వ ఉద్యోగులు ఎక్కడ తమ హక్కులపై నిలదీ స్తారోనని ఆందోళనతో తెలియకుండా ఉండేందుకు శ్రద్ధ వహించారని విమర్శించారు. ఈక్రమంలో రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు ఏర్పాటు చేశామని, సభ అనంతరం వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు చావలి సుధాకరరావు, వెంకటేశ్వర్లు, పేరయ్య, ఎల్.రాజశేఖర్, బి.సుబ్బారావు, ఎం.ఏ.సలార్, నక్క అయ్యన్న, చల్లా సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

సంతనూతలపాడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో వైద్యసేవలు పొందుతున్న తొమ్మిదిమందికి సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ అందజేశారు. మంగళవారం ఒంగోలు నగరం మంగమూరు రోడ్డులోని ఎమ్మెల్యే బీఎన్ కార్యాలయంలో లబ్ధిదారులకు రూ.3.40లక్షల చెక్కులను అందించారు. కార్యక్రమంలో టీడీపీ చీమకుర్తి మండల రూరల్ అధ్యక్షుడు గొట్టిపాటి రాఘవరావు, ప్రధానకార్యదర్శి ఇస్తర్ల ఏడుకొండలు, నాయకులు మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, దావులూరి అనిల్‌కుమార్, గోగినేని రాజా, మన్నం శేషయ్య, కరిచేటి వెంకటేశ్వర్లు, వేల్పుల శ్రీనివసరావు తదితరులు పాల్గొన్నారు.

కరవది సొసైటీ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



ఎం.శ్రీనివాసరావు

ఒంగోలు రూరల్, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): కరవది సొసైటీ అధ్యక్షుడిగా ఒంగోలు మండలం దేవరంపాడుకు చెందిన ముప్పవరపు శ్రీనివాసరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే సొసైటీ సభ్యులుగా పోలవరపు చెంచురామయ్య, చిల్లర హనుమతరావులను నియమించారు. ఈ మేరకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు అధ్యక్షుడు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

16న గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశ పరీక్ష

నాగులుప్పలపాడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అమ్మనబ్రోలులోని గురుకుల బాలికల పాఠశాలలో 6వ తరగతిలో మిగిలి ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు ఈ నెల 16 ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థినులు విద్యార్హత పత్రాలతో ఈనెల 14లోగా గురుకుల పాఠశాలలో సాయంత్రం 5 గంటలు లోపు అందజేయాలని కోరారు. వివరాలకు 8712625043 సెల్ నంబరులో సంప్రదించాలన్నారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి రెండు రోజుల పాటు నగరంలో పర్యటించనున్నారు. గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు ఒంగోలు నగరం రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాలకు హాజరవుతారు. శుక్రవారం ఉదయం 7.15 గంటలకు ఎస్ఎస్‌ట్యాంకు1 వద్ద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, 8గంటలకు కార్పొరేషన్ కార్యాలయంలో, 8.45 గంటలకు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎంపీ పాల్గొంటారు.

ఘనంగా యువజన దినోత్సవం



మాట్లాడుతున్న క్లబ్ ప్రతినిధులు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గౌతమ్ మోడల్ స్కూలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మజ్నూ బీబీ భవిష్యత్ ప్రణాళిక, స్కిల్ డవలప్‌మెంట్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు శ్రీనివాసరావు, సెక్రటరీ శ్రీనివాస చౌదరి, కోశాధికారి శ్రీరామ్మూర్తి, స్కూలు కరస్పాండెంట్ కొండయ్య, గుమ్మడి శ్రీధర్, లక్ష్మీనారాయణ, గోపాలకృష్ణ సురేంద్ర, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒంగోలు పొగాకు వేలంకేంద్రం-2 షెడ్యూల్

ఒంగోలు(రూరల్), ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో బ్యారన్ కోటాలో ఇంకా మిగిలి ఉన్న రైతులు రోజుకు 10 బేళ్ల వంతున వేలానికి తీసుకురావాలని వేలం నిర్వహణాధికారి జె.తులసి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 రౌండ్ షెడ్యూల్‌లో భాగంగా 13వ తేదీన ఒంగోలు, గుత్తికొండవారిపాలెం, అనుబ్రోలువారిపాలెం, కేశినేనివారిపాలెం, ప్రాసంగలపాడు, ఉప్పుగుండూరు, చదలవాడ, కొప్పోలు, సూరారెడ్డిపాలెం, 14న అమ్మనబ్రోలు, చవటపాలెం, రాపర్ల, మాచవరం, 16న నాగులుప్పలపాడు, ఒమ్మెవరం, ఓబన్నపాలెం, మండవవారిపాలెం, ముక్తినూతలపాడు, 18న చీర్వానుప్పలపాడు, దొడ్డవరప్పాడు, వెంకటరాజుపాలెం, ఏడుగుండ్లపాడు, ఉలిచి, 19న టి.అగ్రహారం, వలేటివారిపాలెం, మద్దిరాలపాడు, 20న చేకూరపాడు, ఇనమనమెళ్లూరు, ఆలూరు, గాదెపాలెం, 21నదశరాజుపల్లి, గుడిమెళ్లపాడు, బొద్దులూరివారిపాలెం, దేవరంపాడు, కరవది, త్రోవగుంట, పానకాలపాలెం గ్రామాల రైతులు పొగాకు బేళ్లు తీసుకురావాలని కోరారు. బేలుకు 150 కేజీలు మించకుండా ఉండాలని ఆమె సూచించారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

నాగులుప్పలపాడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకుంటే క్రమశిక్షణ చర్యలు తప్పవని ఎంపీడీవో తేళ్ల రవికుమార్ పేర్కొన్నారు. ఉప్పుగుండూరులోని రెండు సచివాలయాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, రికార్డులను పరిశీలించారు. పీ4 బంగారు కుటుంబాలు ఎంపిక, స్వామిత్వ సర్వే వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రతి రోజు గ్రామంలో చెత్త సేకరణ, ఫొటోలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న కౌసల్యం (వర్క్‌ఫ్రమ్ హోమ్) సర్వే ను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పరిశీలన



మాట్లాడుతున్న అధికారులు, నాయకులు

చీమకుర్తి, ఆగస్టు 12(ఆంధ్ర జ్యోతి): కూనంనేనివారి పాలెం గ్రామంలో ఎస్సీ కాలనీకి తాగునీటిని సరఫరాలో ఎదురవుతున్న అవరోధాలను మంగళవారం అధికారులు పరిశీలించారు. గ్రామంలోని అంబేడ్కర్‌నగర్, క్రిస్టియన్‌పాలెంలో జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, జేఈ శాంతిప్రియ, కాంట్రాక్టర్ హరిబాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నాగేశ్వరరావు పైపులైన్ నిర్మాణంపై పరిశీలన జరిపారు.

చెత్త సేకరణపై అవగాహన



చెత్త సేకరణను పరిశీలిస్తున్న అధికారులు

పొన్నలూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో చెత్తను ఎప్పటికప్పుడు సేకరించి వర్మీ కంపోస్టుగా మార్చాలని డీపీవో వెంకటనాయుడు సూచించారు. ఐవీఆర్ఎస్ గ్రామాల్లో జరుగుతున్న చెత్తసేకరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన పొన్నలూరులో పర్యటించారు. చెత్త విభజనపై స్థానికులకు, సేకరణపై క్లాప్‌మిత్రలకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి దగ్గరే తడి, పొడిచెత్తను వేరుచేయాలని సూచించారు. అనంతరం ఉప్పలదిన్నెరోడ్డులోని చెత్తసేకరణ కేంద్రానికి వెళ్లి వర్మీ కంపోస్టు తయారీని కూడా పరిశీలించారు. అలాగే సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ సుజాత, డిప్యూటీ ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరంగా ర్యాలీ

గిద్దలూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గిద్దలూరు పట్టణంలో ఈనెల 13వ తేదీ ఉదయం 10గంటలకు తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు ఎ.ఉదయ్‌శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ప్రధాన వీధుల గుండా రాచర్ల గేటు వరకు తిరంగా ర్యాలీ జరుగుతుందని, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

నవోదయకు దరఖాస్తుల ఆహ్వానం

తర్లుపాడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కలుజువ్వలపాడు జవహర్‌లాల్ నవోదయ విద్యాలయం-2లో 11వ తరగతి ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు ప్రిన్సిపాల్ పి.బ్రహ్మానందరెడ్డి తెలిపారు. పశ్చిమ ప్రకాశంలోని 27 మండలాలకు చెందిన పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించటం జరుగుతందన్నారు. దరఖాస్తులను నవోదయ విద్యాలయంలో స్వయంగా గానీ, లేదా ఈమెయిల్ ద్వారా గానీ పంపవచ్చన్నారు.

మల్లె తోటలో తెగుళ్ల నివారణపై సూచనలు

కంభం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలం రావిపాడు గ్రామంలో మల్లె, సన్నజాజి తోటలను ఉద్యాన శాఖ అధికారి శ్వేత పరిశీలించారు. మల్లె తోటలో మొగ్గ ఈగ ఉధృతి ఎక్కువగా ఉందని, ఈగ లార్వా మొగ్గలోకి చేరడం వలన మొక్క గులాబీ రంగులోకి మారి ఎండిపోవడం జరుగుతుందన్నారు. దీని నివారణకు కియోమిటార్ఫప్ 75 ఎంఎల్ లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలన్నారు. జాజి తోటలో నల్లి ప్రభావం ఎక్కువగా ఉందని, ఆకు అడుగు భాగాన చేరి రసం పీల్చడం వలన ఆకుపై బొబ్బలు ఏర్పడి ఎండిపోవడం జరుగుతుందన్నారు. దీని నివారణకు పైరోపెసిటిన్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ మల్లికార్జున్, రైతులు పాల్గొన్నారు.

రామన్న కతువ పొంగింది

రాచర్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లమల అడవుల్లో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిన్నగానిపల్లి సమీపంలో రామన్న కతువ పొంగి పొర్లుతోంది. దాదాపు నెల రోజుల నుంచి వర్షాలు కురవకపోవడంతో రైతులు సకాలంలో పంటలు కూడా వేయలేదు. సకాలంలో వర్షాలు పడలేదని రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో వరుణ దేవుడు కరుణించి వర్షించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రామన్న కతువ నిండి పొంగి పొర్లడమే కాకుండా చెరువులకు కూడా సమృద్ధిగా నీరు ప్రవహిస్తోంది. గుండ్లకమ్మ వాగు ఆకవీడు ఎర్రగుడిదిన్నె చెరువు దొడ్డిని చెరువు చిన్నగానిపల్లి చెరువుకు నీరు చేరి చెరువులు కళకళలాడుతున్నాయి. చోళవీడు సమీపంలోని గుండ్లకమ్మ వాగు ద్వారా కంభం చెరువు కూడా నీరు చేరుతుండడంతో రైతులు ఆనందంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కతువ డ్యామ్‌కు భారీగా చేరిన వరద నీరు

అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ బాధ్యత



కృతజ్ఞతా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళా రైతులు

- ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి
- 450 ట్రాక్టర్లతో సుఖీభవకు కృతజ్ఞతా ర్యాలీ
- చంద్రబాబు చిత్రపటానికి రైతుల పాలాభిషేకం

గిద్దలూరు టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల సంక్షేమం ప్రజా ప్రభుత్వ బాధ్యత అని, ఆదిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం అన్నదాత సుఖీభవ పథకానికి కృతజ్ఞతగా పట్టణంలోని ఒంగోలు రోడ్డు నుంచి కుమ్మరాంకట్ట వరకు 450 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో రైతులతో కలిసి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన ట్రాక్టర్‌ను నడిపారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ విత్తనం కొనుగోలు నుంచి పంట విక్రయం వరకూ రైతులకు అండగా ప్రభుత్వం ఉంటుందని, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతులకు ఖాతాల్లో డబ్బులు జమచేస్తున్నామన్నారు. అలాగే రైతులకు సబ్సిడీతో యంత్రాలు, పరికరాలు అందజేస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్లలో వైసీపీ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. కనీసం రైతులకు గోనె సంచులు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. జగన్ పాలనలో వేలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. ప్రచార పిచ్చిలో పట్టాదారు పాస్‌పుస్తకాలపై రాజ ముద్రకు బదులు జగన్ తన బొమ్మను వేసుకున్నారన్నారు. ప్రజా ప్రభుత్వం రాగానే రాజముద్రతో కొత్త పాసు పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు రూ.20వేలు పెట్టుబడి సాయంగా అందిస్తున్నట్లు తెలిపారు. వర్షాలు తక్కువగా ఉన్నప్పటికీ రిజర్వాయర్లు నీటితో కళకళ లాడుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. మామిడి, మిర్చి, పొగాకు రైతుల కష్టాలను చూసి గిట్టుబాటు ధర కల్పిస్తున్నామని, వరదల వలన నష్టపోయిన రైతులకు రూ.300కోట్ల పంట నష్టం అందించిందని, నీటి ప్రాజెక్టుల పూర్తికి ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారని అశోక్‌రెడ్డి వివరించారు. తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబా, బీజేపీ నాయకులు జె.వి.నారాయణ, గిద్దలూరు, కంభం మార్కెట్‌యార్డు ఛైర్మన్లు భైలడుగు బాలయ్య, పూనూరు భూపాల్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్లు గోడి ఓబుల రెడ్డి, తోట మహాలక్ష్మి, మున్సిపల్ ఛైర్మన్ వెంకటసుబ్బయ్య, పట్టణ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ షానేషావలి, రైతు సంఘం అధ్యక్షులు బిజ్జం రవీంద్రరెడ్డి, సొసైటీ బ్యాంక్ ఛైర్మన్లు దుత్తా బాలీశ్వయ్య, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

చంద్రబాబు ఉండగా.. సేద్యం పండుగ

పెద్ద దోర్నాల : రైతన్నలకు అండగా చంద్రబాబు ఉండగా.. సేద్యం పండుగేనని ఒంగోలు పార్లమెంట్ టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఈదర మల్లయ్య పేర్కొన్నారు. మండలంలోని అయినముక్కల గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.5 వేలు బ్యాంకులో జమ చేసిన క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ మహిళా రైతులు ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మల్లయ్య ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వి వరించారు. కార్యక్రమంలో కోటిరెడ్డి, బోళ్ల బాలకృష్ణారెడ్డి, దర్శనం బద్రీ, ఎలకపాటి బాబు పాల్గొన్నారు.



జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

లింగారెడ్డి కాలనీలో తిరంగా ర్యాలీ

తర్లుపాడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలుజువ్వలపాడు లింగారెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జాతీయ జెండా పట్టుకుని వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు షేక్ మౌలాలి మాట్లాడుతూ.. దేశభక్తిని పెంపొందించే ఒక సంకల్పం దేశ గర్వం, ఐక్యత, త్యాగం, స్వాతంత్ర్యానికి ప్రతీక మన 3 రంగుల జెండా అని అన్నారు. ఆగస్టు 15న మువ్వెన్నెల జెండా ప్రతి ఇంటిపై ఎగరువేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు అలివేలు కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెద్దారవీడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పెద్దారవీడు మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో జాన్‌సుందరం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని అన్నీ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అందరూ హాజరై గ్రా మాలలో నెలకొన్న సమస్యలపై చర్చించాలని ఆయన కోరారు.

రోడ్లపై గుంతలు

- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు
- స్పందించి మరమ్మతులు చేయించిన కమిషనర్

పొదిలి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పొదిలిలో ఆర్‌అండ్‌బీ అధికారులు పత్తా లేకుండా పోయారు. ఆర్‌అండ్‌బీ సబ్ డివిజన్ కేంద్రం అయినప్పటికీ ఇంజనీరింగ్ అధికారులు కార్యాలయం వైపు చూడడం లేదు. పట్టణంలో ఎన్ని ప్రమాదాలు జరిగి ఎంతమంది ప్రాణాలు గాలిలో కలిసిపోయినా రోడ్లకు మరమ్మతులు చేయాలన్న ఆలోచన లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాటూరివారిపాలెం నుంచి మార్కాపురం అడ్డరోడ్డు వరకు ప్రధాన రహదారిపై గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. కొద్దిపాటి వర్షాలకు కూడా రోడ్డుపై వర్షపు నీరు నిలబడి గుంతలు కనపడక వాహన చోదకులు ప్రమాదానికి గురవుతున్నారు. గుంతల్లో తట్టెడు మట్టిపోసేందకు కూడా ఆర్‌అండ్‌బీ అధికారులు ముందుకు రావడం లేదని వాహనదారులు విమర్శిస్తున్నారు. ఇటీవల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో నగరపంచాయతీ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి చొరవతీసుకొని మంగళవారం ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను సిమెంట్ కాంక్రీట్‌తో పూడ్చి మరమ్మతులు చేయించారు.



మార్కాపురం అడ్డరోడ్డు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న రహదారిలో గుంతలకు మరమ్మతులు చేయిస్తున్న కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి

అధికారులు రాని సమావేశం ఎందుకు?

ఎంపీపీ, సభ్యుల ఆగ్రహం

తర్లుపాడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు రానప్పుడు సమావేశం ఎందుకు అంటూ ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశానికి ప్రధాన శాఖలైనటువంటి ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, విద్య, ఇరిగేషన్, ఆర్టీసీ వంటి శాఖల అధికారులు సమావేశానికి రాకపోవడంతో సమస్యలు ఎవరు పరిష్కరిస్తారంటూ సమాధానాలు ఎవరు చెప్తారంటూ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని మీర్జపేటలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని ఆ గ్రామ ఎంపీటీసీ సభ్యుడు పార్వతి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. తల్లికి వందనం పలు గ్రామాల్లో విద్యార్థులకు పడలేదని



మాట్లాడుతున్న ఎంపీపీ భూలక్ష్మి

సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వెలుగు ఏపీఎం రమేష్ గ్రామాల్లో పర్యటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, గ్రామాల్లో కనీసం మీటింగ్‌లు కూడా ఏర్పాటు చేయలేదని పలువురు ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. మండలంలోని కేతగుడిపిలో ఉపాధి హామీ పథకంలో భారీ స్థాయిలో అవినీతి జరుగుతుందని కూకూలీల వద్ద నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ వారానికి రూ.200 వసూలు చేస్తున్నారని ఆ గ్రామ సర్పంచ్ దూ దేకుల పెద్దమస్తాన్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ శాఖ ఏఈ హనుమాన్ నాయక్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి సోలార్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి మాట్లాడుతూ.. గ్రా మాల్లోని సమస్యలు తమ దృ ష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు స మన్వయంతో పని చేస్తు మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గురు చంద్రశేఖర్, ఎ మ్మార్వో కిశోర్‌కుమార్, ఈవోఆర్‌డీ సుకుమార్, మండలంలోని పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

స.హ. చట్టంపై అవగాహన

తర్లుపాడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టంపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోఆర్‌డీ సమాచార హక్కు చట్టం గురించి వివరించారు. సమాచారం కోసం దరఖాస్తు చేసుకుంటే కచ్చితంగా 30 రోజుల్లోపు సమాచారం ఇవ్వాలి అన్నారు. అలా ఇవ్వని పక్షంలో పై అధికారులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమాచార హక్కు చట్టం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి, వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ కేకే కిశోర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

రాచర్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని పాలకవీడులో సోమవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పరిస్థితులపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్త వహించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పకుండా ధరించాలని, గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని అన్నారు. అపరిచితుల ఫోన్లు లిఫ్ట్ చేయవద్దని తెలిపారు. సమస్యలు ఏవైనా ఉంటే తమకు తెలియజేయాలని కోరారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

గిద్దలూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబవరం, వెంగలరెడ్డిపల్లి గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారి ఎం.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ 2025-26 ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసుకున్న పంటలను రైతులు తప్పనిసరిగా ఈక్రాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అతివృష్టి, అనావృష్టితో పంటలు నష్టపోతే ప్రభుత్వం ద్వారా నష్ట పరిహారం పొందే వీలుంటుందని, మద్దతు ధర, పంటల బీమా, సున్నా వడ్డీ పొందవచ్చన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి నగదు జమకాని రైతులు గ్రీవెన్స్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఆముదం, పత్తి పంటలను పరిశీలించి చీడపీడలు, నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. వ్యవసాయ విస్తరణాధికారి శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ సహాయకులు హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : పంటలను సాగు చేసిన ప్రతి రైతు ఈ పంటలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

వ్యవసాయాదికారి బుజ్జిబాయి కోరారు. మండలంలోని శివరాంపురం, కొండేపల్లి గ్రామాలలో మంగళవారం రైతులతో కలిసి పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకంలో సాంకేతిక కారణాలతో నగదు వ్యక్తిగత ఖాతాలలో జమకాని వారు ఎన్‌సీపీఐ లింకు సమస్య ఉంటే సరిచే సుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అదికారి రమేష్, వీఏఏలు ఈశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పెద్దారవీడు : ఖరీఫ్‌లో పంటలు సాగుచేసే రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీ బాలాజీనాయక్ అన్నారు. పొలంపిలుస్తోంది కార్యక్రమం లో భాగంగా మంగళవారం మండలంలోని మద్దలకట్టలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడీ బాలాజీ నాయక్ మాట్లాడుతూ సానుకూల వాతావరణంగా పంటలు సాగు చేసిన రైతులందరూ ఆయా రైతు సేవాకేంద్రాలలో బీమా ప్రీమియం చెల్లించి రసీదు పొందాలన్నారు. తొలుత రైతులందరూ తాము సాగు చేసిన పంటలను నమోదు చేయించుకోవాలన్నారు. బ్యాంకులలో రుణం తీ సుకున్న రైతుల అంగీకారంతో ప్రీమియం ఈ నెల 31 వరకూ మినహాయిస్తారన్నారు. లోను తీసుకోకుండా సాగుచేసిన రైతులు ఈ నెల 15లోపు ప్రీమియం చెల్లించాలన్నారు. కౌలు చేసుకునే రైతులు గ్రామ రెవెన్యూ, వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి పంట సాగు పత్రాలు పొం దాలన్నారు. కార్యక్రమంలో ఏవో లక్ష్మీనారాయణ, సహాయకులు విశ్వనాథ్, ఏఈ వో సునీల్ నాయక్, రైతులు పాల్గొన్నారు.



కాలేజీ రోడ్డులోని పెట్రోల్ బంక్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

మార్కాపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పెట్రోల్ బంకు నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ హెచ్చరించారు. పట్టణంలోని పలు పెట్రోలు బంకులను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. స్థానిక కాలేజీ రోడ్డులోని భారత్ పెట్రోలియమ్ బంకును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత, పరిమాణం విషయంలో ఎలాంటి ఫిర్యాదులు అందినా చర్యలు తప్పవన్నారు. వాహనదారులకు సౌఖర్యాలు కల్పించాలన్నారు.

స్వమిత్ర సర్వే పూర్తి చేయాలి

ఎర్రగొండపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో స్వమిత్వ సర్వేలో ఎంపికైన కొలుకుల, గోళ్లవీడపి, గంగాపాలెం గ్రామాల్లో నివాస గృహాల సర్వే పూర్తి చేయాలని గ్రామ పంచాయతీల కార్యదర్శులను మార్కాపురం డీఎల్‌పీవో భాస్కరరెడ్డి మంగళవారం ఆదేశించారు. గ్రామ కంఠం స్థలంలో నిర్మించుకున్న ప్రతి ఇంటికీ ఈ నెల 31వ తేదీలోపు సర్వే చేసి యజమానికి హక్కు పత్రాన్ని అందజేయాలన్నారు.

కొండారెడ్డికాలనీలో సమస్యలు పరిష్కరించాలి

మార్కాపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కొండారెడ్డికాలనీలో సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కాలనీలో మంగళవారం ఆ పార్టీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా సైడు కాలువలు లేకపోవడంతో వర్షాకాలంలో రహదారులపైనే మురుగు పారుతోందన్నారు. నీటి కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. పది రోజులకోసారి సాగర్ నీటి సరఫరా చేస్తున్నారన్నారు. ఆయా సమస్యలను మున్సిపల్ అధికారులు వెంటనే పరిష్కరించేలా తాము మాట్లాడుతామని స్థానికులకు కాంగ్రెస్ నాయకులు హామీ వచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ ఇమ్రాన్, మైనార్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షులు షేక్ మహబూబ్‌వలి, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు రిహానాబాను, తర్లుపాడు మండల పార్టీ అధ్యక్షుడు హుస్సేన్ పాల్గొన్నారు.

గుడిమెట్ట రైల్వే స్టేషన్ సమీపంలో మృతదేహం

రాచర్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుడిమెట్ట రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ పక్క గుర్తు తెలియని మృతదేహం పడి ఉంది. అతడి వయసు దాదాపు 30 నుంచి 35 సంవత్సరాలలోపు ఉంటుందని తెలిసింది. ట్రాక్ సమీప పొలాల రైతులు మృతదేహాన్ని గుర్తించి విషయాన్ని పరిసర గ్రామ ప్రజలకు తెలియజేశారు. గుంటూరు నుంచి డోన్ వెళ్లే ప్యాసింజర్ రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు.

ఆటో కార్మికుల ధర్నా

గిద్దలూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల ఉపాధిని కాపాడాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో వర్కర్స్ స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సంఘ జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు పథకం వలన ఆటోకార్మికుల ఉపాధిపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ అంజనేయరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రఫి, హుస్సేన్, నాగేశ్వరరావు, నరేంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



మాత్రలను మింగిస్తున్న హెచ్‌ఎం ప్రసన్నతాంజలి

పెద్ద దోర్నాల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణ దినాన్ని ఆరోగ్యశాఖ సిబ్బంది మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్‌బెండజోల్ మాత్రలను ప్రధానోపాధ్యాయురాలు శ్యాం ప్రసన్నతాంజలి విద్యార్థులకు మింగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం ఆరోగ్య శాఖా సిబ్బంది పాఠశాలలోని 736 మంది విద్యార్థులతో మింగించారు. భోజనం చేసేటప్పుడు చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం నాగలక్ష్మి, వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది నాగమూర్తి, రామానాయక్ పాల్గొన్నారు.

రాచర్ల : నులి పురుగుల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అనుములవీడు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ భానుకుమార్‌రెడ్డి, డాక్టర్ రమేష్ అన్నారు.మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు నులిపురుగులపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్రతి పనికి ముందు తర్వాత పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెం గిరిజన గురుకుల పాఠశాలలో మంగళవారం ప్రభుత్వ డాక్టర్లు నులిపురుగుల నివారణకు విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా డీఎంవో మధుసూదనరావు, డాక్టరు చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ బి పెద్దిరాజు, ఉపప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని వెంకటాద్రిపాలెం, కొలుకుల, గంగాపాలెం తదితర గ్రామాలలో విద్యార్థులకు ఉచితంగా అల్బెండజోల్ మాత్రలను పంపిణి చేశారు.

డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్ నివారణ డే

కంభం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులలో ర్యాగింగ్ దుష్ప్రభావాలు, చట్టపరమైన శిక్షలు, విద్యార్థుల పరస్పర గౌరవం గురించి వాసవీ డిగ్రీ కళాశాలలో మంగళవారం ర్యాగింగ్ నివారణ రోజును ఘనంగా నిర్వహించారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఆదేశాల మేరకు విద్యార్థులలో ర్యాగింగ్ గురించి అవగాహన కల్పించారు. ఈసభకు ముఖ్యఅతిథిగా కళాశాల చైర్మన్ గోళ్ల రత్నం హాజరై ర్యాగింగ్‌పై చట్టపరమైన కోణాలను వివరిస్తూ నివారణ చర్యలపై వివరించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ రాము, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

‘కనిగిరి’లో అభివృద్ధి పరుగులు

- ఓర్వలేకే వైసీపీ నేతల అసత్య ఆరోపణలు
- వంకర నాలుకలకు బుద్ధి చెప్పాలి
- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


ట్రాక్టర్‌ను నడుపుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల వంకర నాలుకలకు కూటమి శ్రేణులు బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం జరిగిన రైతు సంబర సభలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసీపీ నేతల నాలుకలు వక్రంగా తిరుగుతూ అబద్ధాలు ప్రచారాలు చేస్తున్నారన్నారు. లోలోపల మాత్రం వారి పాలనలో ఎందుకు అభివృద్ధి చేయలేక పోయామా అని మదన పడుతున్నారన్నారన్నారు. ఈవిషయాన్ని వైసీపీ నేతలే అక్కడక్కడా తమ స్నేహితుల వద్ద మాట్లాడుతున్నారన్నారు.

కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ఎజెండాగా ముందుకు వెళుతుందని డాక్టర్ ఉగ్ర పేర్కొన్నారు. ఇలాంటి అవాకులు, చవాకులు పట్టించుకుంటూపోతే అభివృద్ధి చేయలేమన్నారు. తన ముందున్న లక్ష్యం కనిగిరి అభివృద్ధేనని అన్నారు. తాము ఆవిధంగా ముందుకు వెళ్తున్నాం కాబట్టే వైసీపీ నేతలు రోడ్లపై చేరి ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారని మండిపడ్డారు. తాము అధికారాన్ని చూపిస్తే నియోజకవర్గంలో ఏఒక్క వైసీపీ నేత తిరగలేరన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఎన్డీఏలో క్రమశిక్షణతో మెలుగుతున్నామని, వైసీపీ లాంటి రాక్షస పార్టీలా కాదన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రం ఆర్థికంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కొంటున్పటికీ అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో నగదు జమ చేసినట్లు చెప్పారు. కనిగిరి నియోజకవర్గంలో దాదాపు 50వేల మంది రైతుల ఖాతాల్లో రూ.83.96కోట్లు కేటాయించటం జరిగిందన్నారు. తొలివిడతగా ఇప్పటికే రూ28.38 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లోకి వచ్చాయన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌బాబు పనిచేస్తున్నారన్నారు. అందుకే కనిగిరి ప్రాంత రైతులు కూటమి ప్రభుత్వంపై విశ్వాసాన్ని నిరూపించుకునేలా వచ్చే ఎన్నికల్లో కూడా కనిగిరిలో టీడీపి జెండా ఎగురేయాలని పిలుపునిచ్చారు.

పండుగలా రైతు సంబరం

నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి రైతులు పెద్దఎత్తున ట్రాక్టర్లతో రైతు సంబరం కార్యక్రమానికి తరలివచ్చారు. దీంతో అమరావతి ప్రాంగణం పండుగ వాతావరణంలో మారింది. అమరావతి ప్రాంగణం నుంచి ఎమ్మెల్యే రైతు సంబరం కార్యక్రమాన్ని ప్రారంభించే సందర్భంగా తానే స్వయంగా ట్రాక్టర్ నడుపుకుంటూ మార్కెట్‌యార్డుకు వెళ్ళారు. ఆయనను అనుసరిస్తూ వందలాది ట్రాక్టర్‌లు కదిలాయి. ఒంగోలు బస్టాండు వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జోడెద్దుల సవారీ చేస్తూ ఎమ్మెల్యే మార్కెట్ యార్డుకు చేరుకున్నారు. అక్కడి నుంచి సభకు చేరుకున్న ఎమ్మెల్యే రైతుల నుద్దేశించి ప్రసంగించారు.

కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కాశిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ యారవ రమాదేవి, పీప్ యార్డు చైర్మన్ తోడేటి గోపి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు యాదవ్, పువ్వాడి వెంకటేశ్వర్లు, వేమూరి రామయ్య, సానికొమ్ము తిరుపతిరెడ్డి(ఎస్టీఆర్), ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, బొమ్మనబోయిన వెంగయ్యయాదవ్, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, రోషన్ సందాని, జంషీర్ అహ్మద్, తమ్మినేని వెంకటరెడ్డి, అడుసుమిల్లి ప్రభాకర్, ముప్పా రంగసాయి, యారవ శ్రీను, కరణం అరుణ, కమతం వెంకటేశ్వర్లు, అద్దంకి రంగబాబు, కుందురు నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా..

పామూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం నిలిచిందని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. కనిగిరి వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం నిర్వహిస్తున్న రైతు సంబర సభకు పామూరు, సీఎస్‌పురం మండలాల నుంచి రైతు ప్రగతి రథాలు మంగళవారం తరలివెళ్లాయి. ముందుగా పామూరు టీడీపీ కార్యాలయం వద్ద నుంచి పలు ట్రాక్టర్‌లను ఆయన జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

వైభవంగా ముగిసిన పోలేరమ్మ కొలుపులు

తాళ్లూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగంబొట్లపాలెం గ్రామంలో పోలేరమ్మ కొలుపులు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఈనెల 3 నుంచి పోలేరమ్మకు పలు రకాల పూజలు సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. చివరి రోజు మంగళవారం పోలేరమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. బంధుమిత్రుల రాకతో గ్రామంలో తిరునాళ్ళ వాతావరణం కన్పించింది. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే పాపారావు, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, మాజీ అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కొలుపులకు అధిక సంఖ్యలో బంధుమిత్రులు, వివిధపార్టీలకు చెందిన నాయకులు తరలిరావటంతో గ్రామంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ఎస్సై ఎస్.మల్లికార్జురావు తన సిబ్బందితో ట్రాఫిక్‌ను నియంత్రణచేసి రాకపోకలకు సమస్యలు లేకుండా చర్యలు చేపట్టారు.

నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు జాతీయ పులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా 6038 మంది విద్యార్థులకుగాను మంగళవారం 5846 మందికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు డాక్టర్ సందిరెడ్డి మురళి తెలిపారు. 1 నుండి 2 సంవత్సరాల వయసు కలిగిన విద్యార్థులకు సగం మాత్ర నీటిలో కరిగిబెట్టి తాపించాలన్నారు. 3 నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్న విద్యార్థులకు ఒక మాత్రను మింగించాలని సూచించారు. కార్యక్రమాల్లో డాక్టర్ మహేష్, కమ్యూనిటిహెల్త్ అధికారి మురళి, హెల్త్ అసిస్టెంట్ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా తాళ్లూరు, తూర్పుగంగవరం పీహెచ్‌సీల పరిధిలో 9548 మందికి ఆల్బెండజోల్ మాత్రలను మంగళవారం అందజేశారు. తాళ్లూరు పీహెచ్‌సీ పరిధిలో 4317 మందికి, తూర్పుగంగవరం పరిధిలో 5231 మందికి నులిపురుగు నిరారణ మందులు పంపిణీ చేశారు.ఆయా పీహెచ్‌సీల పరిదిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలలో ఈ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ్, రాజేష్‌యాదవ్, మౌనిక, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్‌ను అభినందించిన డాక్టర్ లక్ష్మి


సొసైటీ చైర్మన్ చిన్నచెన్నయ్యను అభినందిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దొనకొండ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పదమర కంభంపాడు సొసైటీ చైర్మన్‌గా నియమితులైన వీరపనేని చిన్నచెన్నయ్యను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు అభినందించారు. కంభంపాడు సొసైటీ చైర్మన్‌గా వీరపనేని చిన్నచెన్నయ్య. సభ్యులుగా జి.అంకిరెడ్డి, పెద్దబ్రహ్మయ్యలను నియమిస్తూ ఉత్తర్వులు అందాయి. డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్‌లను చిన్నచెన్నయ్య వారి స్వగృహంలో మంగళవారం కలిసి శాలువా, పూలమా లలతో సన్మానించారు. తన ఎంపికకు కృషి చేసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు కామేపల్లి చెంచయ్య, వల్లపునేని వెంకటస్వామి, సింగమనేని హనుమంతు, రామసుబ్బయ్య, తిరుపతయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్‌లు

పామూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పామూరులో రోడ్డు మార్జిన్‌లు ప్రమాదకరంగా మారాయి. పామూరు నుంచి నెల్లూరు వెళ్లేమార్గంలో జాతీయ రహదారి జంక్షన్ వరకు మార్జిన్‌ల్లో గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తారు రోడ్డుగా ఉన్న ఈమార్గాన్ని సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేశారు. రోడ్డు నిర్మాణ సమయంలో సింగిల్ రోడ్డుగా నిర్మించారు. దాంతో వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు రోడ్డు మార్జిన్ దిగాల్సివస్తుంది. మార్జిన్ దిగి, రోడ్డు ఎక్కేటప్పుడు ద్విచక్రవాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా నిర్మించకుండా, కేవలం రోడ్డుకిరువైపులా గ్రావెల్ మట్టిపోసి చేతులు దులుపుకున్నారు. కూటమి ప్రభుత్వ పాలకులు స్పందించి పామూరు - నెల్లూరు మార్గాన్ని డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వెలిగొండకు రూ.2వేల కోట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కనిగిరి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2వేల కోట్లు కేటాయించాలని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. ఆసంఘం జిల్లా మహాసభలు మంగళవారం కనిగిరిలో జరిగాయి. బడుగు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ 23ఏళ్ళు క్రితం వెలిగొండ నిర్మాణం పనుల ప్రారంభించినా ఇప్పటికీ పూర్తి చేయలేదన్నారు. ఈప్రాజెక్టు పూర్తయితే లక్షలాది ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి, ఆంజనేయులు, నెరుసు వెంకటేశ్వర్లు, కేజీ మస్తాన్, తదితరలు పాల్గొన్నారు. తొలుత పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

సీజ్ చేసిన వాహనాలకు నేడు వేలం

దర్శి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సీజ్ చేసిన వాహనాలకు బుధవారం వేలంపాట నిర్వహిస్తున్నట్లు దర్శి ఎస్ఐ ఎంమురళీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు, డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ సూచనల మేరకు ఆరు ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగినవారు ఈ వేలంపాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ పూజలు

పామూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకట్టకిందపల్లి గ్రామంలో జరుగుతున్న శ్రీఅభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం యజ్ఞహోమాల కార్యక్రమాలను రుత్వీకులు సత్యబాబుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో ప్రాతఃకాల హోమాలు, 101 బిందెలతో జలాభిషేకం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

యువకుడు ఆత్మహత్య

పీసీపల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మురుగుమ్మిలో సోమవారం రాత్రి జరిగింది. తెలిసిన వివరాల మేరకు.. మాలపాటి ప్రదీప్(27) కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎప్పటిలాగే సోమవారం పనికి వెళ్లిన ప్రదీప్ రాత్రికి ఇంటికి వచ్చి నిద్రించేందుకు గదిలోకి వెళ్లాడు. తెల్లవారేసరికి ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు .కుటుంబసభ్యులు ఉరికి వేలాడుతున్న ప్రదీప్‌ను కిందకి దించగా అప్పటికే అతడు మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

తాళ్లూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుగంగవరంలో మంగళవారం పాలవాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. గ్రామంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో అల్లూరి అంకయ్య, పోలమ్మ దంపతులు పనిచేస్తూ జీవిస్తున్నారు. మంగళవారం ఉదయం అంకయ్య దర్శి వెళ్లే మార్గంలో పెట్రోలు బంక్ సమీపాన కాగితాలు, పాత ఇనుము సామాన్లు ఏరుకుంటున్నాడు. సమీపంలో నిలిపి ఉన్న పాలవాహనం డ్రైవర్ గమనించక వెనుకకు తిప్పడంతో అంకయ్యకు తగిలి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని గ్రామస్థులు ఒంగోలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఏఎస్ఐ మోహన్‌రావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇస్కాన్ బృందానికి ఘనస్వాగతం

దర్శి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో సాగుతోన్న సంపూర్ణ భారత్ పాద యాత్రలో భాగంగా మంగళవారం రాత్రి ఆ బృంద సభ్యులు దర్శికి చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్ఎస్ఎస్, హిందూ పరిషత్ నాయకులు, కార్యకర్తలు వారికి ఘనంగా స్వాగతం పలికారు. బృంద సభ్యులు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు ద్వారక నుంచి పాదయాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం శ్రీకృష్ణుడు, శ్రీరాముడిపై పాడిన భక్తిపాటలు, భజనలు మంత్రముగ్ధులను చేశాయి.

విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలి

దొనకొండ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): యాంటీ ర్యాగింగ్ డే సందర్భంగా ఆంధ్ర కేసరి యూనివర్శిటీ నోడల్ ఆఫీసర్ ఏ.భారతీదేవి ఆదేశాల మేరకు దొనకొండ గౌతమీ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ ఎఫ్రాయిమ్(నాని) యాంటీ ర్యాగింగ్‌పై మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలని అన్నారు.

‘అమృత్’ మళ్లీ మొదటికి..

- టెండర్లు రద్దు
- తాజా ధరలతో అంచనాలు తయారుచేస్తున్న అధికారులు


దర్శి పట్టణ వ్యూ

దర్శి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): దర్శి మున్సిపాలిటీలోని ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించే అవకాశం రోజురోజుకు వెనక్కుపోతుంది. అమృత్ పథకం అమల్లోకి వస్తే ప్రతి ఇంటికి కొళాయి ఏర్పాటుచేసి స్వచ్ఛమైన మంచినీరు అందించే అవకాశం కల్గిఉండేది. గత మూడేళ్లుగా ఈపథకం అమలుకు నోచుకోలేదు. ఇప్పటికి రెండుసార్లు అధికారులు టెండర్లు పిలిచినప్పటికీ పలు కారణాలతో అవి రద్దు అయ్యాయి. తాజాగా గత జూలై నెలలో పిలిచిన టెండర్లు కూడా రద్దయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకానికి ఒకేసారి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు పాత టెండర్లు రద్దు చేశారు.

దర్శి మున్సిపాలిటీకి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమృత్ పథకం కింద రూ.130.60 కోట్లు నిధులు విడుదలయ్యాయి ఆ ప్రభుత్వ హయాంలో టెండర్లు పిలిచినప్పటికీ పనులు ప్రారంభించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల రీజియన్ పరిధిలో టెండర్లు పిలిచారు. షెడ్యూల్ ప్రకారం గత జూలై 30న దాఖలైన టెండర్లు పరిశీలించి ఖరారు చేయాల్సిఉంది. ప్రభుత్వ తాజా ఉత్తర్వుల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్నీ టెండర్లు రద్దు చేయటంతో అమృత్ పథకం అమలు మళ్లీ మొదటికి వచ్చింది.

ఈవిషయమై మున్సిపల్ ఈఈ శ్రీనివాస సంజయ్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా గత నెలలో పిలిచిన టెండర్లు రద్దు చేయటం జరిగిందన్నారు. ధరలు పెరిగినందున తాజా అంచనాలు తయారు చేసి మళ్లీ టెండర్లు పిలవాలని ప్రభుత్వం ఆదేశించటంతో అందుకనుగుణంగా అంచనాలు తయారు చేస్తున్నట్లు ఆయన వివరించారు. దర్శి మున్సిపాలిటీకి అమృత్ పథకం అమల్లోకి వస్తే 40వేల మంది ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించే అవకాశం కల్పిస్తుంది. ముండ్లమూరు మండలంలోని పులిపాడు చెరువును సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌గా అభివృద్ధి చేసి సాగర్ జలాలను గ్రావిటీపై చెరువుకు నింపి ఆ నీటిని శుద్ధిచేసి దర్శి పట్టణ ప్రజలకు ఇంటింటికి కొళాయి ఏర్పాటుచేసి అందించాలనే లక్ష్యంతో ఈ పథకం నిర్దేశించారు. దర్శిలో ఏర్పాటుచేసే అమృత్ పథకం ద్వారా రోజుకు 13 మిలియన్ లీటర్ల నీరు సరఫరా చేసే సామర్థ్యం కల్గేవిధంగా పథకాన్ని రూపొందించారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని 30 సంవత్సరాల వరకు పెరిగే జనాభాకు ప్రస్తుతం ఈ పథకం ద్వారా సరఫరా చేసే నీరు సరిపోయే విధంగా ఆసామర్థ్యం మేరకు పథకాన్ని నిర్మిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే నిధులు విడుదలై మూడు సంవత్సరాలు అయినప్పటికీ పథకం అమల్లోకి రాకపోవటంతో పట్టణ ప్రజలు అసంతృప్తి వ్యక్త చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వడివడిగా అందుకు సంబంధించిన పనులు ప్రారంభించినప్పటికీ అనుకోని విధంగా పాత టెండర్లు రద్దు అయ్యాయి. ఇప్పటికైనా ప్రజల మనోభావాలను గుర్తించి ఈ పథకం త్వరలో నిర్మించి అమల్లోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

దర్శిలో భారీ వర్షం

- రోడ్లపైకి చేరిన నీరు
- ఇబ్బందులు పడిన ప్రజలు
- ఉధృతంగా ప్రవహించిన కాటేరు వాగు


దర్శి సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కాటేరు వాగు


దర్శి బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

దర్శి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): దర్శిలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దర్శి పట్టణంలో రోడ్లపైకి నీరు చేరింది. మురికి కాల్వలు సక్రమంగా లేక డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో వర్షం కురిసిన ప్రతిసారీ నీరు రోడ్లపైకి చేరుతుంది. ఎన్నో సంవత్సరాలుగా దర్శి-పొదిలి రోడ్డు, దర్శి-కురిచేడు రోడ్డు, దర్శి-అద్దంకి రోడ్లల్లో మురికికాల్వలు సక్రమంగా లేవు. కొన్నిచోట్ల దుఖాణాల యజమానులు మురికి కాల్వలను కూడా షాపుల్లో కలుపుకున్నారు. మరికొన్ని చోట్ల రోడ్లకంటే రెండు అడుగులు ఎత్తుగా మురికి కాల్వలు నిర్మించారు. అక్కడ కూడా దుఖాణాల యజమానులు మురికికాల్వలను రాళ్లతో మూసేశారు. దీంతో వర్షం పడినప్పుడు రోడ్లపైన చేరిన నీరు కాల్వ ల్లోకి వెళ్లే వీలులేక రోడ్లపైనే ఉంటుంది. వర్షం నీరుతో కలిసి కాల్వల్లో నీరు కూడా రోడ్లపైకి చేరుతుంది. దీంతో పట్టణంలో ప్రధాన కూడళ్లల్లో వర్షం పడిన ప్రతిసారి ప్రజలు, వాహనాచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి నీరునిల్వ ఉండటంతో నడిచి వెళ్లేవీలులేక పడరానిపాట్లు పడుతున్నారు.

దర్శి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడలేదు. ఎప్పుడో అస్తవ్యస్తంగా నిర్మించిన మురికికాల్వలు అలాగే ఉండటంతో మురుగు నీరు ముందుకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దర్శి-పొదిలి రోడ్డులో కొంతమంది షాపింగ్ కాంప్లెక్స్ యజమానులు తారు రోడ్డును కొంతమేరకు ఆక్రమించి రోడ్డుకంటే ఎత్తుగా మట్టి తోలారు. దీంతో అక్కడ రోడ్డు పైనే నీరు కుంటలా నిల్వ చేరటంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఎంతో కాలంగా రోడ్డును ఆక్రమించి మట్టిపోసినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు.

ఈవర్షంతో ఇటీవల సాగు చేసిన లేత వరినాట్లు పచ్చబడే అవకాశం కల్గింది. గత మూడురోజుల క్రితం సాగర్ కాలువలకు నీటి సరఫరా తగ్గించటంతో మేజర్లకు నీరందక ఇబ్బందులు పడుతున్నారు. లేత వరినాట్లు ఎండి పోతాయని అన్నదాతలు ఆందోళనలు చెందుతున్న సమయంలో ఈ వర్షం ఎంతో మేలు చేసింది.

14న దర్శిలో రైతుల విజయోత్సవ ర్యాలీ

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్రంలోని రైతులందరికీ మొదటి విడత సాయం అందించినందుకు కృతజ్ఞతగా ఈనెల 14న దర్శిలో రైతుల ట్రాక్టర్ల విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. ఈమేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదలచేశారు. ఆరోజు ఉదయం ముండ్లమూరు మండలం పులిపాడు నుంచి దర్శి మార్కెట్ యార్డు వరకు ట్రాక్టర్లతో ర్యాలీ జరుగుతుందని తెలిపారు. ఈ విజయోత్సవ ర్యాలీలో అధికసంఖ్యలో రైతులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

కాగా, పులివెందులలో ప్రజాసామ్యం గెలిచిందని డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు. ప్రశాంతంగా ఓటింగ్ జరగటమే ఇందుకు నిదర్శనమన్నారు. కడప జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు మంగళవారం ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ అరాచకాలకు, దౌర్జన్యాలకు ప్రజలు చరమగీతం పాడి స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవటం సంతోషకరమన్నారు. గత 35 సంవత్సరాలుగా వైఎస్ కుటుంబం రిగ్గింగ్ సంస్కృతితో పులివెందులలో ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పులివెందులలో ప్రప్రథమంగా ప్రజాసామ్య పద్ధతిలో ఎన్నికలు జరగటం ఆనందదాయకమన్నారు. ఎన్నికల సందర్భంగా కడప ఎంపీ అవినాష్‌రెడ్డితో పాటు వైసీపీ నాయకులు అక్రమాలకు పాల్పడే ప్రయత్నం చేసి తమ దిగజారుడుతనాన్ని మరోసారి ప్రదర్శించారని విమర్శించారు.అధికారులు, ఎన్నికల కమిషన్ ఎన్నికలను ప్రజాస్వామ్యంగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

కనిగిరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కనిగిరిలో ఏఐఎస్ఎఫ్ 90వ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ నాయకుడు తాహిద్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికై దేశంలో అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందన్నారు. నూతన విద్యా విధానల పేరుతో విద్యార్థి సంఘాలను పాఠశాలలు, కళాశాలల్లోకి అనుమతించకపోవటం బాధాకరమన్నారు. నూతన విద్యావిధానాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకుడు యాసిన్, ఏఐటీయూసీ నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, జీవీ రామారావు, పి.మోహన్, తదితరులు పాల్గొన్నారు. తొలుత కేకును కట్ చేసి ఒకరికొకరు పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
బుధవారం 13 ఆగస్టు 2025





జెండా వందనం చేస్తున్న మంత్రి మనోహర్

అమరుల త్యాగం అజరామరం

క్విట్ ఇండియా స్ఫూర్తితో సాగుదాం ● రణరంగచౌక్ సభలో మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల త్యాగం అజరామరమని వారి స్ఫూర్తితో ముందుకు నడుద్దామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక రణరంగచౌక్‌లో అమరవీరుల స్మారక స్థూపాల వద్ద సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మనోహర్‌తో పాటు విద్యార్థులు, పట్టణ ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు రణరంగచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్విట్ ఇండియా ఉద్యమంలో అమరులైన స్వాతంత్ర్య సమరయోధులకు పట్టణ ప్రజలు నివాళులర్పించారు. మంత్రి మనోహర్ భరతమాతకు పూలు సమర్పించి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. క్విట్ ఇండియా ఉద్యమంలో బ్రిటీష్ కాల్పులకు ప్రాణత్యాగం చేసిన అమరవీరులు మాజేటి సుబ్బారావు, సిరిగిరి లింగం, భాస్కరుని లక్ష్మీనారాయణ, తమ్మినేని సుబ్బారెడ్డి, (మిగతా 6వ పేజీలో)



ఎన్‌సీసీ క్యాడెట్లతో మంత్రి మనోహర్



క్లాత్ బ్యాగులను చిన్నారులకు అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై సమరం

గుంటూరు నుంచి యుద్ధం ప్రారంభం

ఇక్కడ విజయవంతమైతే 26 జిల్లాలకు విస్తరణ ● రెడ్‌క్రాస్ ప్రచార కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్‌నజీర్

గుంటూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పై సమరం సాగించాలని, ఈ ప్రాజెక్టు విజయవంతం అవడానికి పూర్తి మద్దతును అందిస్తామని గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో 'ఆంధ్రప్రదేశ్ వాతావరణ కార్యచరణ, అమరావతి ప్లాస్టిక్ రహిత నగర ప్రచార కార్యక్రమాన్ని' మంగళవారం గవర్నర్ నజీర్ (మిగతా 6వ పేజీలో)



అధికారులు అప్రమత్తం కావాలి

విపత్తు నిర్వాహణపై సమీక్షలో కలెక్టర్

బాపట్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గురు, శుక్రవారాల్లో భారీవర్షాల హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తం కావాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. విపత్తు నిర్వాహణ, పర్యవేక్షణపై ఆర్డీవోలతో మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. భారీవర్షాలతో జలమయమయ్యే లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. తుఫాన్ వస్తే ఏ ప్రాంతాల వారిని తొలుత సురక్షిత ప్రాంతాలకు తరలించాలో, ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలనే అంశాలపై ప్రణాళిక రూపొందించి సిద్ధం కావాలన్నారు. కృష్ణానది ఎగువ ప్రాంతాలు నుంచి 2.50 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారని, భారీ వర్షాలతో అది 4 లక్షల క్యూసెక్కుల కంటే మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో అధికారులు ముందస్తుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్యాస్‌సిలెండర్లు, వాహనాలు, జనరేటర్లు, ఎక్స్‌కవేటర్లు సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, రివర్ కన్జర్వేటర్ కార్యనిర్వాహక ఇంజనీర్ రవికిరణ్, ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

విద్యార్థులకు కలెక్టర్ సూచన

బాపట్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని కలెక్టర్ జె.వెంకటమురళి విద్యార్థులకు తెలిపారు. స్థానిక అక్బర్‌పేటలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని కలెక్టర్ ప్రారంభించారు. చేతులు పరిశుభ్రంగా కడుక్కోవడంపై, పౌష్టికాహార పదార్థాల వినియోగంపై విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం నులిపురుగుల మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. చేతులు శుభ్రంగా కడుక్కుని భోజనం చేస్తే నులిపురుగులను నివారించగలమని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ రత్నమన్మోహన్, ఆర్‌బీఎస్‌కే పీవో డాక్టర్ లలిత రాజేశ్వరి, డీసీ డాక్టర్ ప్రవీణ్, బీపీఎమ్‌వో డాక్టర్ మనోజ్, డాక్టర్ మౌనిక, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

ఒడిస్సాకు చెందిన కూలీ మృతి

క్వారీలో డ్రిల్లింగ్ చేస్తుండగా ఘటన



ప్రమాదం జరిగిన క్వారీ

కశ్యప్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ నాగరాజు

బల్లికురవ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామ పరిధిలో ననకొండ ప్రాంతంలో ఉన్న వెంకటసాయి స్టోన్ క్రషర్‌కు చెందిన కంకర క్వారీలో మంగళవారం ఒడిస్సా రాష్ట్రం మజీలిపదర్ గ్రామానికి చెందిన సాధురాం కశ్యప్(32) మృతి చెందాడు. రోజు మాదిరిగానే బ్లాస్టింగ్ అనంతరం కొండపై భాగంలో పగుళ్లిచ్చిన రాయిని డ్రిల్లింగ్‌తో కశ్యప్ పడగొడుతున్నాడు. ఈ క్రమంలో డ్రిల్లింగ్ యంత్రం కింద ఉన్న రాయి అచ్చు ఊడి కింద ఉన్న రాళ్లపై అతడు పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇటీవలే కశ్యప్ పనుల కోసం క్వారీకి వచ్చాడని తోటి కూలీలు తెలిపారు. కంకర క్వారీలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవటం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు. ఘటనా స్థలిని సంతమాగులూరు సీఐ వెంకట్రావు, ఎస్ఐ నాగరాజులు పరిశీలించారు. వీఆర్వో మునలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని మార్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



అద్దంకి పట్టణం వ్యూ

ప్రకాశం జిల్లాలోకి అద్దంకి?

నేటి మంత్రి వర్గ ఉపసంఘంలో నిర్ణయం

అద్దంకి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అద్దంకి నియోజకవర్గం ప్రకాశం జిల్లాలోకి మారుతుందని.. అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అవుతుందని అద్దంకి ప్రాంతవాసులు ఆశిస్తున్నారు. ఈ మేరకు కొత్త జిల్లాల ఏర్పాటు, చేర్పులు, మార్పులపై బుధవారం జరిగే మంత్రి వర్గ ఉపసంఘం సమావేశంలో నిర్ణయం వెలువడే అవకాశం ఉందని అద్దంకివాసులు ఎదురు చూస్తున్నారు. ప్రధానంగా మార్కాపురం కేంద్రంగా ఐదు నియోజకవర్గాలతో కొత్త జిల్లా ఏర్పాటు ఖాయంగా కనిపిస్తుంది. ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు, కూటమి నేతలు పలు సందర్భాలలో మార్కాపురం జిల్లా ఏర్పాటుపై హామీ కూడా ఇచ్చారని ఆ ప్రాంతప్రజలు గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం బాపట్ల జిల్లాలో ఉన్న అద్దంకి, నెల్లూరు జిల్లాలోని కందుకూరు నియోజకవర్గాలు ఆయా జిల్లా కేంద్రాలకు దూరంగా ఉన్నాయి. ఈ క్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పలు మార్పులకు అవకాశం ఉంది. అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు అద్దంకి ప్రాంత ప్రజలు చాలాకాలంగా ఎదురు చూస్తున్నారు. అద్దంకి రాజధానిగా రెడ్డిరాజులు పాలన సాగించారు. చారిత్రక గుర్తింపు ఉన్న అద్దంకి సుదీర్ఘ కాలం తాలూకా కేం ద్రంగా కూడా ఉంది. ఇప్పటికే గ్రానైట్ పరిశ్రమతో అద్దంకి నియోజకవర్గం అభివృద్ధి చెందింది. పలు పరిశ్రమలు ఏర్పాటుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అద్దంకిని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసేందుకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే రెవెన్యూ డివిజన్ ఏర్పాటు జరిగితే అద్దంకి నియోజకవర్గంలోని మండలాల వరకే పరిమితం చేస్తారా లేక సమీపంలోని కొన్ని మండలాలను కూడా కలుపుతారా అన్న విషయంపై ప్రజల్లో చర్చ జరుగుతుంది. దర్శి నియోజకవర్గంలోని తాళ్ళూరు, ముండ్లమూరు మండలాలు ప్రస్తుతం ఒంగోలు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్నాయి. జిల్లాల పునర్విభజన సమయంలో ఆయా మండలాలను మార్కాపురం జిల్లా పరిధిలో కలుపుతారా, లేక ఒంగోలు కేంద్రంగా ఉండే ప్రకాశం జిల్లాలో ఉంచుతారా అన్న దానిపై విస్తృతంగా చర్చ జరుగుతుంది. ఈ రెండు మండలాలు మార్కాపురానికి దూరం ఉండటంతో రెండు మండలాల ప్రజలు ఒంగోలు కేంద్రంగా ఉండే ప్రకాశం జిల్లాలో ఉండేందుకు ఇష్టపడుతున్నారు. తాళ్ళూరు, ముండ్లమూరు మండలాలు ఒంగోలు జిల్లాలో ఉంచితే అద్దంకి కేంద్రంగా ఏర్పడే రెవెన్యూ డివిజన్‌లో కలిపేందుకు అవకాశం ఉంటుందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది.

మాఫియా.. మంత్రగాడు

● అమలాపురంలో రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని అధికారులు పట్టుకున్నారు. దానిపై ఆరా తీస్తే మూలాలు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్నట్లు వెల్లడైంది.

● మిర్యాలగూడ సమీపంలో తెలంగాణ వెళుతున్న వాహనాలను అధికారులు పట్టుకున్నారు. వాటి మూలాలు గుంటూరు జిల్లాలోనే తేలాయి.





(ఆంధ్రజ్యోతి గుంటూరు)

◆ రేషన్ బియ్యం రీసైక్లింగ్.. రవాణా అతడి కనుసన్నల్లో..
◆ మూడు జిల్లాల్లో అక్రమాలు
◆ రాష్ట్రంలో ఎక్కడ బియ్యం దొరికినా ఉమ్మడి గుంటూరులోనే మూలాలు

..ఇలా ఎక్కడ రేషన్ వాహనాలు దొరికినా వాటి మూలాలు గుంటూరులోనే తేలుతున్నాయి. అంతలా రేషన్ మాఫియా విస్తరించింది. రాష్ట్రంలో, దేశంలో ఏ మూల రేషన్ బియ్యం వాహనాలు దొరికినా కేరాఫ్ అడ్రస్ గుంటూరు అనేంతగా మాఫియా మంత్రగాడు చెలరేగిపోతున్నాడు. మాఫియా మంత్రగాడు ఉమ్మడి గుంటూరు జిల్లా మొత్తం మీద పట్టు సాధించాడు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సేకరించే బియ్యం మొత్తానికి ఏకైక దిక్కు సదరు మంత్రగాడే. కిలో రూ.21 కొనుగోలు చేసి, రీ సైక్లింగ్ చేసి రూ.26 నుంచి 30 వరకూ సొమ్ము చేసుకుంటున్నాడు. పేదల బియ్యం సరిహద్దులు దాటించే బాధ్యత వారిదే. వారి దయా దాక్షిణ్యాలుంటేనే మాఫియా శిబిరంలో మనుగడ ఉంటుంది. మాఫియా మొత్తాన్ని తన కనుసైగలతో శాశిస్తున్నాడు. అతడు దయతలిస్తేనే మాఫియా శిబిరంలో ఎవరైనా మనగలుగుతారు.. కాదంటే కనీసం అడ్రస్ కూడా లేకుండా పోతారు. అంత పకడ్బందీగా మాఫియా మంత్రగాడు వ్యవస్థను తన అదుపులో పెట్టుకున్నాడు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా కొన్ని వందల టన్నులు పేదల బియ్యాన్ని రాష్ట్ర, దేశ సరిహద్దులు దాటి తరలిస్తున్నాడు.

డాన్ దయాదాక్షిణ్యాలతోనే మనుగడ

ఉమ్మడి గుంటూరు జిల్లాలో రేషన్ మాఫియా పటిష్ఠమైన చక్రబంధాన్ని ఏర్పాటు చేసుకుంది. రేషన్ మాఫియా, రైస్ మిల్లర్లు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఏర్పాటైన ఈ సిండికేట్ అత్యంత పకడ్బందీగా వ్యవహారాన్ని నడిపిస్తోంది. క్షేత్రస్థాయిలో రేషన్ బియ్యాన్ని సేకరించడం మాఫియా డాన్ అతడి అనుచరగణం పని. ఆ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి పక్క రాష్ట్రాలు, ఇతర దేశాలకు తరలించడం సదరు మంత్రగాడి పని. వాటిని (మిగతా 6వ పేజీలో)

నగరంలో తగ్గని విష జ్వరాలు

● ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 12 మంది
● పారిశుధ్యం అధ్వానం.. పట్టించుకోని అధికారులు

రేపల్లె, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలోని నగరంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఒక పక్క పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తున్నామంటూ అధికారులు ప్రకటనలు చేస్తున్నారే తప్ప ఆచరణలో అది అమలు కావడంలేదు. నగరంలో ఎక్కడికక్కడ మురుగు నీరు స్తంభించి అపరిశుభ్రత తాండవిస్తోంది. ఆయా ప్రాంతాలు దోమలకు నిలయాలుగా మారాయి. దీనికితోడు రోడ్లవెంబడి చెత్తాచెదారాలతో పారిశుధ్యం అధ్వానంగా మారి ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. ఇప్పటికే నగరం ప్రభుత్వ వైద్యశాలలో 12 మంది జ్వరంతో చికిత్స పొందుతున్నారు. వారిలో ఆరుగురికి ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో కుటుంబసభ్యులు భయాందోళన చెందుతున్నారు. ఆస్పత్రిలో సరైన సౌకర్యాలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో కొంతమేర ఇబ్బంది నెలకొంది. ఉన్నతాధికారులు దృష్టిసారించి జ్వరబాధితులకు మెరుగైన వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించాలని గ్రామస్థులు ఆశిస్తున్నారు.



వైద్యశాలలో చికిత్స పొందుతున్న జ్వరబాధితులు

యాజలిలో ఒకరికి డెంగీ లక్షణాలు

ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స... పరామర్శించిన అధికారులు

కర్లపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాజలి గ్రామానికి చెందిన గురవయ్య కొన్ని రోజులుగా జ్వరంతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో అతడ్ని కుటుంబసభ్యులు కర్లపాలెంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. వైద్యులు పరీక్షించి డెంగీ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయం తెలిసి మంగళ వారం తహసీల్దార్ షాకీర్‌పాషా, ఎంపీడీవో ఐనంపూడి శ్రీనివాసరావు, డాక్టర్ గోపీనాథ్ ఆస్పత్రికి వెళ్లి గురవయ్యను పరామర్శిం చారు. గురవయ్యకు నిర్వహించిన రక్తపరీక్షలలో ఎన్ఎస్ 1 పాజిటివ్ నిర్ధారణ అయినట్లు డాక్టర్ గోపినాథ్ తెలిపారు. యాజలిలోని గురవయ్య ఇంటి పరిసరాలను పంచాయతీ సిబ్బంది పరిశుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లారు.

ఖజానాలో.. కాసుల గోల

● ఉద్యోగులు మారినా మళ్లీ అదే తీరు
● పింఛన్, ఉద్యోగుల బిల్లులకు తిరకాసులు
● గతంలో ఏడుగురిపై వేటు.. ఆగని వేధింపులు



చీరాల ఉప ఖజానా కార్యాలయం

చీరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తోటి ఉద్యోగులు అయినా లంచాల కోసం డిమాండ్లు.. అడిగినంత ఇవ్వని వారికి వేధింపులు.. ఇదీ చీరాల ఉప ఖజానా కార్యాలయంలో ఉద్యోగుల తీరు. ఉద్యోగుల వేధింపులపై అధికారులు విచారణ జరిపి ఏడాది క్రితం ఏడుగురిపై చర్యలు తీసుకున్నారు. అయితే వారి స్థానంలో కొత్తగా ఉద్యోగులు వచ్చారే కానీ వారు కూడా గతంలోని వారిలాగే వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యోగులు మారారే గానీ వారి తీరు మారలేదని పలువురు వాపోతున్నారు. వివిధ బిల్లుల కోసం వచ్చే ఉద్యోగులను, పింఛన్‌దారులను గతంలో మాదిరిగానే పీడిస్తున్నారు. కార్యాలయం పరిధిలో సుమారు 8 నుంచి 9 వేల వరకు ఉద్యోగులు, పింఛన్ దారులు ఉన్నారు. వారికి సంబంధించిన జీతాల బిల్లులు, గుత్తేదారుల బిల్లులు ఎరియర్స్ బిల్లులు పెండింగ్ పడుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ప్రతీనెలా జీతాలు, పింఛన్లు, టీఏ, డీఏ బిల్లులు, ఇతర కాంట్రాక్టు పనుల బిల్లులకు సంబంధించిన కార్యకలాపాలు ఇక్కడి సిబ్బంది ఆమోదించాలి. ఆయా వ్యవహారాల ప్రక్రియలో కొందరు ఉద్యోగులు బాహాటంగానే లంచం డిమాండ్ చేస్తూ సేవలు పెండింగ్ పెడుతున్నారు. కార్యాలయంలో ఇంత జరుగుతున్నా అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటి వరకు ట్రెజరీలో ఎన్ని బిల్లులు పెండింగ్ ఉన్నాయి? ఎందుకు ఉన్నాయి? ఎవరెవరి లాగిన్‌లో ఉన్నాయి వంటి అంశాలపై అధికారులు పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

లారీ బోల్తా

తప్పిన ప్రమాదం

చీరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కలకత్తా నుంచి చెన్నై వెళుతున్న ఎలక్ట్రికల్ లోడుతో వెళ్తున్న ఓ లారీ చీరాల - వేటపాలెం మధ్య మన్నం అపార్ట్‌మెంట్ సమీపంలో బోల్తా పడింది. ఈ ఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. బోల్తా కొట్టి సైడు కాలువలోకి దూసుకుపోయిన లారీలోపల నుంచి డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఆ సమయంలో ఎటువంటి వాహనాల రాకపోకలు లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

విద్యుత్ లైన్ ఆధునికీకరణకు వినతి

చీరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పందిళ్లపల్లి పంచాయతీ గౌడ పాలెంలో విద్యుత్ ఆధునికీకరణ చేపట్టాలని గ్రామస్థులు కోరారు. ఈక్రమంలో మంగళవారం టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ప్రస్తుతం సింగిల్ ఫేజ్ కావడంతో లో ఓల్టేజ్ సమస్యలు ఉన్నట్లు చెప్పారు. త్రీ ఫేజ్ లైన్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోటేశ్వరరావు, అంజనేయులు, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, నరేంద్ర, సత్యనారాయణ కోరడంతో దీనిపై మహేంద్రనాథ్ సానుకూలంగా స్పందించారు.

14న విద్యోన్నతి ఫౌండేషన్ ఉపకార వేతనాల పంపిణీ

పంగులూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : ధూళిపాళ్ల వెంకటేశ్వర్లు, బోడెంపూడి రామమూర్తి స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపకార వేతన పంపిణీ కార్యక్రమం ఈ నెల 14వ తేదీన పంగులూరు ఉన్నత పాఠశాలలో జరుగుతుందని విద్యోన్నతి ఫౌండేషన్ డైరెక్టర్ ధూళిపాళ్ల వీరనారాయణ తెలిపారు. ఇంకొల్లు, పంగులూరు, అద్దంకి మండలాల పరిధిలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించే పోటీపరీక్షలో ఎంపికైన 15 మందికి(మండలానికి ఐదుగురు చొప్పున) ఇంటర్ విద్య కొనసాగింపునకు ఒక్కొక్కరికి 10 వేల నగదుసాయం అందచేయనున్నట్లు తెలిపారు. జూనియర్, సీనియర్ ఇంటర్ చదివే 30 మంది యోగ్యత కలిగిన విద్యార్థులకు రూ.3 లక్షల నగదును గురువారం పంగులూరులో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతులమీదుగా అందజేయనున్నట్లు తెలిపారు.

ఎరువులపై రైతులకు అవగాహన అవసరం

యద్దనపూడి/మార్టూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలంలోని తనుబొద్దివారిపాలెం, మున్నంగి వారిపాలెల్లో మంగళవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సహకారంతో రైతులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. పర్చూరు ఏడీఏ ప్రవీణ మాట్లాడుతూ పప్పుధాన్యల పంటలలో ఎరువులు వినియోగం, వాటి సస్యరక్షణ పద్ధతులను రైతులకు వివరించారు. వ్యవసాయ అధికారి కుమారి మాట్లాడుతూ మొక్కజొన్న పంట సాగులో మెళకువలను రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ఏటీఎం హారిక, వీఏఏ సుదర్శన్, సర్పంచ్ అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

రెండు స్కూళ్లకు ఉత్తమ అవార్డులు

ఒంగోలు విద్య, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రెండు స్కూళ్లు రాష్ట్ర స్థాయి ఉత్తమ పాఠశాలల అవార్డుకు ఎంపికయ్యాయి. ఈనెల 15న స్వాతంత్ర్య వేడుకల్లో ఈ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అవార్డులను ప్రదానం చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అలాంటి స్కూళ్లు పది ఉండగా అందులో రెండు మన జిల్లా నుంచే కావడం గర్వకారణం. 2024-25 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభను కనబర్చినందుకు నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కొండపి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలకు ఈ అవార్డులు దక్కాయి. వీటిలో విద్యార్థినులు పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు సగటు మార్కులు కూడా అధికంగానే ఉన్నాయి. అమ్మనబ్రోలు పాఠశాల హెచ్ఎం కె.మాధవి, కొండపి పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.అరుణ సీఎం చేతుల మీదుగా ఈ అవార్డులు అందుకోనున్నారు.

ఫేక్ మస్టర్లపై విచారణ

సంతమాగులూరు ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిపాలెంలో ఉపాధి హామీ పనులలో జరిగిన ఫేక్ మస్టర్లపై డ్వామ ఏపీడీ కోటా నాయక్ విచారణ చేపట్టారు. మంగళవారం గ్రామంలోని సచివాలయంలో పనుల వివరాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దిండు హనుమంతరావు, డీసీ చైర్మన్ కామను శ్రీనివాసరావు, వెల్లల చెరువు సొసైటీ అధ్యక్షుడు బెల్లంకొండ ఏడుకొండలు, ఏపీవో బాలకృష్ణ నాయక్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్ నాయక్ పాల్గొన్నారు.అనంతరం ఎటువంటి అవకతవకలు జరగలేదని ఫీల్డ్ అసిస్టెంట్ రాజా ఏపీడీకి వినతి పత్రం అందజేశారు.

అన్నదాతల సంబరాలు

సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ జిల్లాలో ర్యాలీలు

ప్రత్యేక ఆకర్షణగా ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు

భారీగా పాల్గొంటున్న రైతులు, టీడీపీ శ్రేణులు

ఇప్పటికే మూడు నియోజకవర్గాల్లో పూర్తి



కనిగిరిలో ట్రాక్టర్లతో ర్యాలీనిర్వహిస్తున్న రైతులు

ఒంగోలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతుల కోసం కూటమి పార్టీల తరపున టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.6వేలను మూడు విడతలుగా పీఎం కిసాన్ పథకం కింద ఇస్తుండగా.. గత వైసీపీ ప్రభుత్వం దానికి రూ.7500 కలిపి రూ.13,500 రైతు భరోసా పేరుతో ఇచ్చింది. కాగా అన్నదాత సుఖీభవ పథకం పేరుతో కేంద్ర ప్రభుత్వంతో అనుసంధానం చేసి వారిచ్చే రూ.6వేలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.14వేలు కలిపి ఏకంగా రూ.20వేల నగదును అందజేయాలని ప్రజాప్రభుత్వం నిర్ణయించి అమల్లోకి తెచ్చింది. తొలివిడత రాష్ట్రంలో సుమారు 47 లక్షల మంది రైతులకు ఒక్కొక్కరికి కేంద్రం వాటా రూ.2వేలు, రాష్ట్రం వాటా రూ. 5వేలు కలిపి రూ.7వేల నగదు అందజేశారు. జిల్లాలోని దర్శి నియోజకవర్గం తూర్పువీరాయపాలెం గ్రామం నుంచే ఈ పథకానికి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారు. జిల్లాలో అన్నదాత సుఖీభవ కింద సుమారు 2.68 లక్షల మంది రైతు కుటుంబాలకు తొలివిడత రూ.186కోట్లు అందాయి. ఈ మొత్తం వారి బ్యాంకు ఖాతాల్లో జమ

రైతులకు సాగులో ఆర్థిక తోడ్పాటు కోసం అన్నదాత సుఖీభవ నగదు జమ చేయడంతో రైతులు, తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేసుకుంటున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ జిల్లావ్యాప్తంగా భారీ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కొండపి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా చేశారు. మంగళవారం కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లో చేపట్టిన ర్యాలీలు కోలాహలంగా సాగాయి. పెద్దఎత్తున రైతులు ట్రాక్టర్‌లతో తరలి వచ్చి పాల్గొన్నారు. బుధవారం సంతనూతలపాడుకు సంబంధించిన కార్యక్రమం పల్లామల్లిలో ఏర్పాటు చేశారు. మిగిలిన చోట్ల కూడా ర్యాలీల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు.

య్యాయి. దర్శి నియోజకవర్గంలో అత్యధికంగా 42,971 మందికి రూ.29.07 కోట్లు అందాయి. కొండపి, కనిగిరి, ఎర్రగొండపాలెం నియోజకవర్గాలకు రూ. 25 కోట్ల నుంచి రూ.29 కోట్ల వరకు, ఇతర నియోజకవర్గాలకు తగుస్థాయిలో ఆర్థిక సహాయం అందింది. సాగువేళ అంత పెద్దమొత్తంలో అందిన నగదు రైతులకు ఉపకరించనుంది. ఈనేపథ్యంలో అన్నదాత సుఖీభవ పేరుతో తమకు ఆర్థిక సహకారం అందించిన సీఎం సుఖంగా ఉండాలని కోరుకుంటూ రైతులు, టీడీపీ శ్రేణులు కృతజ్ఞత ర్యాలీలు నిర్వహిస్తున్నారు.

కనిగిరి, గిద్దలూరులో కోలాహలంగా ర్యాలీలు

రెండు రోజుల క్రితం మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండపి నియోజకవర్గంలోని జరుగుమల్లి మండలం కామేపల్లి నుంచి చిర్రికూరపాడు వరకు ర్యాలీ నిర్వహించారు. మంత్రి డాక్టర్ స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వందలాదిగా రైతులు, టీడీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో ట్రాక్టర్లతో పాల్గొన్నారు. మంగళవారం కనిగిరిలో అక్కడి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరులో స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి నేతృత్వంలో భారీ ర్యాలీలు జరిగాయి. పెద్దసంఖ్యలో రైతులు, టీడీపీ శ్రేణులు ట్రాక్టర్లతో తరలివచ్చారు. కోలాహలంగా కార్యక్రమం జరిగింది. అలాగే ఇతర నియోజకవర్గాల్లోనూ ర్యాలీల నిర్వహణకు స్థానిక టీడీపీ నేతలు సన్నాహాలు చేస్తున్నారు.

నేడు పల్లామల్లిలో నిర్వహణ

సంతనూతలపాడు నియోజకవర్గ ర్యాలీ బుధవారం సాయంత్రం చీమకుర్తి మండలం పల్లామల్లిలో నిర్వహించనున్నారు. చీమకుర్తితోపాటు మద్దిపాడు, ఎన్‌జీపాడు మండలాలకు కూడలిగా ఆ గ్రామం ఉండటంతో అక్కడ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పాల్గొననున్నారు. అలాగే మార్కాపురం, దర్శి, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల ర్యాలీలను ఈనెల 14న నిర్వహించేందుకు అక్కడి టీడీపీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు సన్నాహాలు చేస్తున్నారు.

కురిసింది వాన..



ఒంగోలులోని ఆర్టీసీ డిపో ఎదురు కర్నూలురోడ్డులో వర్షపు నీరు

తూర్పున భారీ వర్షం

ఒంగోలు జలమయం

చెరువులను తలపించిన రోడ్లు

జిల్లా అంతటా చల్లబడిన వాతావరణం

ఒంగోలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని తూర్పుప్రాంతంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఒంగోలు, కొత్తపట్నం, మద్ది పాడు, ఎన్‌జీపాడు, సంతనూతలపాడు తదితర మండలాల్లో దాదాపు రెండు గంటలపాటు తెరపి లేకుండా పడింది. ఒంగోలు నగరం జలమయమైంది. రోడ్లు చెరువులను తలపించాయి. దాదాపు నెలన్నర రోజులుగా జిల్లాలో సరైన వర్షం లేక పూర్తి బెట్టవాతావరణం, వేసవిని తలపించేలా ఎండలు కాచాయి. రెండు రోజుల నుంచి వాతావరణంలో మార్పు వచ్చింది. ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం చల్లబడటంతోపాటు అక్కడక్కడా జల్లులు కూడా పడ్డాయి. గత రాత్రి పశ్చిమ ప్రాంతంలోని కొన్ని మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. మంళవారం సాయంత్రం తూర్పుప్రాంతంలో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం మూడు గంటల నుంచే ఈ ప్రాంతంలో వాతావరణంలో మార్పు వచ్చింది. సాయంత్రం నాలుగు గంటల నుంచి జల్లులు ప్రారంభమయ్యాయి. నాలుగున్నర నుంచి ఆరున్నర వరకు ఒంగోలు నగరంతోపాటు పరిసన ప్రాంత మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఈ సమయంలో మద్దిపాడులో ఏకంగా 90 మి.మీ వర్షపాతం నమోదైంది. అక్కడ ప్రధాన వీధులపై వర్షపు నీరు పారుతూ జనం అవస్థ పడ్డారు. అలాగే కొత్తపట్నంలో 69.75మి.మీ, ఒంగోలులో 48.25,. ఎన్‌జీపాడు మండలం వినోదరాయునిపాలెంలో 42.50, సంతనూతలపాడులో 25.75 మి.మీ కురిసింది. దర్శి, కురిచేడు, చీమకుర్తి, సింగరాయకొండ, పొదిలి, టంగుటూరు, జరుగుమల్లి తదితర ప్రాంతాల్లో జల్లులు పడ్డాయి. సాయంత్రం వేళ అది కూడా దాదాపు రెండు, మూడు గంటలపాటు తెరపిలేకుండా వర్షం కురవడంతో ఒంగోలు నగర ప్రజానీకం తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. భారీ వర్షంతో నీరంతా రోడ్లపైకి వచ్చి చెరువులు, కాలువలను తలపించే రీతిలో పారడంతో ప్రధాన రోడ్లలో వాహనాలపై వెళ్ళేవారు అవస్థలు పడాల్సి వచ్చింది. చిరు వ్యాపారులు,వీధి వ్యాపారులతో పాటు సాయంత్రం పనులు ముగించుకొని ఇళ్ళకు వెళ్ళే ఉద్యోగులు, కాలేజీ విద్యార్థులు ఇతరత్రా కూడా వర్షంతో ఇక్కట్లు పడ్డారు. ఇదిలా ఉండగా ఒక వైపు రుతుపవనాల ప్రభావం మరో వైపు బంగాళాఖాతంలోఅల్పపీడన ప్రభావంతో వాతావరణంలో ఈమార్పు కపిస్తుండగా మరో మూడు నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సమాచారాన్ని బట్టి తెలుస్తున్నది.

ఒడా చైర్మన్‌గా రియాజ్

జనసేనకు దక్కిన కీలక పదవి

తొలుత లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పదవి

కోర్టు సమస్య ఎదురవడంతో మార్పు

ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్ కీలకపాత్ర



రియాజ్

ఒంగోలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయిలో కీలకమైన ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ (ఒడా) చైర్మన్ పదవి జనసేనకు దక్కింది. ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్‌ను ఆ సంస్థకు చైర్మన్‌గా నియమించారు. ఈ విషయంలో తొలుత టీడీపీ అధిష్ఠానం విముఖత వ్యక్తంచేసినా తనకు ఎన్నికల్లో సంపూర్ణ సహకారం అందించినందుకు రియాజ్‌కే ఆ పదవి ఇవ్వాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పట్టుపట్టడం కూడా రియాజ్‌కు కలిసి వచ్చింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీ ప్రారంభించినప్పటి నుంచి జిల్లాలో రియాజ్ ఆయన వెన్నంటి ఉన్నారు. ఆ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయన 2019 ఎన్నికల్లో జనసేన తరపున ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఒంగోలు నగరానికి చెందిన రియాజ్ గత వైసీపీ ప్రభుత్వంలో అరాచకాలకు వ్యతిరేకంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. గత ఎన్నికలకు ముందు రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడిన అనంతరం జిల్లాలో టీడీపీ నాయకులతో రియాజ్ సమన్వయంతో ముందుకు సాగారు. ప్రత్యేకంగా కీలక నేత అయిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో అత్యంత సన్నిహితంగా మెలిగారు. ఎన్నికల్లో ఆయన గెలుపునకు కృషి చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నామినేటెడ్ పదవుల జాబితాలో జనసేన నుంచి రియాజ్ పేరు రాష్ట్రస్థాయి పదవికి ముందు వరుసలో ఉంది. అలాగే ఎన్నికల్లో తనకు సంపూర్ణ సహకారం అందించిన ఆయనకు ఒడా చైర్మన్ పదవి ఇప్పించాలని ఎమ్మెల్యే జనార్దన్ ప్రయత్నాలు ప్రారంభించారు. టీడీపీ జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో ఆ ప్రతిపాదన కూడా ఇతర నాయకుల ముందు జనార్దన్ ఉంచారు. ఒడా చైర్మన్ వంటి కీలక పదవి టీడీపీకి చెందిన వారికే ఇవ్వాలన్న భావనలో అధిష్ఠానంలో ఉండటంతో రియాజ్ పేరు రేసు నుంచి పక్కకు తొలగి టీడీపీకి చెందిన దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పేరు ప్రముఖంగా ముందుకు వచ్చింది. దానికి అనుగుణంగానే రాష్ట్ర లైవ్ స్టాక్ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా రియాజ్‌ను గతంలోనే నియమించారు. అయితే ఆ సంస్థకు గత వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన కమిటీ సభ్యులు కోర్టును ఆశ్రయించడంతో రియాజ్ ఆబాధ్యతలు చేపట్టలేకపోయారు. ఈక్రమంలో ఒకవైపు తన పార్టీ (జనసేన) నేతల ద్వారా రియాజ్, మరోవైపు తాను తొలుత చేసిన ప్రతిపాదనకు అనుగుణంగా ఎమ్మెల్యే జనార్దన్ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. చివరకు ఒడా చైర్మన్ పదవి రియాజ్‌కే దక్కింది.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై సమరం

(5వ పేజీ తరువాయి)

ప్రారంభించి ప్రసంగించారు. భవిష్యత్తుతరాలకు పర్యావరణాన్ని రక్షించడానికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలించడానికి ప్రజల్లో అవగాహన కల్పించడంలో యువత కీలకపాత్ర పోషించాలన్నారు. ప్లాస్టిక్‌ను నిర్మూలించడం పరిశుభ్రతకు సంబంధించిన విషయమే కాదని, బాధ్యతాయుతమైన సంస్కృతిని సృష్టించే అంశమన్నారు. పరిశుభ్రత, పచ్చదనంతో పర్యావరణ హిత సింగిల్ యూజ్‌డ్ ప్లాస్టిక్ రహిత రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దేందుకు రెడ్‌క్రాస్ సొసైటీ లక్ష్యంగా ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు.

పైలెట్ ప్రాజెక్టుగా గుంటూరు..

యూత్, జూనియర్ రెడ్‌క్రాస్‌ల ఆధ్వర్యంలో దేశంలోనే మొట్టమొదటి సారి ప్లాస్టిక్ నివారణ ఉద్యమం గుంటూరులో ప్రారంభించడం సంతోషంగా ఉన్నదని తెలిపారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర కోశాధికారి రామచంద్రరాజు నాయకత్వంలో పైలట్ ప్రాజెక్టుగా గుంటూరును ఎన్నుకున్నట్లు గవర్నర్ తెలిపారు. సాంస్కృతికంగా, విద్యాపరంగా ప్రత్యేకమైన స్థానం ఉన్న గుంటూరు నాయకత్వానికి ప్రసిద్ధి చెందినదని చెప్పారు. అందుకే ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంస్థ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై యద్ధాన్ని ఇక్కడి నుంచే ప్రారంభిస్తున్నదని చెప్పారు. ఇక్కడ విజయవంతమైతే కచ్చితంగా అది రాష్ట్రమంతటా విస్తరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గుంటూరు నగరంలో 50 వేల మంది జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థుల ద్వారా వారి కుటుంబ సభ్యులను ప్రేరేపించి, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణకు రెడ్ క్రాస్ కృషి చేస్తుందని తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎస్తేరు రాణి, లౌఖ్యలను గవర్నర్ నజీర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఇద్దరు విద్యార్థినులు సోషల్ సర్వీసు కింద ప్రతీ మూడో శనివారం ప్రజల వద్దకు వెళ్లి సింగిల్ యూజ్ ప్లాసిక్ వల్ల కలిగే అనర్థాలు, ఏపీ వాతావరణ కార్యచరణ గురించి వివరించి రెడ్‌క్రాస్ యాప్‌లో అప్‌లోడింగ్ చేస్తారు. వీరు చేస్తోన్న సర్వీసుని గవర్నర్ ప్రశంసించారు. తొలుత రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీడ్యునాంట్ చిత్రపటానికి గవర్నర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏకే ఫరీదా, గవర్నర్ ఎక్స్ ఆఫిషియో సెక్రటరి డాక్టర్ ఎం హరిజవహర్‌లాల్, రెడ్ క్రాస్ ఏపీ రాష్ట్ర శాఖ చైర్మన్ వైడీ రామారావు, కోశాధికారి పీ రామచంద్రరాజు, గుంటూరు జిల్లా బ్రాంచ్ చైర్మన్ వడ్లమాని రవి తదితరులు పాల్గొన్నారు. గవర్నర్‌కు కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, మహమ్మద్ నసీర్ అహ్మద్, గల్లా మాధవి, నగరపాలక సంస్థ కమిషనరు పులి శ్రీనివాసులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

డీఎస్సీ నియామకాలకు రంగం సిద్ధం

స్కోర్ కార్డుల రూపంలో అభ్యర్థుల మార్కుల వివరాలు

అభ్యంతరాలు తెలిపేందుకు నేడు తుది గడువు

ఒంగోలు విద్య, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మెగా డీఎస్సీ-2025 నియామకాలకు రంగం సిద్ధమైంది. మెగా డీఎస్సీ ఫలితాలను, అభ్యర్థులు సాధించిన మార్కుల వివరాలను స్కోర్ కార్డుల రూపంలో పాఠశాల విద్యాశాఖ సోమవారం రాత్రి విడుదల చేసింది. వీటిని అభ్యర్థులు డీఎస్సీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జిల్లాలో డీఎస్సీకి 629 పోస్టులు ప్రకటించగా 21,559 మంది దరఖాస్తులు చేశారు. వీరికి జూన్ 6నుంచి జూలై 2 వరకు 26 రోజులపాటు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు రెండు సెషన్లలో నిర్వహించారు. పరీక్షకు హాజరైన అందరి అభ్యర్థుల తుది మార్కులను ప్రస్తుతం విడుదల చేశారు. వీటిపై అభ్యంతరాలు తెలియజేసేందుకు బుధవారం వరకు గడువు ఇచ్చారు. అలా వచ్చిన వాటిని పరిశీలించి తుది మెరిట్ జాబితాను ప్రకటించనున్నారు. అనంతరం మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో టీచర్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. జిల్లాలో డీఎస్సీ పోస్టుల భర్తీకి సంబంధించి అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు ప్రతి 50 మందికి ఒక బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఆ ప్రకారం జిల్లాలో 629 మందికి 13 బృందాలను నియమిస్తారు. ప్రతి టీంలో ఒక ఎంఈవో, ఒక హెచ్ఎం, ఒక డిప్యూటీ తహసీల్దార్ (రెవెన్యూ)ను నియమించనున్నారు. ఒక పోస్టుకు ఒక ఖాళీని మాత్రమే చూపించనున్నారు.

పులి దాడిలో గేదె మృతి

భయాందోళనలో అటవీసమీప గ్రామాల ప్రజలు



పెద్దపులి దాడిలో మృతిచెందిన గేదె

గిద్దలూరు టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : వెల్లుపల్లె అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచరిస్తుండడంతో ఆ చుట్టు పక్క గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల కిందట జయరాంపురం గ్రామానికి చెందిన మోడి రంగస్వామికి చెందిన గేదె మేతకు వెళ్లగా పెద్దపులి దాడి చేయడంతో మృతిచెందింది. గేదె కనిపించక పోవడంతో రంగస్వామి గాలిస్తుండగా వెల్లుపల్లె అటవీ ప్రాంత సమీపంలో మృతిచెంది ఉన్నది. ఆనవాళ్లను గుర్తించిన రైతులు గ్రామస్థుల సహకారంతో అటవీశాఖ అధికారులకు తెలియచేయడంతో అధికారులు ఆప్రాంతాన్ని పరిశీలించి పెద్దపులి సంచరిస్తున్నట్లు తెలిపారు. మృతిచెందిన గేదె విలువ రూ.80వేలు అని రంగస్వామి తెలిపాడు. పెద్దపులి సంచారంతో వెల్లుపల్లె, జయరాంపురం, జయరాంపురం తాండా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

జిల్లా మంత్రితోనే జెండా ఆవిష్కరణ

ప్రభుత్వం ఉత్తర్వులు

ఒంగోలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15వ తేదీన ఒంగోలులోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకల్లో జాతీయ జెండాను జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆవిష్కరించనున్నారు. ఆ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. మంత్రులు సొంత జిల్లాల్లో ఆగస్టు 15న జెండా ఆవిష్కరణలు చేయడం అరుదుగా జరుగుతుంది. గతంలో ఏప్రభుత్వం అధికారంలో ఉన్నా ఇన్‌చార్జి మంత్రి జెండాను ఆవిష్కరిస్తుంటారు. అయితే ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ఏడాది (గత ఏడాది) స్వాతంత్ర్య వేడుకల నాటికి ఇన్‌చార్జి మంత్రుల నియామక ప్రక్రియ పూర్తి కాలేదు. దీంతో జిల్లాకు చెందిన మంత్రులే జెండా ఆవిష్కరణలు చేశారు. ఈ ఏడాది కూడా అదేవిధానాన్ని అనుసరించనున్నారు. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ప్రకారం ఈనెల 15న ఒంగోలులోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమంలో డాక్టర్ స్వామి జాతీయ జెండాను ఎగురవేయనున్నారు.

అమరుల త్యాగం అజరామరం

(5వ పేజీ తరువాయి)

గాలి రామకోటయ్య, ప్రయాగ రాఘవయ్య, జాస్తి అప్పయ్యల స్థూపాల వద్ద పూలు సమర్పించి నివాళులర్పించారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్ల గౌరవ వందనం చేయించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాటంలో తెనాలిలో జరిగిన సంఘటన దేశం మొత్తం ఉలికిపాటుకు గురి చేసిందని, ప్రతి ఒక్కరిలో స్ఫూర్తి రగిలించిందన్నారు. సమరయోధులు మనపై పెట్టిన గురుతర బాధ్యతను నెరవేర్చాలన్నారు. కోట్లాది మంది పోరాటం, పోరాట పటిమ, త్యాగ నిరతితో దేశానికి సిద్ధించిన స్వాతంత్ర్యాన్ని కుల, మత బేధాలు విడిచి కాపాడుకోవాలన్నారు. మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ కులమతాల అడ్డుగోడలు నిర్మించుకుని ఎందరో త్యాగాలతో వచ్చిన స్వాతంత్ర్యానికి విలువ లేకుండా చేయవద్దని కోరారు. సమాజ సేవ చేస్తున్న పలువురు పట్టణ ప్రముఖులను ఘనంగా సన్మానించారు. సబ్ కలెక్టర్ సంజన సింహా, మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ లక్ష్మీపతిరావు, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, డీఎస్పీ జనార్ధనరావు, లెఫ్టినెంట్ కల్నల్ ఉదయ్‌కుమార్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మాఫియా మంత్రగాడు..

(5వ పేజీ తరువాయి)

చూసీచూడనట్లు వదిలేయడం అధికార యంత్రాంగం పని. ఏదైనా సమస్య వస్తే వాటిని పరిష్కరించడం ప్రజాప్రతినిధుల పని. పాతగుంటూరు, ప్రత్తిపాడు, సత్తెనపల్లిలో మిల్లులు నడుపుతున్న ఓ మిల్లర్, గుంటూరు ఆర్టీసీ కాలనీలోని మరో మిల్లర్ ఈ వ్యవహారం మొత్తంలో అత్యంత కీలకంగా ఉన్నాడు.

ఆధిపత్య పోరులోనూ చక్రం..


ఇటీవల రేషన్ మాఫియాలో ఆధిపత్య పోరు నెలకొంది. ఎప్పటి నుంచో మాఫియాపై పట్టున్న డాన్‌పై కొంతమంది తిరుగుబాటు చేసి సొంత ముఠా పెట్టుకున్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం కేంద్రంగా బియ్యాన్ని సేకరించారు. దీంతో మంత్రగాడు ఆ ముఠాపై కన్నెర్ర చేశాడు. ఐదారు నెలలుగా బియ్యాన్ని సేకరించిన కొత్త ముఠా బియ్యాన్ని సొమ్ము చేసేవారు లేక అల్లాడిపోయారు. చివరకు వారే తరలించేందుకు సిద్ధమవగా అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చి వారిని పట్టించారు. ఇలా గడిచిన ఐదారు నెలల్లో కొత్తగా పుట్టుకొచ్చిన మరో మాఫియా డాన్ నేత రూ.70 లక్షల మేర నష్టపోయి చేతులెత్తేశాడు. తాజాగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మరొకరు ముందుకొచ్చారు. ఈ వారంలోనే అతడి వాహనాలు అధికారుల చేతిలో పడ్డాయి. దీంతో అతడి పని కూడా అయిపోయింది. ఇలా ఈ మాఫియా డాన్ తిరుగులేని ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నాడు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ సీజన్‌కు సంబంధించి ఎరువుల కొరత లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మంగళవారం సాయంత్రం రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు. సంబంధిత అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రైతులు ఇబ్బందులు పడకుండా సకాలంలో ఎరువులు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలన్నారు. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు మంజూరు చేయాలని, నిర్దేశించిన గడువు లోపు ఈ-క్రాప్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ అంశాలపై వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌తో పాటు ఇంటి పట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ, రీసర్వేతో పాటు కౌలు రైతులకు పంట సాగుదారు హక్కుల కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి రాజముద్రతో వచ్చిన పట్టాదారుపాసుపుస్తకాల పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జేసీ ఆదేశించారు. ఎస్‌డీసీ వరకుమార్, అధికారులు శ్రీనివాసరావు, పద్మశ్రీ, గౌస్‌బాషా పాల్గొన్నారు.

14న శింగరకొండలో విమాన కలశ పునః ప్రతిష్ఠ

ప్రారంభమైన ప్రత్యేక పూజలు



అద్దంకి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం విమాన కలశ పునఃప్రతిష్ఠ ఈ నెల 14వ తేదీ ఉదయం 11-45 గంటలకు జరుగుతుందని చైర్మన్ గుంజి శ్రీనివాసరావు, ఈవో మద్దినేని శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సాయంత్రం అంకురార్పణ పూజలు నిర్వహించారు. బుధవారం విమాన కలశానికి వాస్తు శుద్ధి, అధివాసాలు, హోమాలు, మహాశాంతిహోమం కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. గురువారం కలశ పునఃప్రతిష్ఠ అనంతరం పూర్ణాహుతి జరుగుతుందని వివరించారు. కలశ పునః ప్రతిష్ఠ అద్దంకికి చెందిన కోనేటి అనిల్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు ప్రసన్నాంజనేయ స్వామి హుండీల లెక్కింపు

అద్దంకి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం హుండీల కానుకల లెక్కింపు బుధవారం జరుగుతుందని ఈవో, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు తెలిపారు. అడిగొప్పుల దేవస్థానం ఈవో ఆదిశేషనాయుడు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

శివాలయంలో అన్నదానం

దేవాంగపురి/చీరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని దేవాంగపురి శివాలయంలో బట్టా మోహన్‌రావు, పుష్పవల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సుమారు 100 మందికి అన్నదానం జరిగింది. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ, మహాలక్ష్మి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

అరకొర బస్సులతో ప్రయాణమెట్టా?

పల్లెలకు నడవని పల్లె వెలుగులు

ఈ నెల 15 నుంచి స్త్రీశక్తి పథకం అమలు

గ్రామీణ మహిళలకు ఆటోల ప్రయాణమే దిక్కా!



అద్దంకి ఆర్టీసీ బస్టాండ్

అద్దంకి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్‌లలో ఉచిత ప్రయాణాన్ని ఈ నెల 15వ తేదీ నుంచి అమలు చేయనుంది. ఆ మేరకు ఇప్పటికే జీవో జారీ చేసింది. అందుకు తగ్గట్లు అద్దంకి డిపోలో ఎలాంటి అదనపు బస్సులు కేటాయించలేదు. ఉన్న అరకొర బస్సులతో నెట్టుకురావాల్సిన పరిస్థితి.

ఉన్న బస్‌లు 69

ప్రస్తుతం అద్దంకి డిపోలో మొత్తం 69 బస్సులు ఉండగా అందులో 4 సూపర్ లగ్జరీ బస్సులు కాగా మిగిలినవి పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయి. పల్లెవెలుగు బస్సులలో అత్యధిక శాతం ప్రధాన రూట్లు అయిన నర్సరావుపేట, ఒంగోలు, వినుకొండ, పొదిలి రూట్లలోనే తిరుగుతున్నాయి. గ్రామాలకు నడిచే పల్లె వెలుగు బస్సులు పట్టుమని 10 కూడా లేవు. కొన్ని బస్సులను మాత్ర ం ఆయా గ్రామాల నుంచి విద్యార్థులు పాఠశాలలు, కళాశాలకు వచ్చే విధంగా ఉదయం, సాయంత్రం సమయాలలో మాత్రమే నడుపుతున్నారు. కొన్ని బస్సులు అయితే ఉదయం పూట మాత్రమే నడుపుతున్నారు. సాయంత్రం ఆయా గ్రామాలకు వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించక తప్పని పరిస్థితి.

కొన్ని గ్రామాలకు రాని పల్లె వెలుగు బస్‌లు

అద్దంకి నుంచి వైదన, బల్లికురవ మీదుగా చిలకలూరిపేట బస్సు, అద్దంకి నుంచి తాళ్లూరు, గంగవరం మీదుగా బొద్దికూరపాడు నడిచే బస్సులు ఉదయం సమయంలో మాత్రమే నడుపుతున్నారు. అద్దంకి నియోజకవర్గంలో సుమారు 30కు పైగా గ్రామాలకు అసలు ఆర్టీసీ బస్ సౌకర్యమే లేదు.

అద్దంకి మండలంలోని ప్రధాన గ్రామాలైన ధేనువకొండ, బొమ్మనంపాడు, చినకొత్తపల్లి, మణికేశ్వరం, నాగులపాడు, వెంకటాపురం తదితర గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపటం లేదు. దీంతో అత్యధిక గ్రామాల నుంచి ప్రజలు ఆటోలలోనే ప్రయాణిస్తున్నారు. ఇలా మొక్కుబడిగా బస్సులు నడిపితే ఆయా గ్రామాల నుంచి మహిళలు ఎలా ప్రయాణం చేయాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి అవకాశం ఉన్న మేర అత్యధిక గ్రామాలకు బస్సులు నడిపే విధంగా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల మహిళలు కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, వెలుగు అధికారులు

చినగంజాం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలని టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావులు చెప్పారు. స్థానిక వెలుగు కార్యాలయ ఆవరణలో వెలుగు విభాగం ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యురాళ్లకు మంగళవారం జరిగిన పెరటి కోళ్ల పంపిణీ కార్యక్రమంలో ఏపీఎం గద్దె పెదసుబ్బారావు మాట్లాడుతూ ఒక యూనిట్ ఖరీదు ఐదు వేల రూపాయలకు 10 కోళ్లు ఇస్తామన్నారు. వీటిలో ఏడు పెట్టలు, మూడు పుంజులు, ఒక నెలకు సరిపోయేటువంటి దాణా, మెడిసిన్, కోళ్ల బాక్స్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కోళ్ల పొదగకుండానే సుమారు రెండు, మూడు నెలలు వరుసగా గుడ్లు పెడతాయని తెలిపారు. ప్రతి కుటుంబంలో ఉన్న సభ్యురాలు ప్రతి రోజు కోడిగుడ్డు తినాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. చినగంజాం మండలానికి 50 యూనిట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మి, టీడీపీ నాయకులు చెరుకూరి రాఘవయ్య, నరహరి శ్రీనివాసరావు, పర్వతరెడ్డి పార్థసారథి, వెలుగు సీసీలు కే.వెంకటస్వామి, మాధవి పాల్గొన్నారు.

పొదుపు సంఘాల మహిళలకు ఆర్థిక భరోసా

పెరటి కోళ్లు పంపిణీ

వేటపాలెం/చీరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాల్లోని మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్లు వేటపాలెం ఎంపీడీవో రాజేష్‌బాబు చెప్పారు. మంగళవారం ఏపీఎం అంజిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పెరటి కోళ్లు పంపిణీ చేశారు. ఒక్కో యూనిట్ ధర రూ.5 వేలు ప్రకారం సభ్యులకు ప్రోత్సాహకం అందిస్తున్నట్లు చెప్పారు. వాటిపెంపకం ద్వారా ఆర్థికంగా బలపడి జీవన విధానాలను మెరుగు పరచుకోవాలని సూచించారు. సీసీలు విజయలక్ష్మి, చిన్నయ్య, అనూరాధ పాల్గొన్నారు.

17న భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ప్రతిష్ఠా మహోత్సవం



నిర్మాణం పూర్తి చేసుకుంటున్న ఆలయం

పంగులూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పంగులూరులో చిలుకూరి వంశ ఇలవేల్పు శ్రీభద్రకాళీ మాత దేవరగుడి సర్వాంగసుందరంగా రూపుదిద్దుకుంది. గ్రామానికి తూర్పు దిక్కున 16సెంట్ల సువిశాల స్థలంలో చిలుకూరి వంశస్తులు తమ ఇష్టదైవంగా కొలిచే శ్రీభద్రకాళీ సమేత వీరభద్ర స్వామి నూతన ఆలయం, దీనికి అనుబంధంగా భక్తుల సౌకర్యార్థం కోసం వసతులతో కూడిన విశ్రాంతి గదులు, భోజనశాల నిర్మాణం జరిగింది. కోటి రూపాయల వ్యయంతో చేపట్టిన ఈ నూతన ఆలయం, భోజనశాల, వసతిగదుల నిర్మాణానికి ప్రవాసాంధ్రులు పంగులూరు గ్రామానికి చెందిన కొణకంచిరాము 11సెంట్లు, గ్రామ నివాసి చిలుకూరి పెదబాబు ఐదు సెంట్ల స్థలాన్ని ఉచితంగా సమకూర్చారు. పంగులూరు, చినమల్లవరం, నక్కలపాలెం పరిసర ప్రాంతాలకు చెందిన వందలాదిమంది చిలుకూరి వంశస్తులు సమకూర్చిన భారీ విరాళాలతో ఈ ఆలయనిర్మాణం రూపుదిద్దుకుంది.

దేవతామూర్తుల ప్రతిష్ఠా మహోత్సవం

తరతరాలుగా చిలుకూరి వంశస్తుల ఇలవేల్పుగా ఆరాధించే శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామివారి ప్రతిష్ఠా మహోత్సవం 17వతేదీ ఉదయం 10.21 నిమిషాలకు జరగనుంది. 14వ తేదీ నుంచి పలు కార్యక్రమాలతో ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు

సమస్యల పరిష్కారం కోరుతూ అధ్యాపకుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు

అద్దంకిటౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోని అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుల బదిలీలు నిర్వహించాలని, గత ప్రభుత్వం ఎయిడెడ్ అధ్యాపకులను ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నియమించిన జీవో నెం 42ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన అధ్యాపకులను దేశంలోని 26 రాష్ట్రాల్లో ఉన్న వివిధ అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌లుగా రిజిగ్నేట్ చేయాలని డిమాండ్ చేశారు. అనేక సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా పట్టించుకోలేదని, ఇలానే కొనసాగితే ఈనెల 18వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర వ్యాప్త మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వి. ప్రసాద్, సిహెచ్.సురేష్‌కుమార్, ఏ.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులలో రక్తహీనత, బుద్ధిమాంద్యంను నివారించాలి



విద్యార్థులతో నులిపురుగుల మాత్రలు మింగిస్తున్న వైద్యాధికారి, ఉపాధ్యాయులు

అద్దంకిటౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : ఆల్ బెండజోల్ మాత్రతో నులిపురుగులను నివారించి, తద్వారా విద్యార్థులలో రక్తహీనత, బుద్ధిమాంద్యం నివారించవచ్చుని మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహర్ష చెప్పారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మోదేపల్లి పీహెచ్‌సీ పరిధిలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు, పని చేసే సిబ్బందికి మధ్యాహ్నం భోజనం అనంతరం నులిపురుగుల నివారణ కోరకు ఆల్ బెండజోల్ మాత్రలను మింగించారు. కొటికలపూడి యూపీ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ శ్రీహర్ష నులిపురుగుల వలన కలిగే ఆరోగ్య సమస్యలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మొత్తం 4,833 మందికిగాను 4,654 మందికి మాత్రలు మింగించారు. అద్దంకిలోని కాకానిపాలెం, గాజులపాలెం యూపీహెచ్‌సీ పరిధిలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ, జూనియర్ కళాశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందితో వైద్యాధికారులు డాక్టర్ హేమ మాధిరి, డాక్టర్ గొట్టిపాటి జయసింహల ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మాత్రలను మింగించారు. కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి సత్యనారాయణ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.

పంగులూరులో...

పంగులూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : పంగులూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల చేత పీహెచ్‌సీ డాక్టర్ శివ చెన్నయ్య నులిపురుగుల మాత్రలు మింగించారు. హెచ్‌ఎం సోమేపల్లి హనుమంతరావు, తహసీల్దార్ సింగారావు పాల్గొన్నారు.

చినగంజాంలో...

చినగంజాం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సంతరావూరు, గొనసపూడి, కడవకుదురు, మోటుపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలోని 1787 మంది విద్యార్థులకు వైద్యాధికారులు కే కీర్తిసరోజ్, బీనాగేంద్రలు నులిపురుగుల నివారణ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.సత్యానందం, పీహెచ్‌సీ హెచ్‌ఈవో యు.వెంకటరమణ పాల్గొన్నారు.

మార్టూరులో...

మార్టూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలలపూడి గ్రామంలో జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సతీష్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు రవి, వైద్య సిబ్బంది మౌనిక, భవాని, ఆశా సిబ్బంది గాయత్రి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పర్చూరులో...

పర్చూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : కారంచేడు గ్రామంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు కమ్యూనిటీ హెల్త్ అధికారిణి శాంతిప్రియ నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం జ్యోత్స్న పాల్గొన్నారు.

అవీఇవీ

రైతు సమస్యల పరిష్కారంలో పారదర్శకత పాటించండి : ఎమ్మెల్యే కొండయ్య



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న చైర్మన్ శ్రీనివాసరావు

చీరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రైతు సమస్యల పరిష్కారంలో సహకార సంఘాలు పారదర్శకంగా పని చేయాలని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. ఇటీవల వేటపాలెం మండలం సహకార సంఘం చైర్మన్‌గా మండల టీడీపీ సీనియర్ నాయకులు పల్లప్రోలు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొండయ్యను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్, యువనాయకులు గౌరీ అమర్నాథ్ పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై కఠిన చర్యలు

పట్టణంలో విస్తృతంగా అధికారులు తనిఖీలు



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ అధికారులు

చీరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చౌర్యంపై కఠిన చర్యలు తప్పవని అధికారులు చెప్పారు. మంగళవారం చీరాల పట్టణంలోని డీ 1 సెక్షన్ పరిధిలో 34 బృందాలుగా ఏర్పడి విజిలెన్స్ ఆధ్వర్యంలో 2,661 సర్వీసులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా 65 కేసులు నమోదు చేసి రూ.4.24.600 అపరాధ రుసుం విధించారు. ప్రభుత్వం ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సూర్యఘర్ ద్వారా ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఈఈ భాస్కరరావు, డీఈ ఈఈ విజయ శ్రీనివాస్, ఆపరేషన్ విభాగం నుంచి చీరాల డీఈ ఈఈ హరి ప్రసాదరావు, పర్చూరు డీఈ ఈఈ శ్రీనివాసులు, వేటపాలెం డీఈ ఈఈ శ్రీనివాసరావు, ఏఈలు, జెఈలు, లైన్‌మేన్‌లు పాల్గొన్నారు.

ఉత్తమ చదువుతోనే సంస్కారం



మాట్లాడుతున్న ఎస్సై రాజ్యలక్ష్మి

చీరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో ఉత్తమంగా విద్యాభ్యాసం సాగిస్తేనే సంస్కారం సాధ్యమవుతుందని ఎస్సై గారపాటి రాజ్యలక్ష్మి చెప్పారు. స్థానిక వైపే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ యాంటీ ర్యాగింగ్ వారోత్సవాలు నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ మురళీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి ఎస్సై మాట్లాడారు. సహ విద్యార్థులతో ఏ విధంగా మెలగాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే మహిళ రక్షణ చట్టంపై పలు సూచనలు చేశారు. కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

ఆటో వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆటో వర్కర్లు

బల్లికురవ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఆటో వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, ఉచిత బస్సులు వస్తే తమకు తీవ్ర ఇబ్బందులు వస్తాయని మండల ఆటోవర్కర్ల యూనియన్ సభ్యులు చెప్పారు. మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌కు ఆటో వర్కర్లు తమ డిమాండ్లపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమను ఆదుకోవాలన్నారు. వాహన మిత్ర పథకాన్ని అమలు చేయాలని, ఏడాదికి రూ.15 వేలు అందజేయాలని, అలానే డ్రైవర్లకు వ్యక్తిగత ప్రమాద బీమా అమలు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు అప్పారావు, ఆటో వర్కర్ల నేతలు కందుల మరియబాబు, రామారావు, యేసు, అజయ్ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ప్రత్యేక శ్రేణి కార్యదర్శి సూర్య ప్రకాష్‌రెడ్డి

అద్దంకి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బంది కచ్చితంగా సమాచారహక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి సూర్య ప్రకాష్‌రెడ్డి చెప్పారు. సమాచార హక్కు చట్టం-2005పై మంగళవారం స్థానిక మార్కెట్ యార్డులో సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో మార్కెట్ కమిటీ, అగ్నిమాపక శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

డెంగ్యూ వ్యాధిపై కరపత్రాల పంపిణీ

మార్టూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగరాజుపల్లిలో మంగళవారం ఎంపీడీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డెం గ్యూ వాధి నివారణా మార్గాలపై కరపత్రాలను గ్రామంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ పాల్గొన్నారు.

10 మంది జూదరుల అరెస్ట్

చినగంజాం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కుంకుడుచెట్లపాలెం గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి పదిమందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య ఆధ్వర్యంలో ఈ దాడి చేశారు. వారి వద్ద రూ.1,40, 520లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.రమేష్ పాల్గొన్నారు.


పెన్నమ్మకు పోటెత్తుతున్న వరద

అనంతసాగరం : సోమశిల ప్రాజెక్టుకు వరద ప్రవాహం పెరిగింది. పెన్నా క్యాచ్‌మెంట్ ఏరియాలో కురుస్తున్న వర్షాలకు తోడు కృష్ణాజలాలు వస్తుండగా పెన్నమ్మ పోటెత్తుతోంది. సోమవారం 15,687 క్యూసెక్కులు వస్తుండగా మంగళవారం ఉదయానికి 18,910 క్యూసెక్కులుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. దీంతో డ్యాంలో నీటి నిల్వ 40.787 టీఎంసీలకు చేరింది. ఇన్‌ఫ్లో మరింతగా పెరగవచ్చని ఇంజనీర్లు భావిస్తున్నారు. కడప జిల్లా ఆదినిమ్మాయపల్లి గేజ్ వద్ద 20 వేల క్యూసెక్కులు వస్తున్నట్లు గుర్తించారు. వచ్చే వారం రోజులపాటు రోజుకు రెండు టీఎంసీల మేర వరద కొనసాగే సూచనలు ఉన్నాయి.

కమలం వికసించేనా!?

- అధికారంలో ఉన్నా పెరగని పట్టు
- నాయకుల మధ్యే లోపించిన ఐక్యతారాగం
- పక్కపార్టీలవైపు.. కార్యకర్తల చూపు

జిల్లాలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పరిస్థితి రోజు రోజుకు దిగజారుతోంది. మూడు పర్యాయాలుగా కేంద్రంలో ఇప్పుడు రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా జిల్లాలో మాత్రం పార్టీ బలోపేతం కాలేదు. రాష్ట్ర నాయకత్వానికి కూడా జిల్లాలో పార్టీ బలోపేతం కావాల్సిన అవసరం లేదనుకున్నారేమో క్షేత్రస్థాయిలో జరుగుతున్న పతనాన్ని ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. కేవలం ఐదారుగురు నాయకులే జిల్లా బీజేపీ అనే భ్రమలో నాయకత్వం ఉన్నట్లు కనిపిస్తోంది.



నెల్లూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తలే ఏ పార్టీకైనా జీవం. వీరే లేనప్పుడు పార్టీ ఉన్నా అది లేనట్టే లెక్క. కొన్నేళ్ల క్రితం వరకు జిల్లావ్యాప్తంగా కరుడుగట్టిన బీజేపీ కార్యకర్తలు చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉండేవారు. నియోజకవర్గ ఫలితాలను శాసించే స్థాయిలో ప్రభావం చూపగలిగేవారు. కానీ గత కొన్నేళ్లుగా నాయకుల తప్పిదాల వల్ల వీరు పార్టీకి దూరం అవుతున్నారు. పార్టీ జాతీయ స్థాయిలో ఉన్న క్రమశిక్షణ ఇక్కడి నాయకుల్లో లేదనే విమర్శలు ఉన్నాయి. వర్గ విభేదాలు ఎక్కువయ్యాయి. కార్యకర్తలు ఒక నాయకుడి వద్దకు వెళితే మరో నాయకుడు కోపంగించుకునే పరిస్థితి. నామినేటెడ్ పదవుల్లో, ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చే పనుల్లో కార్యకర్తలకు అన్యాయం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం దామాషా ప్రకారం బీజేపీకి కొన్ని పదవులు కేటాయిస్తున్నా నాయకులు వాటిని పక్క పార్టీల వారికి ఇచ్చేస్తున్నారని, లేదా టీడీపీ నాయకులు సిఫారసు చేసిన వారికే ఇస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నారు.

పక్కపార్టీల్లోకి వలసలు

ఇక ఇతర సమస్యలను చెప్పుకోవడానికి జిల్లా నాయకత్వం అందుబాటులో ఉండదని, ఫోన్‌లకు స్పందించదనే ఆవేదనలు కార్యకర్తల నుంచి వినిపిస్తోంది. ఈ ఆవేదనలు, అసంతృప్తుల ప్రభావం కార్యకర్తలను పక్క పార్టీల్లోకి వలస వెళ్లేలా చేస్తోంది. బీజేపీ భావజాలం ఉన్న జనసేన వైపు పలువురు ఆకర్షితులవుతున్నారు. హడావిడి లేకుండా మౌనంగా ఆ పార్టీ జెండా పట్టుకొంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే క్షేత్రస్థాయిలో బీజేపీ రోజు రోజుకు బలహీనపడుతోంది. ఈ పరిస్థితుల్లో బుధవారం జిల్లా పర్యటనకు వస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పార్టీ స్థితిగతులపై దృష్టి సారించాలని, క్షేత్రస్థాయి కార్యకర్తల మనోగతాలకు అనుగుణంగా పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ అభిమానులు, సానుభూతిపరులు కోరుకొంటున్నారు.

బీజేపీ రాష్ట్ర చీఫ్ నేడు రాక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తొలిసారిగా బుధవారం నెల్లూరుకు వస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం వేదాయపాళెం కూడలి వద్ద చాయ్ పే కార్యక్రమంలో మాధవ్ పాల్గొంటారని తెలిపారు. అనంతరం 10 గంటలకు ఆత్మకూరు బస్టాండ్ వద్ద పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పిస్తారని తెలిపారు. అనంతరం వీఆర్‌సీ మైదానం నుంచి కస్తూరిబా కళాక్షేత్రం వరకు జరిగే ర్యాలీలో మాధవ్ పాల్గొంటారని తెలిపారు. అనంతరం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొంటారని చెప్పారు.

కనీస వేతన సలహా బోర్డు ఛైర్మన్‌గా 'పెళ్లకూరు'

- తెలుగు, సంస్కృత అకాడమీకి ఆర్‌డీ విల్సన్
- నామినేటెడ్ పదవుల్లో జిల్లా నేతలకు స్థానం



పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి — ఆర్డీ విల్సన్

నెల్లూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా 31 కార్పొరేషన్లకు మంగళవారం ప్రభుత్వం ఛైర్మన్లను నియమించింది. ఈ నామినేటెడ్ పదవుల్లో జిల్లాకు చెందిన ఇద్దరు నేతలకు చోటు దక్కింది. ఒకరు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, మరొకరు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్‌డీ విల్సన్. ఆంధ్రప్రదేశ్ కనీస వేతన సలహా బోర్డు ఛైర్మన్‌గా శ్రీనివాసులురెడ్డి నియమితులయ్యారు. మొదటి నుంచీ ఈయన టీడీపీలో కొనసాగుతున్నారు. గతంలో కోవూరు సమన్వయకర్తగా కూడా పని చేశారు. 2024 ఎన్నికల్లో ఉత్తరాంధ్ర పరిశీలకుడిగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించారు. ఇక తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్‌గా ఆర్‌డీ విల్సన్ నియమితులయ్యారు. ఈయన కూడా బీజేపీలో క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా కొనసాగుతున్నారు.



నెల్లూరులోని వైవీఎం పాఠశాలలో విద్యార్థులతో ఆల్‌బెండజోల్ మాత్రలు మింగిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి

డీవార్మింగ్ 96.82 శాతం

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ నులి పురుగుల నివారణ (డీవార్మింగ్)కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లాలో 96.82 శాతం మంది పిల్లలతో ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించినట్లు వైద్య శాఖ అధికారులు వెల్లడించారు. 5,75,806 మంది విద్యార్థులతో ఆ మాత్రలు మింగించాలని లక్ష్యంకాగా తొలిరోజు 5,51,772 మంది పిల్లలతో ఈ మాత్రలు మింగించినట్లు ప్రకటించారు. ప్రభుత్వం, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ కార్యక్రమం విజయవంతం అయినట్లు అధికారులు పేర్కొన్నారు.

నులిపురుగుల సమస్యపై అవగాహన అవసరం

వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి

8లో..

బడి భోజనం బాగున్నా..

- అధికారుల పర్యవేక్షణ ఉంటే మరింత పటిష్టంగా అమలు
- చాలాచోట్ల మంచినీటి కోసం అవస్థలు
- సకాలంలో అందని బిల్లులు
- నిర్వాహకులకు ఆర్థిక ఇబ్బందులు

ఆంధ్రజ్యోతి పరిశీలన

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించి రేపటి సమాజానికి ఆరోగ్యవంతమైన పౌరులుగా తీర్చిదిద్దడానికి అమలు చేస్తున్న 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' అమలు బాగున్నా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. పాఠశాలలకు సన్నబియ్యం పంపిణీ జరుగుతున్నా ముద్దకట్టిన అన్నమే దిక్కుగా మారుతోంది. కొన్నిచోట్ల చౌకడిపో బియ్యాన్నే అందిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ఇలా జరుగుతోందనే విమర్శలూ నెలకొన్నాయి. దీనికితోడు ప్రతినెలా బిల్లులు అందకపోవడంతో ఇబ్బందిగా మారిందని నిర్వాహకులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా 'ఆంధ్రజ్యోతి' బృందం కొన్ని పాఠశాలలను పరిశీలించింది. ఆ వివరాలు క్లుప్తంగా...

సీతారామపురంలో నీటిసమస్య

సీతారామపురం : మండలంలోని ఓగూరువారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో నీటి సమస్య విద్యార్థులను వెంటాడుతోంది. పక్కనే ఉన్న ఆర్వో ప్లాంట్ నుంచి తరగతికి ఒక బబుల్ ఉచితంగా ఇస్తారని, ఆ నీరు అయిపోతే డబ్బులు పెట్టి కొనాల్సి వస్తుందని విద్యార్థులు తెలిపారు. ప్లాంటు మూసేసినప్పుడు బోరు నీరు తాగుతున్నట్లు తెలిపారు. స్కూల్లో ఉన్న మోటారుకు గ్రామానికి చెందిన ఆరో ప్లాంట్‌కు కనెక్షన్ ఇవ్వడం వల్ల స్కూల్‌కి నీరు సరిపోవటం లేదని, చాలా ఇబ్బందులు పడుతున్నామని వాచ్‌మన్ మోసెస్ తెలిపారు.



స్కూల్లోని బోరు నుంచి ఆర్వో ప్లాంట్‌కు ఇచ్చిన కనెక్షన్

ఉలవపాడులో అందని గుడ్డు

ఉలవపాడు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 307 మంది విద్యార్థులు ఉండగా మంగళవారం 256 మంది హాజరయ్యారు. 242 మంది మధ్యాహ్న భోజనం చేసినట్లు హాజరు పట్టికలో నమోదైంది. అయితే, మధ్యాహ్నం మెనూ ప్రకారం పులిహోర వడ్డించగా కోడిగుడ్డు పెట్టలేదు. ఈ విషయమై ఉపాధ్యాయులను ప్రశ్నించగా నులిపురుగుల మాత్రలు పంపిణీ ఉన్నందున గుడ్డు తిన్న తరువాత అల్బెండజోల్ మాత్ర వేసుకుంటే ఏదైనా ఆరోగ్య సమస్య వస్తుందని గుడ్డు ఇవ్వలేదని చెప్పారు. కాగా, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏజెన్సీని నియమించలేదు. దీంతో ప్రభుత్వం ఇస్తున్న సన్న బియ్యం, కోడిగుడ్లు ఒక హోటల్ యాజమాన్యానికి ఇచ్చి, అక్కడ నుంచి భోజనం తెప్పించి వడ్డిస్తున్నారు. దీనిపై ప్రిన్సిపాల్ శ్రీనివాసరావును వివరణ కోరగా గతంలో ఉన్న ఏజెన్సీ వాళ్లు సరిగా వండకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారని, అందుకే హోటల్‌లో వండించి తెప్పించి పెడుతున్నట్లు చెప్పారు.



ఉలవపాడు : ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్ని తింటున్న విద్యార్థులు

నెల్లూరు (విద్య), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ హయాంలో 60శాతానికి పడిపోయిన మధ్యాహ్నభోజనం గ్రాఫ్‌ను పరిశీలించిన ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సమూల మార్పులు చేపట్టింది. పాఠశాలలకు వచ్చేవారంతా పేద, మధ్యతరగతి విద్యార్థులే అయినా మధ్యాహ్నభోజనం చేయడంలేదని గుర్తించి అందరి అభిప్రాయాల సేకరణతో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంగా పేరు మార్చి సన్నబియ్యంతోపాటు నూతన మెనూను ప్రారంభించింది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం పిల్లలకు కేవలం రెండు రోజులు మాత్రమే సన్న బియ్యం వడ్డిస్తూ మిగిలిన రోజుల్లో రేషన్ బియ్యాన్నే వాడుతున్నట్లు ఆరోపణలున్నాయి. జిల్లాలో అనేక పాఠశాలల్లో ఇదే జరుగుతోందని తల్లిదండ్రులు సైతం నిర్ధారించారు. మరోవైపు నిర్వాహకులకు సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో మొక్కుబడిగా మెనూ అమలు చేస్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. మంచి నీటి సదుపాయం కూడా అంతంత మాత్రంగా ఉండటంతో ఇళ్లనుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. బకాయిలు సకాలంలో మంజూరుకాక పోవడంతో వంట మనిషి, హెల్పర్ నుంచి విద్యార్థుల వరకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇబ్బందులు చవిచూస్తున్నారు.

మొత్తం స్కూళ్లు	:2,570
విద్యార్థుల సంఖ్య	:1,48,728
హాజరయ్యేవారు	: 1,35,222
భోజనం చేసేవారు	:1,31,741
ఏజెన్సీలకు చెల్లించేది	:
ప్రాథమిక విద్యార్థికి	: రూ.5.88
ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థికి	: రూ.8.57

నిర్వహణ లోపాలను అధికారులు ప్రశ్నించలేని పరిస్థితి నెలకొంది.

పెరిగిన ధరలతో..

పెరిగిన ధరలతో ప్రభుత్వం ఇచ్చే బిల్లులు ఏమాత్రం సరిపోవడం లేదని, బిల్లులు కూడా సకాలంలో చెల్లించకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని నిర్వాహకులు చెపుతున్నారు. గత మూడేళ్లుగా జూనియర్ కళాశాలల్లో నిలిచిపోయిన ఈ పథకాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి పునః ప్రారంభించారు. అయితే వీరికి నేటికీ ఒక్క రూపాయి కూడా బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఓ అధ్యాపకుడు తెలిపారు. విద్యాశాఖ అధికారులు దీనిపై మాట్లాడుతూ జిల్లాలో పథకం గతంలో కంటే ప్రస్తుతం చాలా బాగా అమలవుతోందని, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేవని చెపుతున్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని చెబుతున్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



అల్లూరు : ఆర్‌వో ప్లాంటు లేకపోవడంతో డ్రమ్ములోని నీటిని తాగుతున్న బాలుడు



అల్లూరు : సిమెంటు బస్తా లున్న వరండాలో భోజనం చేస్తున్న పిల్లలు

పాఠశాలలో వసతులు లేక..

అల్లూరు : పట్టణ పరిధిలోని జడ్పీ ఉన్నత పాఠశాల (సుబ్బయ్యబడి)లో కనీస వసతులు లేవు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనం వడ్డిస్తున్నా నిర్వాహకులకు బిల్లుల సమస్య వెంటాడుతోంది. భోజనం చేసేందుకు సరియైన స్థలం లేకపోవడంతో దుమ్మూ ధూళి నిండిన ప్రాంతంలోనే విద్యార్థులు తింటున్నారు. 344 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో నీటి వసతి లేదు. దీంతో క్యాన్ల ద్వారా నీటిని తెచ్చి విద్యార్థుల దాహం తీరుస్తున్నారు.

రూ.4 కోట్ల స్థలానికి స్కెచ్!

- పొదలకూరులో ప్రభుత్వ భూమి కబ్జాకు విశ్వప్రయత్నం
- నకిలీ డాక్యుమెంట్లతో ఓ వ్యక్తి రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు
- పరిశీలించి వెనక్కి పంపిన రిజిస్ట్రార్
- రెవెన్యూ శాఖలో సమీప బంధువు ద్వారా మంత్రాంగం

పొదలకూరు పట్టణంలో రూ.కోట్లు విలువైన ప్రభుత్వ స్థలం అది. దీనిపై కన్నేసిన ఓ ఘనుడు పిత్రార్జితం పేరుతో ఏకంగా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించాడు. అయితే, వీటిని పసిగట్టిన రిజిస్ట్రార్ ఆయన దరఖాస్తును వెనక్కి పంపారు. ఎలాగైనా ఆ స్థలాన్ని చేజిక్కించుకోవాలన్న ఉద్దేశంతో రెవెన్యూ శాఖలో కీలకస్థాయిలో ఉన్న తన సమీప బంధువు సహాయ సహకారాలు తీసుకుంటున్నట్లు సమాచారం. - పొదలకూరు, (ఆంధ్రజ్యోతి)

పొదలకూరులో మెయిన్ రోడ్డు పక్కనే పంచాయతీ కార్యాలయం వద్ద సర్వే నెం బరు 191-1ఏలో 34 అంకణాల ప్రభుత్వ ఖాళీ స్థలం ఉంది. దీని విలువ సుమారు రూ.4 కోట్లు ఉంటుందని అంచనా. గతంలో వీఆర్ వ్యవస్థ కొనసాగుతున్న సమయంలో గ్రామ చావడి శిథిల భవనం ఉండేది. కూలేస్థితిలో ఉన్న ఆ భవనాన్ని అధికారులు తొలగించారు. అంతకు మునుపే అక్కడ ప్రభుత్వ పశువుల ఆసుపత్రి ఉండేది. ఆ తర్వాత పంచాయతీ కార్యాలయ భవనంలో స్థలం కలుస్తుండటంతో ఏ శాఖకు చెందిన స్థలమో గుర్తించి రికార్డుపరంగా స్వాధీనం చేసుకోకుండా పంచాయతీ భవనాన్ని ఖాళీ స్థలంలో నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. అప్పటి రాపూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ఈ భవన నిర్మానానికి శిలాఫలకం కూడా ఆవిష్కరించారు. అయితే, నిధులు మంజూరు కాకపోవడంతో భవన నిర్మాణం అటకెక్కింది.



ఆక్రమణకు గురికాబోతున్న స్థలంలో తాత్కాలికంగా ఉన్న కూరగాయల అంగడి

కోర్టు తీర్పుతో..

2017లో వీఆర్‌వోల సంఘం అధ్యక్షుడు రవిశేఖర్ ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ అధికారి భవనాన్ని ఖాళీ స్థలంలో నిర్మించాలని చెత్తాచెదారం తొలగిస్తున్న సమయంలో పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు అడ్డుకున్నారు. దీనిపై రెవెన్యూ, పంచాయతీ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. క్రైం నెంబరు 83/17 కేసు ఆరేళ్లపాటు గూడూరు కోర్టులో జరిగి చివరికి 2023, ఫిబ్రవరిలో కొన్ని నిబంధనలతో రెవెన్యూ భవనం నిర్మించేందుకు అనుమతినిస్తూ తీర్పు వెలువడింది. ఈ మేరకు కలెక్టర్ అనుమతులు కూడా ఇచ్చారు.

నకిలీ డాక్యుమెంట్లతో..

పొదలకూరు-సంగం రోడ్డుకు చెందిన ఓ వ్యక్తి కన్ను సదరు 34 అంకణాల స్థలంపై పడింది. ఆ స్థలం తనకు పిత్రార్జితంగా లభించిందని పేర్కొంటూ పలువురి డెత్ సర్టిఫికెట్లు పెట్టి ఆ స్థలాన్ని తనకు రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతూ 2023, సెప్టెంబరులో పొదలకూరు సబ్‌రిజిస్ట్రార్‌కు దరఖాస్తులు అందించారు. అయితే, ఆ డాక్యుమెంట్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేయకుండా తోసిపుచ్చారు. అర్నెల్ల తర్వాత డాక్యుమెంట్లను తిరిగి ఇచ్చేశారు. ఎలాగైనా ఆ ప్రభుత్వ స్థలాన్ని చేజిక్కించుకోవాలనే ఉద్దేశంతో ఇప్పటికీ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. రెవెన్యూ శాఖలో కీలక అధికారిగా ఉన్న తన బావమరిది సహకారం తీసుకున్నాడు. ఆయన సూచనల మేరకు న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు పలు ఫేక్ డాక్యుమెంట్లను పోగు చేసుకున్నారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఆ స్థలాన్ని చేజిక్కించుకునేలా ముమ్మరంగా యత్నిస్తున్నాడు. ఈ వ్యవహారంపై ఇప్పటికే పొదలకూరు తహసీల్దారుకు పలుమార్లు టీడీపీ నాయకులు వినతిపత్రం అందించారు. అయినా స్పందన లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	240

కోడిగుడ్ల ధర (100): 520

నేటి శోభాయాత్ర, బహిరంగ సభను జయప్రదం చేయండి

అల్లూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే శోభాయాత్ర, బహిరంగ సభలను విజయవంతం చేయాలని ఆపార్టీ మండల కన్వీనర్ చెంతాటి కృష్ణమోహన్ అన్నారు. అల్లూరులో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చేపట్టిన రాష్ట్ర పర్యటనలో భాగంగా బుధవారం నెల్లూరుకు రానున్నారన్నారు. ఉదయం 10 గంటలకు వీఆర్‌సీ సెంటర్ నుంచి కస్తూర్బా కళాక్షేత్రం వరకు శోభాయాత్ర నిర్వహించిన అనంతరం బహిరంగ సభ జరుగుతుందన్నారు. మండలం నుంచి వందలాదిగా కార్యకర్తలు, నాయకులు, ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఆవల గోవిందస్వామి, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి సున్నపుగుంట గోవిందరెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షుడు ఇండ్ల మమత, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఉండ్రాళ్ల వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట రైల్వే అభివృద్ధికి అడుగులు!



పూర్తి కావచ్చిన ఏఆర్టీ, ఆర్వీఎంల సర్వీస్ పాయింట్ నిర్మాణం

- రోడ్ల పునర్నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు
- ఫుట్, ఫ్లై ఓవర్ బ్రిడ్జీల కోసం డైవర్షన్ రోడ్లు
- ఏఆర్టీ, ఆర్వీఎంల మరమ్మతుల పాయింట్ నిర్మాణం

బిట్రగుంట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : బిట్రగుంటలో రైల్వే అభివృద్ధి పనులు జోరుగా సాగుతోన్నాయి. రోడ్ల పునర్నిర్మాణం, వీధి దీపాల మార్పు, ఫుట్, ఫ్లై ఓవర్ బ్రిడ్జిల కోసం డైవర్షన్ రోడ్ల నిర్మాణం, ఏఆర్టీ, ఆర్వీఎంల మరమ్మతుల పాయింట్ ఏర్పాటు పనులు చేపట్టారు. దీంతో ఈ ప్రాంతానికి మళ్లీ పూర్వవైభవం వస్తుందని స్థానికులు బావిస్తున్నారు. బిట్రగుంటలో 18 వందల ఎకరాలకు పైగా రైల్వే భూములు ఉన్నాయి. ఈ భూముల్లో గతంలో ఉన్న రైల్వేలోని పలు విభాగాలకు చెందిన కార్యాలయాలు తరలిపోయాయి. ప్రస్తుతం కొంత మేరకు కార్యాలయాలు, రైల్వేస్టేషన్, రైలు పట్టాల ప్రదేశాలు పోను దాదాపు వెయ్యి ఎకరాలకు పైగా భూములు నిరుపయోగంగా ఉన్నాయి. ఈ భూముల్లో ఇటీవల పలు అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి.

- **వేగంగా ఏఆర్టీ, ఆర్వీఎం పాయింట్ నిర్మాణం**

రైలు ప్రమాదాలకు గురైనప్పుడు వాటిమరమ్మతుల కోసం ఏఆర్టీ (యాక్సిడెంట్ రిలీఫ్ ట్రయిన్), ఆర్వీఎం (యాక్సిడెంట్ వ్యాన్ మెడికల్) రైలు బోగీల సర్వీస్, మరమ్మతుల పాయింట్ నిర్మాణం చేపట్టారు. దాని పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ఇప్పటి వరకు ఒంగోలు నుంచి గూడూరు మధ్య జరిగే రైల్వే ప్రమాద స్థలానికి రిస్క్ టీం వెళ్లి మరమ్మతులు చేపట్టేవారు. బోగీల మరమ్మతులు, సర్వీసులు విజయవాడ డివిజనల్ హెడ్‌కోర్టర్‌కు తరలించే పరిస్థితి ఉంది. ప్రస్తుతం బిట్రగుంటలో జరుగుతున్న పనులు పూర్తయితే బోగీల మరమ్మతులు, సర్వీసు పనులు బిట్రగుంటలోనే చేసే అవకాశం కలుగుతోంది. అటువంటి పాయింట్ బిట్రగుంట స్టేషన్‌కు ఉత్తరాన ఏర్పాటు చేయడం అభివృద్ధికి తొలి అడుగని స్థానికులు భావిస్తున్నారు. అలాగే 2028 నాటికి ఎల్సీ గేట్లు ఎత్తి వేయాలని రైల్వేశాఖ ప్రతిపాదనలు చేసింది. అందులో భాగంగా బోగోలు మండల పరిధిలోని కొండబిట్రగుంట, బోగోలు ఎల్సీ గేట్ల వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలు పూర్తి కావాలని రైల్వే శాఖ మూడేళ్ల క్రితమే ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా డివైడింగ్ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుడుతున్నారు.

- **జోరుగా రోడ్ల పునర్నిర్మాణ పనులు**

ఏళ్ల తరబడి దెబ్బతిన్న బిట్రగుంట రైల్వే స్టేషన్ నుంచి కొత్తూరు పాత సిక్‌లైన్ వరకు ప్రధాన రోడ్డుపై ప్రయాణికులకు ఇబ్బందిపడేవారు. అలాగే రైల్వే స్టేషన్ నుంచి డ్రైవర్లు గార్డుల విశ్రాంతి భవనం, బోగోలు బజారు వరకు ఉన్న రైల్వే రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది. ఈ మార్గంలో ఇటీవల కాలంలో దాదాపు కిలోమీటర్‌కు పైగా తారురోడ్ల నిర్మాణం జరిగింది.



జోరుగా సాగుతున్న తారు రోడ్డు నిర్మాణ పనులు

రైల్వే స్టేషన్‌కు తూర్పు వైపు గతంలో ఉన్న రోడ్డు ఇటీవల పునఃనిర్మాణ పనులు జరిగాయి. అలాగే రైల్వే స్టేషన్ నుంచి రన్నింగ్ రూమ్ వరకు ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాట్లు జోరుగా జరుగుతున్నాయి. డ్రైవర్లు, గార్డుల విశ్రాంతి భవనం సమీపంలో నూతన భవన నిర్మాణం జరుగుతోంది. అయితే బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు, విశ్రాంత రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు, రైల్వే ఉద్యోగులు బిట్రగుంట రైల్వే అభివృద్ధి కోసం చేసిన విజ్ఞప్తులకు, పార్లమెంటు సమావేశాల్లో గతంలో ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు యాదవ్, గతంలో అప్పటి ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిలు బిట్రగుంట రైల్వే ప్రాంత అభివృద్ధిపై ప్రస్తావించడంతో రైల్వే ఉన్నతాధికారులు స్పందించారని పలువురు అంటున్నారు. అలాగే బోగోలు ఎల్సీగేట్ 143 వద్ద బాక్స్‌టైప్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఇచ్చిన హామీలో భాగంగా బోగోలు నుంచి కొండబిట్రగుంట రైల్వే గేట్ వైపు తారు రోడ్డు వేస్తున్నారన్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

కందుకూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఇంటూరి సుశీల అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారుల మధ్య సమన్వయలేమితో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. ఎన్టీఆర్ హౌసింగ్ స్కీం ద్వారా ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు జారీచేయటంలో రెవెన్యూ అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సమావేశానికి వీఆర్‌ఓలు గైర్హాజరుకావటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి మెమోలు ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ తొట్టెంపూడి అనసూయ, ఎంపీడీవో రత్నావళి, తహసీల్దారు లావణ్య, ఏవో అబ్దుల్‌రహీం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

పట్టణంలోని ఆదిఆంధ్రకాలనీకి చెందిన సూరపోగు డెలీషియా డాక్టరు బీఆర్ అంబేడ్కర్ విదేశీ విద్యా పథకానికి ఎంపికవగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం అభినందించారు. డెలీషియా తల్లిదండ్రులు సంతోష్‌కుమార్, లావణ్యలు స్థానిక టీడీపీ నాయకులుతో కలిసి స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యేను కలువగా ఆయన డెలీషియాను సత్కరించారు. ఈ కార్యక్రమంలో చదలవాడ కొండయ్య, ఉచ్చులూరి నిరంజన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్ స్కాంలో ఇంకా పెద్ద తలలు ఉన్నాయి

- **బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్డీ విల్సన్**



మాట్లాడుతున్న బీజేపీ నేత ఆర్డీ విల్సన్

కావలి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ స్కాంలో ఇంకా పెద్ద తలకాయలు ఉన్నాయని, వారినెవరినీ వదిలే ప్రసక్తి లేదని, అందరిపై చర్యలు ఉంటాయని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్డీ విల్సన్ తెలిపారు. కావలి బీజేపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లిక్కర్ స్కాంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పందించారని చెప్పారు. లిక్కర్ సమస్యతో పాటు రాష్ట్రంలోని పలు సమస్యల పరిష్కారం కోసం ఆయన ప్రధానమంత్రి నరేంద్రమోదీతో చర్చించారన్నారు. బుధవారం నెల్లూరుకు వస్తున్న రాష్ట్ర అధ్యక్షుడి పర్యటనలో బీజేపీ శ్రేణులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా, మండల నాయకత్వం ప్రతి సోమవారం అధికారులతో మాట్లాడి స్థానిక సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లా నాయకులు కలెక్టర్‌ను కలిసి సమస్యలను నివేదించి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర అధ్యక్షుడు సూచిస్తున్నారన్నారు. పదవుల కోసం పాకులాడాల్సిన పనిలేదని, కష్టపడి పనిచేసే వారి దగ్గరకే పదవులు వస్తాయని చెప్పారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ దగదర్తి విమానాశ్రయ నిర్మాణం, కరేడు భూముల సమస్యలు, రామాయపట్నం పోర్టు నిర్వాసితులకు పరిహారం వంటి అంశాలపై రాష్ట్ర అధ్యక్షుడితో చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి బెల్లం కొండ మాల్యాద్రి, పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్ కుమార్, నేతలు భాస్కర్, కంచర్ల మురళీకృష్ణ, కే.బ్రహ్మానందం, పరుసు వెంకటేశ్వర్లు, వింతా రంగారెడ్డి, పూనూరు మాధవి, అమరా వెంకటసుబ్బారావు, తిరుపతయ్య పాల్గొన్నారు.

పీఏసీఎస్‌కు యూరియా కేటాయించండి

- **డీఏవోకి చైర్మన్, టీడీపీ నాయకుల వినతి**



డీఏవోతో సమావేశమైన జలదంకి పీఏసీఎస్ చైర్మన్, టీడీపీ నాయకులు

జలదంకి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండో పంటగా వరిసాగు చేపట్టినందున రైతులకు అవసరమైన యూరియా జలదంకి పీఏసీఎస్‌కు కేటాయించాలని చైర్మన్ కరియావుల అప్పలనాయుడు, టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం నెల్లూరులో జిల్లా వ్యవసాయ శాఖాధికారి సత్యవాణిని కలసి వినతిపత్రం అందజేశారు. మండలంలో రైతులు యూరియా కొరతతో పడుతున్న ఇబ్బందులను ఆమెకు వివరించారు. ఈ విషయాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన సూచనల మేరకు మిమ్మల్ని కలిశామని తెలిపారు. స్పందించిన ఆమె జలదంకి పీఏసీఎస్‌కు యూరియా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ముచ్చాల మధుసూదనరెడ్డి, షేక్ జానీ, టీడీపీ నేతలు మధురెడ్డి, జయచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వినోద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా డేకేర్ సెంటర్‌లో ఉచిత వైద్య సేవలు అందిస్తాం



చిన్నారులకు పౌష్టికాహారం అందచేస్తున్న డాక్టర్ జ్యోతి ప్రకాష్‌రెడ్డి

కావలి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కావలి రెడ్‌క్రాస్ నిర్వహిస్తున్న తలసేమియా డేకేర్ సెంటర్‌లో ఉచితంగా వైద్యసేవలు అందిస్తానని విజయవాడలోని రమేష్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ పీడియాట్రిక్, కార్డియాలజిస్ట్ డాక్టర్ జ్యోతి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. రెడ్‌క్రాస్ తలసేమియా డేకేర్ సెంటర్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. నిర్వహకులు ఆయన చేతుల మీదుగా బాధిత చిన్నారులకు మందులు, పౌష్టికాహారం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన మిత్రుడు తలసేమియా డేకేర్‌సెంటర్ వైద్యాధికారి డాక్టర్ పామూరు శ్రీధర్ ఆహ్వానం మేరకు ఈ కేంద్రాన్ని సందర్శించానన్నారు. కావలి లాంటి చిన్న పట్టణంలో ఎంతో వ్యయప్రయాసల కోర్చి తలసేమియా బాధిత చిన్నారులకు సేవలందించడం అద్భుతమన్నారు. ప్రతినెల మొదటి మంగళవారం కావలికి వచ్చి తలసేమియా బాధిత చిన్నారులకు ఉచితంగా గుండెకు సంబంధించిన ఎకో పరీక్షలు నిర్వహిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవి ప్రకాష్, వైస్ చైర్మన్ కే.హరినారపరెడ్డి, వైద్యాధికారి పామూరు శ్రీధర్, రక్త కేంద్రం కన్వీనర్ టీ.రమ్య, సభ్యులు కల్లయ్య, కొండారెడ్డి పాల్గొన్నారు.

పారా అథ్లెటిక్స్‌లో చైతన్య కృష్ణకు రజితం



పారా అథ్లెటిక్స్‌లో రాష్ట్రస్థాయి రజిత పతకం సాధించిన చైతన్య కృష్ణ

ఉలవపాడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో ఈనెల 9, 10వ తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన పారా అథ్లెటిక్స్ షాట్‌పుట్ పోటీల్లో చాకిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి చైతన్యకృష్ణ రజిత పతకం సాధించాడు. ఆ విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు కే.జనార్దన్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఓగుబోయిన శ్రీనివాసులు, జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కే.యాదగిరి, సెక్రటరీ మాల్యాద్రినాయుడు, విద్యాకమిటీ చైర్మన్ సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు మంగళవారం అభినందించారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేద్దాం



కలిగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కలిగిరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసుకుందామని తహసీల్దారు గిరీష్ ప్రజలకు పిలునిచ్చారు. హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా వెబ్‌సైట్‌లో ఎన్‌రోల్ చేసుకుంటే డీపీ వలంటీరుగా వ్యవహరించ వచ్చని సూచించారు. ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పట్టణంలో విద్యార్థులతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులు భారీ ర్యాలీ నిర్వహించారు.

అట్టహాసంగా అంతర్జాతీయ యువజన దినోత్సవం

కావలి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డీబీఎస్, విట్స్ ఇంజనీరింగ్ కళాశాలల్లో మంగళవారం అంతర్జాతీయ యువజన దినోత్సవాలు అట్టహాసంగా నిర్వహించారు. డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో దామివెట్టి సుధీర్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీవీ రావు, పరిపాలనాశాఖ అధికారి రమేష్‌బాబు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ రమణయ్యలు అంతర్జాతీయ యువజన దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. సామాజిక సేవలో, సమస్యల పరిష్కారంలో యువత భాగస్వాములు కావాలని చెప్పారు. ఈ మేరకు కట్టుబడి ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మధుకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ.అనిల్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జేబీ కళాశాల సీనియర్ లైబ్రియన్ డాక్టర్ డీ.వెంకట్రావు, విట్స్ కళాశాల లైబ్రరియన్ డాక్టర్ శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల మండల కమిటీ ఎన్నిక

ఉలవపాడు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : మండల వీఆర్‌ఏల నూతన కార్యవర్గ కమిటీని మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌ఏల జిల్లా సహాయ కార్యదర్శి బాలు అధ్యక్షతన జరిగిన సమావేంలో ఎన్నుకున్నారు. కమిటీ గౌరవఅధ్యక్షుడుగా దాసరి బ్రహ్మయ్య, అధ్యక్షుడుగా చిరితోటి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా నాలం సుబ్బారావు, కోశాధికారిగా దాసరి హరిబాబు, సహాయ కార్యదర్శిగా నన్నం కొండలరావులను ఎన్నుకున్నారు.

152 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 209 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో తొమ్మిది కంపెనీల ప్రతినిధులు పాల్గొని 152 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-47, సీఆర్-5, జంపింగ్‌లాట్స్-5 కారణాలతో 57బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.140, సగటు ధర రూ.192.44గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

బాలుడిపై వానరం దాడి

బిట్రగుంట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వేస్టేషన్ పడమర ఐఓడబ్ల్యూ, పీడబ్ల్యూఐ కార్యాయల మధ్యలో మంగళవారం ఇబ్రహీంపేటకు చెందిన ఓ బాలుడుపై వానరం (కోతి) దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. రైల్వే బ్రిడ్జి దిగి వెళుతున్న బాలుడిని కోతి వెంబడించింది. బాలుడు బయపడి పరుగు తియ్యడంతో దాడికి దిగింది. సమీపంలో ఉన్న రైల్వే కాంట్రాక్ట్ కూలీలు ఆ బాలుడిని కాపాడారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి



వలేటివారిపాలెం : కళవళ్లలో కూరగాయల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏవో శేషారెడ్డి

వలేటివారిపాలెం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు మెలకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారి శేషారెడ్డి తెలిపారు. మండలంలోని కళవళ్ల, నలదలపూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలనే సాగు చేసుకోవాలని తెలపారు. ఈ క్రాప్ నమోదు చేయించుకున్న రైతులకే ప్రభుత్వ పథకాలు అందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు బీ.సాయిచరణ్, రైతులు పాల్గొన్నారు.

- **లింగసముద్రం :** సజ్జ పైరులో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి హర్షవర్ధన్ రైతులకు చెప్పారు.మంగళవారం మండలంలోని తిమ్మారెడ్డిపాలెం పొలాల్లో, లింగసముద్రంలోని రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు దీప, రేణుక, మార్కెటింగ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణలో ఫ్లెక్సీల గొడవ

- తమ నాయకుడి ఫొటో లేదని ఎమ్మెల్యే ఫ్లెక్సీని ట్రాక్టర్‌తో తొక్కించిన వైనం
- ఆలస్యంగా వెలుగులోకి ఫొటోలు, వీడియో



కింద పడేసిన ఫ్లెక్సీ

కలిగిరి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీలో నెలకొన్న వర్గవిభేదాలు భగ్గుమన్నాయి. అందుకు నిదర్శనం ఈనెల 3వ తేదీన మండలంలోని ఎరుకలరెడ్డిపాలెంలో జరిగిన ఆంజనేయస్వామి విగ్రహావిష్కరణ సందర్భంగా ఎమ్మెల్యే ఫ్లెక్సీని ధ్వంసం చేసి ట్రాక్టర్‌తో తొక్కించడమే. ఫ్లెక్సీలో తమ నాయకుడు ఫొటోలు లేవంటూ ఆ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మద్యం మత్తులో ఈ ఘటనకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియో ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి రావడం నియోజకవర్గంలో సంచలనం రేకెత్తించింది. వివరాల మేరకు ఎరుకలరెడ్డిపాలెంకు చెందిన ఖాజా మస్తాన్ చెన్నైలో ఆర్థికంగా స్థిరపడి ఇటీవల గ్రామంలో వాటర్‌ప్లాంట్ నిర్మాణం, ఆంజనేయస్వామి విగ్రహ నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో ఈనెల 3వ తేదీన విగ్రహావిష్కరణకు సంబంధించి రెండవ తేది రాత్రి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండగా టీడీపీలో మరో వర్గానికి చెందిన వ్యక్తి మద్యం సేవించి వచ్చి తమ నాయకుడు ఫొటో ఫ్లెక్సీలపై లేకపోవడంపై ఖాజామస్తాన్‌ను ప్రశ్నించాడు. దేవుడి కార్యక్రమం సందర్భంగా విగ్రహ నిర్మాణానికి చేయూతనిచ్చి వారి ఫొటోలు మాత్రమే ఫ్లెక్సీలో వేయించామని అతను చెప్పాడు. అందుకు ఆగ్రహించిన ఆ వ్యక్తి ట్రాక్టర్‌ను తీసుకొచ్చి ఫ్లెక్సీలను తొక్కించాడు. ఈ విషయమై కలిగిరి పోలీస్‌స్టేషన్‌లో ఖాజామస్తాన్ ఫిర్యాదు చేయగా ఫ్లెక్సీలను తొక్కించిన వ్యక్తి టీడీపీ కార్యకర్త కావడంతోపాటు మద్యం సేవించి ఉన్నాడనే కారణంతో గ్రామస్థులు ఫిర్యాదు వెనక్కు తీసుకున్నారు. 3వతేది ఎమ్మెల్యే కాకర్ల సురేష్ విగ్రహావిష్కరణ సమయంలో ఎటువంటి వివాదాలు జరగక పోవడంతో కార్యక్రమం సుజావుగా జరిగింది. ఘటన జరిగిన 10రోజుల తర్వాత ఎమ్మెల్యే ఫ్లెక్సీ ధ్వంసానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మండలంలో తీవ్ర చర్చనీయాంశం అయ్యింది.

అభివృద్ధిని అడ్డుకోవాలనుకోవడం మూర్ఖత్వం

- **చెత్త రీ సైక్లింగ్ ప్రక్రియను ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి**



చెత్త రీసైక్లింగ్ ప్రక్రియను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిని అడ్డుకోవాలనుకోవ డం మూర్ఖత్వం అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని గుర్రంవారిపాలెం సమీపంలో ఉన్న డంపింగ్ యార్డు నుంచి చెత్త, ఘనవ్యర్థాల శుద్ధీకరణ (బయోమైనింగ్) ప్రక్రియను మంగళవారం ఎమ్మెల్యే ఇంటూరి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా పట్టణ ప్రజలు డంపింగ్ యార్డు కారణంగా కాలుష్యంతో పడుతున్న ఇబ్బందికి శాశ్వత పరిష్కా రం చూపిస్తానని గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చెత్తను పూర్తిగా తరలించే ప్రక్రియను ప్రారంభించినట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం డంపింగ్‌యార్డు సమస్య గురించి అసలు పట్టించుకో లేదని, ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నా వారికి జాలికలగలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కందుకూరు వచ్చినప్పుడు కూడా ఇదేసమస్యపై హామీ ఇచ్చారని అందులో భాగంగా నేడు పనులు ప్రారంభమయ్యాయన్నారు. రాష్ట్రంలోని 120 మున్సిపాలిటీలలో 40 మున్సిపాలిటీలలో మాత్రమే ఈ కార్యక్రమం చేపట్టగా అందులో కందుకూరు ఉండేలా కృషి జరిగిందని వివరించారు. ఎవరెన్ని అవాంతరాలు సృష్టించినా కందుకూరు పట్టణంలో అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తిలేదని, బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు కాలం చెల్లిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.అనూష, డీఈఈ గణపతి, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, ఉప్పుటూరి శ్రీనివాసరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

98 శాతం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



కొండాపురం : విద్యార్థినికి ట్యాబ్లెట్లు మింగిస్తున్న వైద్యాధికారి నసీరుద్దీన్

కొండాపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలో 98 శాతం మందికి అల్బెండజోల్ ట్యాబ్లెట్ల పంపిణీ పూర్తయినట్లు వైద్యాధికారి నసీరుద్దీన్ తెలిపారు. 18 ఏళ్ల లోపు వారిని 5433 మందిని గుర్తించగా 5331 మందికి ట్యాబ్లెట్లు ఇచ్చామన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాల, కేజీబీవీ, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

- **జలదంకి :** మండలంలో 18 ఏళ్ల లోపు పిల్లలకు అల్బెండజోల్ మందులు పంపిణీ చేశారు. స్థానిక శ్రీసాయి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బత్తిన అయ్యలరెడ్డి, అకడమిక్ ఇంచార్జ్ నజీర్, ఉపాధ్యాయులు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.
- **ఉలవపాడు :** కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 5372 మందికి నులిపురుగు మాత్రలు మింగించినట్లు డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా చాకిచర్ల పీహెచ్‌సీ పరిధిలో 3650 మందికి అల్బెండజోల్ మాత్రలు మింగించినట్లు డాక్టర్ ప్రణూత చెప్పారు. ఉలవపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి బీ సురేష్ పాల్గొన్నారు.
- **కలిగిరి :** నులిపురుగు ల నివారణ కార్యక్రమంలో భాగంగా స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను మింగించారు. మండలంలో మొత్తం 6906 మంది పిల్లలకుగాను 6561మందికి మాత్రలను మించించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం వెంకటలక్ష్మి, సీహెచ్‌వో సాయిలక్ష్మి, వైద్య సిబ్బంది ప్రఖ్యాతి, పద్మ, నారాయణరాజు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **లింగసముద్రం :** మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో 94 శాతం మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్ర లు పంపిణీ చేసినట్టు లింగసముద్రం మండల ప్రాథమిక ఆరోగ్య కేం ద్రం సీహెచ్‌సీ జీ.శ్రీనివాసులు చెప్పారు. మండలంలోని 45 అంగన్వాడీ కేంద్రాలు, 51 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 5824 ఉండగా 5498 విద్యార్థులకు మాత్రలు మింగించినట్టు చెప్పారు. మిగిలిన వారికి ఈనెల 20వ తేదీన మాత్రలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఉలవపాడు : చిన్నారులకు నులిపురుగుల మాత్రలు వేస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్



లింగసముద్రం : విద్యార్థినులకు మాత్రలు మింగిస్తున్న సీహెచ్‌వో శ్రీనివాసులు



కలిగిరి : విద్యార్థినికి మాత్రలు మింగిస్తున్న డాక్టర్ గీతారెడ్డి

త్వరితగతిన నియామకాలు

● జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజా పరిషత్ పరిధిలో ఎప్పటికప్పుడు పదోన్నతులు, కారుణ్య నియామకాలు త్వరితగతిన జరుపుతున్నట్లు జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. జడ్పీ కార్యాలయంలో మంగళవారం 17 మందికి పదోన్నతులు, ఇద్దరికి కారుణ్య నియామక ఉత్తర్వులను జడ్పీ సీఈవో మోహన్‌రావుతో కలిసి ఆమె అందించారు. 2021 నుంచి ఇప్పటి వరకు 137 మందికి ఉద్యోగోన్నతి, 83 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులు ఇచ్చినట్లు చెప్పారు. ఉద్యోగులు శ్రద్ధగా, బాధ్యతగా పనిచేసి ప్రజలకు మేలు చేయాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో జడ్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్తర్వులు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, పక్కన సీఈవో మోహన్‌రావు

మత్తులో తూలుతున్న బాల్యం



కలువాయిలోని పలువురు చిన్నారులు మత్తుకు అలవాటుపడ్డారు. గుడ్డలో నెయిల్ పాలిష్ రిమూవర్ వేసుకుని, దాన్ని చెండులా మడిచి నోటి ద్వారా పీల్చుతున్నారు. ఈ రకమైన మత్తుకు కొంతకాలంగా వారు అలవాటు పడ్డారు. బస్టాండు, బజార్లలో వారు తిరుగుతూ మత్తులో జోగుతుండడంతో వారి ఆరోగ్యంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి ఈ అలవాటును మాన్పించకుంటే భవిష్యత్తులో మత్తుకు బానిసలవుతున్నారు. ఇలావారు మత్తు పీల్చడం చాలా ప్రమాదకరమని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎం.విజయ లక్ష్మి, డాక్టర్ రమ్య తెలిపారు. ఇందువల్ల ఊపిరితిత్తులు, బ్రెయిన్‌పై ప్రభావం చూపడంతోపాటు పేగుల్లో అల్సర్లు వచ్చే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.

- కలువాయి, (ఆంధ్రజ్యోతి)

వరికుంటపాడు మండల పరిధిలోని జీ.కొత్తపల్లికి వెళ్లాలంటే ప్రజలు హడలిపోతున్నారు. ఉదయగిరి, వరికుంటపాడు మండలాలకు సరిహద్దు గ్రామం ఇది. ప్రధానరహదారి నుంచి గ్రామంలోకి వెళ్లేందుకు ఉన్న రహదారి రాళ్లు తేలడంతో వాహనదారులు నానాయాతన పడుతున్నారు. దారి పొడవునా గుంతలమయంగా దర్శనమిస్తుండ డంతో అటుగా వెళ్లాలంటేనే భయపడిపో తున్నారు. పైగా గ్రావెల్ రహదారి కావడంతో ఎక్కడ జారి పడతామోనని బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారి నిర్మాణ పనులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



- వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), (ఆంధ్రజ్యోతి)

రాళ్ల దాటి రాకపోకలు ఎలా..?

తొలి కాన్పునకు రూ.5వేలు

రెండో కాన్పులో ఆడపిల్ల పుడితే రూ.6వేలు

తల్లీబిడ్డ సంక్షేమానికి మాతృ వందనం

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : కాబోయే అమ్మకు ప్రధాన మంత్రి మాతృవందనం పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. మాతా, శిశు సంక్షేమానికి కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా పెద్ద పీట వేస్తోంది. ఆర్థిక సమస్యల కారణంగా కొంతమంది గర్భిణులు ప్రసవం తరువాత బిడ్డలకు సకాలంలో పోషకాహా రాన్ని అందించలేకపోతున్నారు. అవసరమైన టీకాలు సైతం వేయించలేక పోతున్నారు. ఇలాంటి ఇబ్బందులు లేకుండా తల్లీబిడ్డ సంక్షేమం కోసం ఈ మాతృవందనం పథకాన్ని స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద తల్లులకు ఆర్థిక సహాయం అందుతుంది. బాలింతల్లో రక్తహీనత నిర్మూలన, పోషకాహారాన్ని పెంపొందించాలన్న సంకల్పంతో దీన్ని చేస్తున్నారు. జిల్లాలో 12 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు 2705, మినీ అంగన్ వాడీ కేంద్రాలు 229 మంది ఉన్నాయి. వాటి పరిధిలో గర్భిణులు 14207 మంది, బాలింతలు 13078 మంది ఉన్నారు. కాగా, మాతృవందనం పథకం కింద మహిళ తొలి కాన్పుకు రూ.5వేలు ఇస్తారు. రెండో కాన్పులో ఆడపిల్ల పుడితే దశల వారీగా రూ.6వేలు వారి ఖాతాల్లో జమచేస్తారు.

ఎవరు అర్హులంటే :

- తెల్లరేషన్ కార్డులందరూ మాతృవందనం పథకానికి అర్హులు.
- గర్భం దాల్చగానే దగ్గరలోని అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్తలను సంప్రదించి ఆధార్‌తోపాటు ఇతర వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది.
- అంగన్‌వాడీ సిబ్బంది గర్భిణి వివరాలతో రిజిస్ట్రేషన్ చేసిన తరువాత కొన్ని నెలలకు రూ1000, ప్రసవం అనంతరం రూ.2వేలు, బిడ్డకు ఏడాది వయసులో టీకాలు వేయిం చటం పూర్తయిన తరువాత రూ.2వేలు చొప్పున తనల్లి ఖాతాలో జమచేస్తారు.
- రెండో కాన్పులో ఆడపిల్ల పుడితే రూ2వేల వంతున మూడు విడతల్లో అందచేస్తారు.



నెల్లూరులోని కొండాయపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో ఇటీవల గర్భిణులకు సామూహిక సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది (ఫైల్)

వివరాలు నమోదు చేయిస్తున్నాం



ప్రధాన మంత్రి మాతృ వందనం పథకం కింద లబ్ధి చేకూర్చడానికి గర్భవతుల వివరాలు నమోదు చేయిస్తున్నాం. నమోదు తర్వాత సీడీపీవోల ట్యాబ్‌లకు ఓటీపీ వస్తుంది. అర్హులైన వారు అంగన్‌వాడీ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

- హేనా సుజన్, ప్రాజెక్టు డైరెక్టర్, ఐసీడీఎస్

● నిబంధనలకు తిలోదకాలు ● యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు

● మోసపోతున్న సామాన్యులు ● పట్టించుకోని అధికారులు

మెట్టలో జోరుగా రియల్ దందా

ఉదయగిరి రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో రియల్టర్లు నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు వేస్తున్నారు. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగిన అక్రమ రియల్ దందాకు నేడు కూడా కొనసాగుతున్నది. రోజుకో ప్రాంతంలో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వేలుస్తున్నాయి.

● అధికార పార్టీ నేతల అండ

కొంతమంది అధికార పార్టీ నేతల అండతో పంచాయతీ అనుమతులు కూడా పొందని వ్యాపారులు ఇష్టానుసారంగా రియల్ వ్యాపారం సాగిస్తున్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే వ్యాపారులకు అనుకూలంగానే అధికారులు కూడా వత్తాసు పలుకుతున్నారు. అంతేకాక అనుమతులు ఉన్నాయని బుకాయిస్తున్నాయి. నిన్నటి వరకు జాతీయ రహదారులు, పట్టణాలకు సమీపంలోని ప్రాంతాల్లో మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతున్న ఈ వ్యాపారం ప్రస్తుతం పల్లెలకు కూడా పాకింది. ప్రధానంగా ఉదయగిరి, ఆత్మకూరు, కావలి, కందుకూరు తదితర నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో వీటి ప్రభావం అధికంగా ఉంది. కొంతమంది వ్యాపారులు రాత్రికిరాత్రే లేఅవుట్లు వేసి విక్రయాలు సాగిస్తున్నారు. కేవలం వ్యాపారులు, మధ్యవర్తుల మాయ మాటలు నమ్మిన ప్రజలు ప్లాట్లు కొనిమోసపోతున్నారు. మెట్ట మండలాలు అయిన వరికుంటపాడు, ఉదయగిరి, దుత్తలూరు, వింజమూరు, కలిగిరి తదితర ప్రాంతాల్లో ఇలాంటి అక్రమ లేఅవుట్లు అధికంగా ఉన్నాయి. ఇదంతా ఒకవంతైతే నెల్లూరు- ప్రకాశం జిల్లా సరిహద్దు మండలమైన వరికుంటపాడులో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. జిల్లా కేంద్రానికి శివారు ప్రాంతం కావడంతో ఉన్నతాధికారుల తనిఖీలు ఉండవనే ధీమాతో వ్యాపారులు, అధికారులు నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తున్నారు. అంతేకాక మండలం మీదుగా 565, 167బీ జాతీయ రహదారులు వెళుతుండటం, భవిష్యత్తు రైలుమార్గం కూడా చేరువ అవుతుందనే ఆశకల్పిస్తూ వ్యాపారులు దందా సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో విరువూరు, వేంపాడు, రామాపురం, వరికుంటపాడు, ధర్మవరం, గువ్వాడి, జీ.కొండారెడ్డిపల్లి, తూర్పురొంపిదొడ్ల, భోగ్యంవారిపల్లి తదితర గ్రామాల్లో సుమారు 170 ఎకరాల్లో దాదాపు 3వేల వరకు ప్లాట్లు వేసి విక్రయాలు సాగిస్తున్నారు. పట్టణాలకు చేరువ కావచ్చనే ఆశతో ప్లాట్లు కొన్నప్పటికీ, తమ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు భవిష్యత్తులో ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. కాగా మరికొంతమంది వ్యాపారులు తమ స్థలాలకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూములను సైతం ఆక్రమించుకుని ప్లాట్లు వేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి అక్రమ లేఅవుట్లకు అడ్డుకట్ట వేయాలి.



జీ.కొండారెడ్డిపల్లిలో వేస్తున్న లేఅవుట్

వికసిత్ భారత్‌పై వర్క్‌షాప్

నెల్లూరు(విద్య), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్కూలింగ్.. బిల్డింగ్ బ్లాక్స్ అనే అంశంపై జిల్లాస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు మాట్లాడుతూ భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్న లక్ష్యంతో అందరూ పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని అధిగమించేందుకు, ఉత్తమ విద్యా ప్రమాణాలు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుని అమలు చేస్తామని తెలిపారు. అనంతరం పలు అంశాలపై చర్చించి, వాటి అమలుకు ఐదుమంది విద్యావేత్తలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య, ఉప విద్యాశాఖాధికారులు, సెక్టోరియల్ అధికారులు, ఎంఈవోలు, ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో బాలాజీరావు

నులిపురుగుల సమస్యపై అవగాహన పెంచుకోవాలి

వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నులిపురుగుల వల్ల ఎదురయ్యే సమస్యలపై అవగాహన పెంచుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి సూచించారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా నెల్లూరులోని వైవీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కడుపులో నులిపురుగుల వల్ల రక్తహీనతకులోనై పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పౌష్టికాహార లోపం, బలహీనత, ఆందోళన, కడుపు నొప్పి, వాంతులు, అతిసార వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. ఇలాంటి వారిలో శారీరక, మానసిక ఎదుగుదల మందకొడిగా సాగుతుందన్నారు. ఈ కారణంగా విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టలేరన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల్లో నులిపురుగుల నివారణకు కేంద్ర ప్రభుత్వం ఏటా రెండుసార్లు డీవార్మింగ్ డే నిర్వహిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ యశ్వంత్, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి హేనాసుజన్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ అనుమానాస్పద మృతి

రాపూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పులిగిలపాడు వద్ద ఉన్న ఎస్‌ఎల్వీ స్టోన్ క్రషర్‌లో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న పులిగిలపాడుకి చెందిన గుర్రం శ్రీనివాసులు (35) అనుమానాస్పదంగా మృతి చెందాడు. మంగళవారం ఉదయం ఎక్స్‌కవేటర్ ఆపరేట్ చేస్తుండగా గుండెపోటుతో సీటులోనే కుప్పకూలి మృతి చెందాడని అక్కడి అధికారులు మృతుడి బంధువులకు, పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఈ ఘటనపై మృతుడి బంధు వులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

యువకుడి బలవన్మరణం

రాపూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సిద్ధలయ్య సెంటర్‌కు చెందిన బక్కి కిషోర్ (25) మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకోగా, చుట్టుప క్కల వారు గమనించి హుటా హుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ వెంకటరాజేష్ తెలిపారు.



కిషోర్ (ఫైల్)

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

● ఎల్‌డీఎం మణిశేఖర్

కావలి రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేస్తూ రికవరీ శాతాలను పెంచుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎస్.మణి శేఖర్ పేర్కొన్నారు. మంగళవారం కావలి ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన బ్యాంకర్లు, ప్రభుత్వశాఖల అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల పురోగతిని బ్యాంకుల వారీగా చర్చిం చారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమాయోజన, ప్రధాన మంత్రి సుర క్షాయోజన పథకాలు 100 శాతం ఖాతాదారులకు చేరువ చెయ్యాలన్నారు. టాటా ఏఐహెచ్ ద్వారా చేపడుతున్న పంటల బీమా స్కీం ప్రతి రైతు సద్వినియోగ పర్చుకునేలా చూడాలన్నారు. అలాగే వెటర్నరీ డిపార్టు మెంట్ సర్టిపై చేసిన వారికి డెయిరీ రుణాలు విస్తృతంగా ఇవ్వాలని, రికవరీలో సమస్యలుంటే వెటర్నరీ డిపార్టుమెంట్ ద్వారా క్లియర్ చేసుకోవాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన మైక్రో క్రెడిట్ ప్లాన్ అనుసరించి రుణాలు మంజూరు చెయ్యాలని, అందుకు సంబంధించిన సమస్యలుంటే ఎప్పటికప్పుడు ఏపీఎం, సీసీలతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజల జీవనోపాధి మెరుగుకు రుణాలు పెంచి ఇవ్వాలని గత సమావేశంలో కలెక్టర్ నిర్ధారించారని, వ్యవసాయానికే కాకుండా ఇతర జీవనోపాధులకు కూడా విరివిగా రుణాలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాబార్డు డీడీఎం బాబు, కెనరాబ్యాంక్ కావలి-2 సీనియర్ మేనేజర్ సునీల్ కుమార్, ఎంపీడీవో కార్యాలయ ఏవో సంధ్యాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ మణిశేఖర్



శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న డీపీఎం రాజ్‌కుమార్, తదితరులు

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం పదిలం

● డీపీఎం రాజ్‌కుమార్

కావలి రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులవాడకం లేని ప్రకృతి వ్యవసాయంతో ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లిలో వై.మాధవరావుకు చెందిన బయోరిసోర్స్ సెంటర్‌లో మంగళవారం 5 జిల్లాల బయోరిసోర్స్ సెంటర్‌ల యజమానులకు ఈ నెల 14వ తేదీ వరకు జరగనున్న శిక్షణ తరగతులను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయోరిసోర్స్ సెంటర్‌ల విధులు, బాధ్యతలు వివరించారు. విత్తనాల కిట్ల తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నాణ్యమైన విత్తనాలు, కషాయాలు రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే ఎగ్‌ఎమినో యాసిడ్, పంచగవ్యదశపర్ని, పచ్చిమిర్చి వెల్లుల్లి ద్రావణం, ఘనజీవామృతం తయారీ విధానాలను వివరించారు. అనంతరం పొలాల్లో పంటలు వేసే విధానం, ఫీల్డులో వేసిన పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం మునిరత్నం, ప్రకృతి వ్యవసాయ స్టేట్ రిసోర్స్‌పర్సన్ మన్మోహన్, ఏడీఏ నాగరాజు, నెల్లూరు, బాపట్ల, పల్నాడు, ఒంగోలు, గుంటూరు జిల్లాల బయోరిసోర్స్ సెంటర్‌ల యజమానులు, గ్రామ రైతులు, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది, మెంటార్ కళావతి, ప్రకృతి వ్యవసాయ శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుడికి ఘన నివాళి

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ వ్యవస్థ పితామహుడు డాక్టర్ ఎస్‌ఆర్ రంగనాథం జయంతిని మంగళవారం నెల్లూరులోని జిల్లా గ్రంథాలయ సంస్థలో ఘనంగా నిర్వహించారు. దీనిని రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథ పాలకుల దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్‌ఆర్ రంగనాథం చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా, గ్రంథ పాలకులు పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రంథాలయ వ్యవస్థ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కీర్తించారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన గ్రంథపాలకుడు రవీంద్రరెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జితేంద్ర, కృష్ణయ్య, మేరీ గ్రేస్, గిరిజమ్మ తదితరులు పాల్గొన్నారు.



గ్రంథపాలకుడిగా ఉద్యోగ విరమణ పొందిన రవీంద్రరెడ్డిని సన్మానిస్తున్న గ్రంథాలయ సంస్థ అధికారులు, సిబ్బంది

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

● జేసీ కార్తీక్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : అనధికార లేఅవుట్ల యజమానులు, వాటిలో స్థలాలు కొనుగోలు చేసిన వారు ల్యాండ్ రెగ్యులరేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని జేసీ కార్తీక్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. నెల్లూరు కలెక్టరేట్‌లో మంగళవారం ఎల్‌ఆర్ ఎస్‌పై తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఏడాది జూన్ ముందు వరకు వేసిన అనధికార లేఅవుట్లు, ప్లాట్లను చట్టబద్ధం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం స్వల్ప అపరాధ రుసుంతో ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్ ద్వారా మంచి అవకాశం కల్పించిందన్నారు. త్వరలో అన్ని మండలాల్లో కూడా పర్యటించి ఈ స్కీంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. అక్టోబరు 24లోగా ఎల్‌ఆర్‌ఎస్‌కు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని సూచించారు. సందేహా లుంటే నెల్లూరులోని నుడా కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. జేసీ కార్తీక్ మాట్లాడుతూ లేఅవుట్ల క్రమబద్ధీకరణ స్కీంపై మండలస్థాయిలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ స్కీం గడువు దాటిన తర్వాత అనధికార లేఅవుట్లు ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, ఆ లేఅవుట్లకు విద్యుత్, రోడ్లు, డ్రైన్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఎటువంటి అనుమతులు రావని, ప్లాట్లు కూడా రిజిస్ట్రేషన్ కావని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ, నుడా ప్లానింగ్ ఆఫీసర్ హిమబిందు, సెక్రటరీ అల్లంపాటి పెంచలరెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జేసీ కార్తీక్, పక్కన సబ్‌కలెక్టర్ హిమవంశీ

యువ భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలి

● వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సునీత

వెంకటాచలం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ వయస్సుతో సంబంధం లేకుండా పోటీపడి యువ భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత పిలుపునిచ్చారు. వీఎస్‌యూలో మంగళవారం సెట్నెల్, నెహ్రూ యువకేంద్రం, వీఎస్‌యూ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. యువత మంచి మార్గం వైపు అడుగులు వేయాలని రిజిస్ట్రార్ సూచించారు. కార్యక్రమంలో సెట్నెల్ సీఈఓ నాగేశ్వరరావు, నెహ్రూ యువకేంద్రం అధికారి ఎం మహేంద్రరెడ్డి, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అధికారి హరికృష్ణ, స్టూడెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ హనుమారెడ్డి, శ్రీనివాసులు, గయాజ్ తదితరులు పాల్గొన్నారు.